www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కృష్ణమ్మకు మళ్లీ వరద

శ్రీశైలంలో ఓ గేటెత్తిన అధికారులు
దిగువకు 27,478 క్యూసెక్కుల విడుదల
విద్యుదుత్పాదనతో మరో 67,185 క్యూసెక్కులు
డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వ 208 టీఎంసీలు
నాగార్జునసాగర్‌లో 255 టీఎంసీలు
పులిచింతలలో 19.37 మాత్రమే 12
భారీగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
నేడు, రేపు భారీ వర్షాలు.. రేపు అల్పపీడనం


శ్రీశైలంలో ఒక గేటు ఎత్తి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

బుధవారం | 23-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 137 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి రా.2:29 తదుపరి అమావాస్య, నక్షత్రం: ఆర్ద్ర సా.5:54 తదుపరి పునర్వసు, వర్జ్యం: తె.5:19-6:50, దుర్ముహూర్తం: ఉ.11:55-12:47, అమృతఘడియలు: ఉ.8:31-10:01, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:55, సూర్యాస్తమయం: 6:47

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అది విషమే!

అత్యంత హానికరంగా 'జే బ్రాండ్' మద్యం

2022లోనే ధ్రువీకరించిన చెన్నై ల్యాబ్
నరాలు, రక్త ప్రసరణ, చర్మంపై దుష్ప్రభావం
అయినా పట్టించుకోని జగన్ సర్కార్
మద్యంతో సొమ్ము చేసుకోవడమే లక్ష్యం
మరీ నాసిరకంగా తయారైన చీప్ లిక్కర్
ప్రమాణాలు, నాణ్యతకు తిలోదకాలు
శుద్ధి చేయని ఈఎన్ఏతోనే తయారీ
నాటి ఆరోపణలు నిజమని ధ్రువీకరించిన వైద్య సేవ ట్రస్టు నివేదిక

"ఈ మందు ఎంత తాగినా ఎక్కట్లేదురా! ఇంతకు ముందు నైన్టీ తాగితే సరిపోయేది. కానీ, ఇప్పుడు క్వార్టర్ తాగినా పెద్దగా ఎక్కినట్లు అనిపించడం లేదు'

'ఆ బ్రాండ్ ఏదో తేడాగా ఉంది మామా. తాగిన వెంటనే ఎక్కుతుంది. కొద్దిసేపటికే దిగిపోతుంది. దీంతో మళ్లీ సీసా కొనక తప్పట్లేదు'

- గత ప్రభుత్వంలో మందుబాబుల మధ్య తరచూ ఇలాంటి చర్చలే జరిగేవి. చీప్ లిక్కర్ తాగే వాళ్లు చుక్క పడగానే తిక్క తిక్కగా మాట్లాడటం సహజం. కానీ... జే బ్రాండ్లు తాగాక వారి ప్రవర్తన ఇంకా చిత్రంగా మారిపోయేది. ఎందుకంటే... వాళ్లు తాగింది మద్యం కాదు! నెమ్మదిగా మనిషిని చంపే విషం!



(అమరావతి - ఆంధ్రజ్యోతి)


చట్టబద్ధమైన హెచ్చరిక... 'మద్యపానం హానికరం'! ప్రయోగశాలల్లో పరీక్షించి మరీ చేసిన హెచ్చరిక... 'జగన్ హయాంలో విక్రయించిన మద్యం విషంతో సమానం. ఇది మరింత ప్రమాదకరం!'

ఔను నిజం! జగన్ హయాంలో విక్రయించిన చీప్ లిక్కర్‌తో మత్తెక్కడం సంగతి అటుంచితే కిడ్నీలు, లివర్‌లు దెబ్బతినడం, నాడీవ్యవస్థ బలహీనం కావడం ఖాయమని 2022లోనే స్పష్టమైంది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు రూపొందించిన నివేదికతో... అది నిజమని ఇప్పుడు రుజువైంది. అప్పట్లో వైసీపీ రెబల్ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు... జగన్ హయాంలో విక్రయించిన బ్రాండ్లపై అనుమానంతో చెన్నైలోని ఎస్‌జీఎస్ ల్యాబ్స్‌లో పరీక్షలు చేయించారు. వాటిలో ప్రమాదకర

మిగతా 14వ పేజీలో...

తనదాకా వస్తే!?

సీనియర్లతో జగన్ వరుస భేటీలు
మిథున్ అరెస్టుతో ఉలికిపాటు
చార్జిషీటులో తన పేరుతో టెన్షన్
సాంకేతిక ఆధారాలతో సిట్ ఉచ్చు
కేడర్‌లో స్థైర్యం నింపడంపై చర్చ
ఫలితమివ్వని నిరసన పిలుపులు
ఎమ్మెల్యేల రాజీనామాకు యోచన
దాంతో లాభం ఉండదన్న నేతలు 13



మళ్లీ తెరపైకి జిల్లాల పునర్విభజన!

ఏడుగురు మంత్రులతో ఉపసంఘం
జిల్లాల పేర్ల మార్పు, డివిజన్లు, మండల, గ్రామాల సరిహద్దులపై ప్రజల విన్నపాల పరిశీలన
సరిహద్దులు, చారిత్రక నేపథ్యంపై అధ్యయనం
ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలించాలని సూచన
నివేదికకు కాలపరిమితి విధించని వైనం

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. జిల్లాల పేర్ల మార్పు.. డివిజన్లు, మండలాలు, గ్రామాల సరిహద్దులపై ప్రజల నుంచి వచ్చిన విన్నపాలు పరిశీలించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు(జీవో 1378) జారీ చేశారు. ఉపసంఘంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, హోం మంత్రి వంగలపూడి అనిత, ఆర్ అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సభ్యులు. జగన్

మిగతా 13వ పేజీలో...

రాజీనామాకు కారణాలేమిటి?

ధన్‌ఖడ్ ఆకస్మిక నిర్ణయంపై పలు విశ్లేషణలు

నితీశ్‌కు కట్టబెట్టేందుకు బీజేపీ అమలుపరిచిన వ్యూహంలో భాగమా?



కొత్త ఉపరాష్ట్రపతి ఎవరు?

తెరపైకి నితీశ్, హరివంశ్, నడ్డా, థరూర్ పేర్లు!
ప్రతిపక్షాల నిరసనల హోరు
పార్లమెంటు ఉభయసభల్లో గందరగోళం
బిహార్ ఓటరు జాబితా సవరణపై చర్చకు పట్టు

జస్టిస్ వర్మ అభిశంసనపై ప్రభుత్వంతో పెరిగిన అంతరం
విపక్ష ఎంపీల నోటీసు స్వీకరించడంపై కేంద్రం గుస్సా
న్యాయవ్యవస్థపై వ్యాఖ్యలతోనూ కేంద్రం అసహనం
ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం
గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర హోం శాఖ
అనేక పదవుల ద్వారా ధన్‌ఖడ్ ప్రజాసేవ చేశారు: ప్రధాని
ధన్‌ఖడ్ రాజీనామా వెనుక లోతైన కారణాలున్నాయి
రైతుబిడ్డకు మర్యాదపూర్వక వీడ్కోలు లభించలేదు: జైరాం

పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆ రాష్ట్ర సీఎం మమతతో చీటికీమాటికీ జగడాలకు దిగిన వ్యక్తిగా, ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన తర్వాత ఏకంగా న్యాయవ్యవస్థపైనే తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వ్యక్తిగా దేశప్రజలకు చిరపరిచితమైన జగదీప్ ధన్‌ఖడ్ (74).. తన పదవికి రాజీనామా చేస్తారని ఎవరూ ఊహించలేదు. మరో రెండేళ్ల పదవీకాలం ఉండగానే.. ఉపరాష్ట్రపతి వంటి అత్యున్నత పదవికి ఆయన ఎందుకు రాజీనామా చేశారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ధన్‌ఖడ్ రాజీనామాకు గల కారణాలపై పలు విశ్లేషణలు వెలువడుతున్నాయి.. వాటిలో ఒకటి.. బిహార్ ఎన్నికలకు సంబంధించినది. త్వరలో ఎన్నికలు జరగనున్న ఆ రాష్ట్రంలో బీజేపీ ఇప్పటి వరకూ సొంతంగా అధికారంలోకి

మిగతా 2వ పేజీలో...

చాణక్య, వరుణ్.. దుబాయ్‌లో

మా ఫ్లాట్‌లోనే ఉన్నారు

రెండు నెలల పాటు ఆరుగురి మకాం
సిట్‌కు లిక్కర్ స్కాం నిందితుల ఫుటేజీ, ఫొటోలు ఇచ్చిన 'ఆకర్ష్' కృష్ణ



దుబాయ్‌లోని పారమౌంట్ టవర్స్

మిథున్‌కు ఇంటి భోజనం

2 పూటల ఆహారం ఒకేసారి తీసుకెళ్లడానికి కోర్టు అనుమతి
ప్రత్యేక సెల్, సహాయకుడు, టేబుల్, పెన్ను, పేపర్లు, పత్రికలు, టీవీ, మినరల్ వాటర్, కూలర్, కమోడ్, మందులు ఏర్పాటు చేయాలి
వారానికి మూడేసి ములాఖత్‌లు.. ఏసీబీ కోర్టు తీర్పు 14
ఆ నగదుపై వివరణ ఇవ్వండి.. చెవిరెడ్డి, బాలాజీకి సిట్ నోటీసులు జారీ

పంటలపై శాటిలైట్ సర్వే

సర్వే నంబరు ఆధారంగా పంటల గుర్తింపు
రీసర్వే తర్వాత వ్యవసాయ రికార్డుల నవీకరణ
కృత్రిమ మేధతో ఉత్పత్తులకు విలువ జోడింపు
ఉద్యాన పంటల్లో సూక్ష్మసేద్యం 'గేమ్ చేంజర్'
ఆయకట్టు చివరి వరకు సాగునీటి విడుదల
ఆగస్టు 20లోగా 'బర్లీ' కొనుగోలు పూర్తి
తోతాపురి రైతులకు 15లోగా చెల్లింపులు
విత్తనాలు, ఎరువుల విక్రయంపై ట్రాకింగ్
వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
త్వరలో నీటి సంఘాలతో వర్చువల్ భేటీలు
ఆర్గానిక్ సర్టిఫికేషన్‌కు టాటా సంస్థతో ఒప్పందానికి ముఖ్యమంత్రి ఆమోదం


వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ సర్వే నంబరు భూమిలో ఏయే పంటలు పండిస్తున్నారో శాటిలైట్ సర్వే చేపట్టి వివరాలు సేకరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రాపురంలో శాటిలైట్ సర్వేతో సమగ్ర సమాచారం వెల్లడైందని, అలాగే క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని శాటిలైట్ సర్వే సమాచారంతో సరిపోల్చాలని సూచించారు. ఒక ప్రాంతంలో ఒకే తరహా పంటలు వేసేలా రైతులకు దిశానిర్దేశం

మిగతా 13వ పేజీలో...

● ఏపీకి సినిమా పరిశ్రమ వస్తుందా...?

చిత్ర పరిశ్రమ ఏపీకి కొత్తగా రావలసిన అవసరం లేదు. కొత్త మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలి. ఇక్కడ ఫిల్మ్ డెవలప్‌మెంట్ స్కూల్ రావాలి. దీని వల్ల చిత్ర నిర్మాణాలు పెరుగుతాయి. అన్నీ ఉంటే సినిమా ఇండస్ట్రీ ఏపీకి వస్తుంది. తగిన వసతులు, సౌకర్యాలు పెరగాల్సిన అవసరం ఉంది.



నా తొలి ప్రాధాన్యం రాజకీయాలకే!

'హరిహర వీరమల్లు' ప్రచారం నా బాధ్యత: పవన్ కల్యాణ్

ప్రత్యేక పరిస్థితుల్లో చేయాల్సి వచ్చింది.. నా నిర్మాతలు తీవ్రంగా నష్టపోయారు
ఇది తీయడానికి ఐదేళ్లు పట్టింది.. రెండేళ్లు కరోనాతో ఇబ్బందులు
ఆ తర్వాత జగన్‌తో మ్యాన్‌మేడ్ డిజాస్టర్.. ఆనక చేద్దామనుకుంటే చంద్రబాబును అరెస్టు చేశారు.. వైజాగ్‌లో నన్నూ ఇబ్బంది పెట్టారు
ప్రభుత్వంలోకి వచ్చాక ఆరు నెలలు పాలనపై పూర్తిగా దృష్టి పెట్టాను
ఆ తర్వాత మిడ్‌వ్యాలీలో సెట్టింగ్ వేసి షూటింగ్ చేశాం: పవన్ 11


12

క్వార్ట్జ్ కేసులో అనిల్‌యాదవ్ పేరు!

అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డి అరెస్టు.. వాంగ్మూలం
కాకాణి, అనిల్‌తో కలిసి అక్రమ మైనింగ్ చేశా
'క్వార్ట్' డబ్బులతో నేను, అనిల్ వెంచర్లు వేశాం
విచారణలో వెల్లడించిన బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి
మాజీ మంత్రిని నిందితుడిగా చేర్చిన పోలీసులు!



'శవం డోర్ డెలివరీ' కేసును మళ్లీ

విచారించండి

రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం తీర్పు
90 రోజుల్లో సప్లిమెంటరీ చార్జిషీట్‌కు ఆదేశం
సొంత డ్రైవర్ హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు ఝలక్ 12


చైనా డ్యాం నిర్మించనున్న ప్రాంతం

భారత్‌పై జల ఖడ్గం!

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్!

సరిహద్దు సమస్య కన్నా తీవ్రమైనది
డ్యామ్ నిర్మాణ ప్రాంతం.. భూకంప జోన్
భూకంపం వస్తే దిగువకు అతి భారీ వరదలు
చైనా కావాలని నీటిని వదిలినా ప్రమాదమే!
పర్యావరణంపైనా తీవ్ర ప్రభావం 2

ఎయిరిండియా విమానంలో మంటలు



హాంకాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఫ్లైట్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం 2
సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు

కోతలకు కట్టడి!

సహజ ప్రసవాల పెంపునకు 'మిడ్‌వైవ్స్'
86 ప్రభుత్వాసుపత్రుల్లో 1,264 మంది ప్రసూతి సహాయకుల నియామకం
ఒక్కొక్కరిపై శిక్షణకు 2.50 లక్షల వ్యయం: మంత్రి సత్యకుమార్ 12




దొంగ రిజిస్ట్రేషన్ జరిగిన గోరంట్ల పరిధిలోని భూమి

'పల్నాడు'లో భూ బకాసురులు! 3

రూ.40 కోట్ల విలువైన భూమికి ఎసరు
చనిపోయిన మనిషి బతికున్నట్లు చూపించారు
20 దొంగ రిజిస్ట్రేషన్లు చేసిన 'పేట' రిజిస్ట్రార్
చర్యలు తీసుకునేందుకు పోలీసులు ససేమిరా
మంత్రి లోకేశ్ జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు

టీటీడీలో అన్యమత ఉద్యోగుల లెక్క తేలుస్తాం

వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణానికి నిపుణుల కమిటీ 3
ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ ల్యాబ్
టీటీడీ బోర్డు నిర్ణయాలు



'సిద్ధార్థ మెడికల్'లో సీట్లన్నీ మనోళ్లకే

- తెలంగాణ కోటా 36 శాతం సీట్లు రద్దు
- కేంద్రం కోటా పోను ఏపీకి 212 సీట్లు
- ఏయూకు 139, ఎస్వీ రీజియన్‌కు 73.. సర్కారు కీలక నిర్ణయం

విజయవాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలను రాష్ట్రస్థాయి విద్యాసంస్థగా కొనసాగిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే, తెలంగాణ ప్రాంత విద్యార్థులకు ఈ కళాశాలలో కేటాయించిన సీట్లను కూడా రద్దు చేసింది. దీంతో సిద్ధార్థ సీట్లలో ఉస్మానియా రీజియన్‌కు కేటాయించిన 36 శాతం సీట్లు మన రాష్ట్ర విద్యార్థులకే దక్కనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యార్థులు మెడికల్ సీట్లను పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటడంతో నిబంధనల మేరకు ఈ సీట్లను పూర్తిగా రాష్ట్ర విద్యార్థులకే కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆంధ్రా యూనివర్సిటీ(ఏయూ), శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్వీయూ) రీజియన్లకు 77 సీట్లు అదనంగా పెరగనున్నాయి.

ఇప్పటి వరకు..: సిద్ధార్థ మెడికల్ కళాశాల పరిధిలో 250 మెడికల్ సీట్లు ఉన్నాయి. వీటిలో 15 శాతం(38 సీట్లు) అఖిల భారత కోటాలో భర్తీ అవుతాయి. మిగిలిన 212 సీట్లలో ఉస్మానియా రీజియన్‌కు 36 శాతం(77 సీట్లు) కేటాయించారు. ఇవి పోగా ఏపీకి 135 సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో 1974లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డీ ప్రకారం వైద్య కళాశాలల సీట్లను ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్‌కు 42 శాతం, ఎస్వీయూ రీజియన్‌కు 22 శాతం కేటాయించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం తమ యూనివర్సిటీల్లో తమ వారికే సీట్లను కేటాయించింది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.

ఇదీ లెక్క!

- సిద్ధార్థ వైద్య కళాశాల పరిధిలో సీట్లు: 250
- అఖిల భారత కోటాలో ఇవ్వాల్సిన సీట్లు: 38
- తెలంగాణ కోటా రద్దుతో మిగిలే సీట్లు: 212
- ఏయూ రీజియన్‌కు(65.62 శాతం): 139
- ఎస్వీ రీజియన్‌కు(34.38 శాతం): 73

రూల్స్‌కు సవరణ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలలో సీట్ల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నిబంధనలకు సవరణ చేసింది. దీని కోసం ఏపీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ యాక్ట్‌ను సవరించింది. ఈ సవరణలో భాగంగా ఏపీ ప్రొఫెషనల్ ఇనిస్టిట్యూషన్స్ నిబంధనల్లో కూడా కొన్ని మార్పులు చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిని శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్వీయూ) పరిధిని రాయలసీమ జిల్లాలతో పాటు కొత్తగా నెల్లూరు జిల్లా వరకు నిర్ధారించింది. దీంతో పాటు స్థానిక విద్యార్థులుగా ఎవరిని పరిగణించాలి?. వారికి ఏయే వర్సిటీల్లో సీట్లు కేటాయించాలన్న నిబంధనలను కూడా సవరణ ఉత్తర్వుల్లో పేర్కొంది.

పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల హోరు

న్యూఢిల్లీ, జూలై 22: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రెండో రోజు, మంగళవారం కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో గందరగోళం కొనసాగింది. ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు చేసిన నిరసనలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి. దీంతో పలుమార్లు వాయిదాలు పడిన ఉభయసభలు ఎలాంటి చర్చలు లేకుండానే బుధవారానికి వాయిదా పడ్డాయి. ఎస్ఐఆర్, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేశారు. కాగా, ప్రతిపక్ష సభ్యులు ద్వంద్వ వైఖరి అనుసరిస్తున్నారని, వారి డిమాండ్‌కు అనుగుణంగా చర్చ నిర్వహిస్తామని చెప్పినా సహకరించడం లేదని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు అసహనం వ్యక్తం చేశారు. అటు రాజ్యసభ కూడా ఎస్ఐఆర్ అంశంపై ప్రతిపక్షాల నిరసనలతో పలుమార్లు వాయిదా పడింది. కాగా, ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్ మకర్ ద్వారం వద్ద ఆందోళన చేశారు.

భారత్ అమ్ములపొదిలోకి 3 అపాచీ హెలికాప్టర్లు

న్యూఢిల్లీ, జూలై 22: అత్యంత శక్తివంతమైన అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు భారత అమ్ములపొదిలో చేరాయి. మూడు చాపర్లను అమెరికా ఏరోస్పేస్ దిగ్గజం బోయింగ్ మంగళవారం అందించిందని భారత ఆర్మీ అధికారులు తెలిపారు. ఒప్పందంలో భాగంగా మొత్తం 6 ఏహెచ్-64ఈ అపాచీ చాపర్లను ఆ కంపెనీ అందించాల్సి ఉండగా తొలిదశలో మూడు చాపర్లు ఇచ్చిందని వెల్లడించారు. బహుముఖంగా వినియోగించే అత్యాధునిక ఏహెచ్-64ఈ యుద్ధ హెలికాప్టర్లు అమెరికా ఆర్మీలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. వీటి రాకతో భారత ఆర్మీ సామర్థ్యాలు మరింత బలోపేతం అవుతాయని సోషల్ మీడియా పోస్టులో ఆర్మీ పేర్కొంది.

ఎట్టకేలకు నింగిలోకి బ్రిటన్ ఫైటర్ జెట్ 'ఎఫ్-35బీ'

తిరువనంతపురం, జూలై 22: సోషల్ మీడియాలో కడుపుబ్బనవ్వించే మీమ్స్‌కు, కామెంట్లకు దారితీసిన బ్రిటీష్ యుద్ధ విమానం ఎఫ్-35బీ దాదాపు 5 వారాల తర్వాత నింగిలోకి ఎగిరింది. గత నెలలో జరిగిన భారత్-బ్రిటన్ నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఎఫ్-35బీ విమానానికి అకస్మాత్తుగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఈ విమానాన్ని జూన్ 14న అర్ధరాత్రి కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉన్న అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో దింపేశారు. అప్పటి నుంచి ఆ విమానం అక్కడే ఉంది.

రాష్ట్రపతి సందేహాలపై మీ స్పందన తెలపండి

- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 22: 'బిల్లుల ఆమోదానికి నిర్దిష్ట గడువు' అంశంలో రాష్ట్రపతి ప్రస్తావించిన 14 కీలక ప్రశ్నలపై అభిప్రాయాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుధవారం నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై వచ్చే నెల నుంచి విచారణను కొనసాగిస్తామని, ఈ నెల 29న షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపింది. ఇది ఒక రాష్ట్రానికి మాత్రమే సంబంధించిన అంశం కాదని, యావత్ దేశానికి వర్తించేదని పేర్కొంది. వచ్చే మంగళవారానికల్లా కేంద్రం, రాష్ట్రాలు స్పందన తెలియజేయాలని సూచించింది. శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకోవాలని ఏప్రిల్ 8 సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే.

ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం



రాష్ట్రపతి ముర్ముతో ధన్‌ఖడ్(ఫైల్)

గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర హోం శాఖ

- ప్రజా సేవ చేయడానికి ఆయనకు అనేక పదవులు దక్కాయి: ప్రధాని
- రైతుబిడ్డకు మర్యాదపూర్వక వీడ్కోలు లభించలేదు: జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ, జూలై 22: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని కేంద్ర హోం శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ధన్‌ఖడ్ రాజీనామా లేఖను పొందుపరచింది. మంగళవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో.. సభాధ్యక్ష స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ ఘన్‌శ్యామ్ తివారీ.. ధన్‌ఖడ్ రాజీనామా రాష్ట్రపతి ఆమోదం పొందిన విషయాన్ని సభ్యులకు తెలిపారు. ఇక.. జగ్‌దీప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. ఉపరాష్ట్రపతి పదవి సహా వివిధ పదవులు, హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు జగదీప్ ధన్‌ఖడ్‌కు పలు అవకాశాలు దక్కాయని.. ఆయన ఆరోగ్యంగా ఉండాలని తాను కోరుకుంటున్నానని ఆయన ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు.. ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాకు కారణం ఆయన అనారోగ్యం అయి ఉండదని, మరింత లోతైన కారణాలేవో ఉండి ఉంటాయని విపక్షాలు అంటున్నాయి. ముఖ్యంగా.. పార్లమెంటు వర్షాకాల సమావేశాల మొదటిరోజైన సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4.30 గంటల నడుమ జరిగిన తీవ్ర పరిణామాలే ఆయనను ఈ నిర్ణయానికి పురికొల్పి ఉంటాయని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ధన్‌ఖడ్ అధ్యక్షతన సభావ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశం జరిగిందని.. దానికి రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ కిరెన్ రిజిజు సహా పలువురు సభ్యులు హాజరయ్యారని.. సాయంత్ర 4.30 గంటలకు మరోసారి భేటీ కావాలని సమావేశం నిర్ణయించిందని.. జైరామ్ రమేశ్ తన పోస్టులో వివరించారు. "సాయంత్రం 4.30 గంటలకు మళ్లీ ధన్‌ఖడ్ నేతృత్వంలో బీఏసీ సమావేశం మొదలైంది. జేపీ నడ్డా, రిజిజు రాక కోసం ఆ భేటీకి హాజరైన సభ్యులంతా ఎదురుచూశారు. కానీ.. వారిద్దరూ రాలేదు. వారి గైర్హాజరు గురించి ధన్‌ఖడ్‌కు వ్యక్తిగతంగా సమాచారమేదీ లేదు. దీంతో సహజంగానే ఆయన అసంతృప్తి చెందారు. బీఏసీ భేటీని మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు వాయిదా వేశారు. అంటే.. నడ్డా, రిజిజు ఉద్దేశపూర్వక గైర్హాజరుకు.. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4.30 గంటల నడుమ ఏదో తీవ్ర పరిణామమే జరిగింది" అని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు. అంతేకాదు.. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా గురించి మోదీ మాటమాత్రమైన ప్రస్తావించకపోవడం.. మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. ధన్‌ఖడ్ రైతుల సంక్షేమం కోసం ధైర్యంగా మాట్లాడేవారని, న్యాయవ్యవస్థ జవాబుదారీతనంపైనా బలంగా మాట్లాడారని పేర్కొన్నారు. ప్రస్తుత జీ2 (మోదీ, అమిత్‌షాలను ఉద్దేశించి) పాలనలో సైతం.. ధన్‌ఖడ్ విపక్షాలకు ఎంతో కొంత అవకాశం ఇవ్వడానికి ప్రయత్నించారని కొనియాడారు. ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపినప్పుడు బీజేపీ ఆయన్ను 'రైతు బిడ్డ'గా పదేపదే పేర్కొనడాన్ని ప్రస్తావిస్తూ.. 'రైతుబిడ్డకు మర్యాదపూర్వక వీడ్కోలు లభించలేదు' అని ధ్వజమెత్తారు. ఈ విషయంలో ప్రధాని మరింత కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరించి ఉండాల్సిందన్న జైరామ్ రమేశ్.. "అంతేలే! ఆయన అసలే కాపట్యానికి, వంచనకు సుప్రీం మాస్టర్ కదా" అని వ్యంగ్యంగా అన్నారు. అయితే.. జైరామ్ అనుమానాలను జేపీ నడ్డా కొట్టిపారేశారు. ఆ భేటీకి తాము రావట్లేదన్న విషయాన్ని ఉపరాష్ట్రపతి కార్యాలయానికి తాము ముందే తెలియజేశామన్నారు.

ఎన్డీయే కూటమికే సంఖ్యా బలం..

ధన్‌ఖడ్ రాజీనామా నేపథ్యంలో.. ఉపరాష్ట్రపతి పదవికి జరిగే ఎన్నికల్లో గెలవడానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీయే కూటమికి ఉంది. లోక్‌సభ, రాజ్యసభల్లో ఖాళీగా ఉన్న స్థానాలను మినహాయిస్తే.. ప్రస్తుతానికి ఉభయసభల్లో సభ్యుల సంఖ్య (రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులతో కూడా కలిపి) 786. ఉపరాష్ట్రపతిగా గెలవాలంటే 394 ఓట్లు రావాలి. లోక్‌సభలో ఎన్డీయేకి 293 మంది సభ్యుల బలం ఉంది. రాజ్యసభలో 129 మంది (నామినేటెడ్ సభ్యులను కూడా కలుపుకొంటే) సభ్యుల మద్దతు ఉంది. అంటే.. ఉభయసభల్లో కలిపి 422 మంది సభ్యుల మద్దతు. కాబట్టి ధన్‌ఖడ్ స్థానంలో మళ్లీ ఎన్డీయే అభ్యర్థి ఉపరాష్ట్రపతి కావడం ఖాయం.

లోకం తీరు



కొత్త ఉపరాష్ట్రపతి ఎవరు?

న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈ వర్షాకాల సమావేశాల్లోనే కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహించాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. తదుపరి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలా అనే అంశంపై అటు మోదీ ప్రభుత్వం, ఇటు విపక్షాలు మంతనాలు మొదలుపెట్టాయి. బిహార్ ఎన్నికల నేపథ్యంలో.. ఆ రాష్ట్ర సీఎం నీతీశ్ కుమార్ లేదా ప్రస్తుతం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్‌లో ఎవరో ఒకరిని ఎన్డీయే కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా జగత్ ప్రకాశ్ నడ్డా స్థానంలో మరొకర్ని నియమించనున్నందువల్ల.. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నడ్డాకే అవకాశం ఇవ్వొచ్చనే వాదన కూడా బీజేపీ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రతిపక్షాలను దెబ్బతీసేందుకు.. కాంగ్రెస్ అసమ్మతి నేత శశిథరూర్‌ను నిలబెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు.

రాజీనామాకు కారణాలేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

రాలేదు. ప్రస్తుతం నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూతో కలిసి కమలం పార్టీ కూటమి ప్రభుత్వం కొలువై ఉన్న విషయం తెలిసిందే. నితీశ్‌ను రాష్ట్ర రాజకీయాల్నించి తప్పించి, ఉపరాష్ట్రపతిని చేస్తే బిహార్‌లో బీజేపీ అవకాశాలు మరింత పెరుగుతాయని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తోందని, దాంట్లో భాగంగానే ధన్‌ఖడ్ రాజీనామా అని ఓ వాదన వినిపిస్తోంది. బిహార్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే హరిభూషణ్ ఠాకూర్ దీనిపై స్పందిస్తూ.. నితీశ్ ఉపరాష్ట్రపతి అయితే రాష్ట్రానికి ఎంతో మంచిదని పేర్కొనటం విశేషం.

ప్రభుత్వంతో పెరిగిన అంతరం

కేంద్రప్రభుత్వానికి, ధన్‌ఖడ్‌కు మధ్య అంతరం పెరిగిందని, ఈ నేపథ్యంలోనే ఆయన రాజీనామా చేశారన్నది మరో వాదన. దీని ప్రకారం.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ అభిశంసనపై ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన నోటీసును ధన్‌ఖడ్ స్వీకరించటం ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. ఓవైపు ఇదే అంశంపై లోక్‌సభలో ప్రభుత్వం నోటీసు ఇచ్చే ప్రక్రియలో ఉంది. ఇంతలోనే రాజ్యసభలో ప్రతిపక్షాల నోటీసును ధన్‌ఖడ్ స్వీకరించటంతో.. జస్టిస్ వర్మ అభిశంసన అంశం తాలూకు క్రెడిట్ తమకు దక్కకుండా పోయిందని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే, పార్లమెంటు సమావేశాల తొలిరోజైన సోమవారం జరిగిన రాజ్యసభ 'సభా వ్యవహారాల సంఘం' భేటీకి ప్రభుత్వం తరఫున సభ నాయకుడు జేపీ నడ్డా, పార్లమెంటు వ్యవహారాల మంత్రి కిరణ్ రెజిజూ హాజరు కాలేదని తెలుస్తోంది. ఈ భేటీ తర్వాత సభలో కార్యకలాపాలు మొదలయ్యాయి. ఆపరేషన్ సిందూర్ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబడుతుండటంతో.. నడ్డా వారిని హెచ్చరిస్తూ మాట్లాడారు. 'ఏదీ రికార్డుల్లోకి వెళ్లదు. నేను చెప్పినవి మాత్రమే రికార్డవుతాయి' అన్నారు. సభలో పూర్తి అధికారం సభాపతి అయిన ఛైర్మన్‌దే అయినప్పటికీ, నడ్డా ఈ విధంగా మాట్లాడటం సభాపతిని అవమానించటమేనంటూ కాంగ్రెస్ విమర్శించింది. ఈ విధంగా ప్రభుత్వంతో పెరిగిన అంతరం నేపథ్యంలోనే ధన్‌ఖడ్ రాజీనామా చేశారన్నది ఒక వాదన.

న్యాయవ్యవస్థపై తీవ్రవ్యాఖ్యలు

2022లో ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన తర్వాత న్యాయవ్యవస్థపై తరచూ విమర్శలు చేయటం ప్రారంభించారు. ప్రజాస్వామ్యంలో పార్లమెంటుదే అత్యున్నత పాత్ర అని, న్యాయవ్యవస్థ అప్పుడప్పుడూ పరిధి దాటి ప్రవర్తిస్తోందంటూ వ్యాఖ్యలు చేశారు. 'జాతీయ న్యాయ నియామకాల కమిషన్' చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మరీ శృతిమించటం ప్రభుత్వ పెద్దలకు చికాకు కలిగించిందని, దీనివల్లే ఆయనను పక్కన పెట్టారని మరో వాదన. ఏదేమైనా, తాను తన పదవీ కాలం పూర్తి చేసుకొని 2027 ఆగస్టులో రిటైర్ అవుతానని ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ఇటీవలే ప్రకటించిన ధన్‌ఖడ్..ఇంతలోనే మనసు మార్చుకోవటం విశేషం. - సెంట్రల్ డెస్క్

జగన్ హత్యకు 200 మంది షార్ప్ షూటర్స్

- అమెరికా నుంచి వచ్చారన్న యూట్యూబ్ చానల్
- జనసేన నేత ఫిర్యాదుతో కేసు

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): "మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి హత్యకు అమెరికా నుంచి 200 మంది షార్ప్ షూటర్స్ రంగంలోకి దిగారు. దీనిపై మా వద్ద పక్కా ఆధారాలున్నాయి. అంతకు ముందు జగన్ లక్ష్యంగా కర్ణాటక, హరియాణా నుంచి రెండు ముఠాలను దించిన వాళ్లే... ఇప్పుడు షార్ప్ షూటర్లను రప్పించారు" అంటూ ఒక యూట్యూబ్ చానల్ పేర్కొంది. జగన్‌తోపాటు తమిళనాడు సీఎం స్టాలిన్, కేంద్ర మంత్రి సురేశ్ గోపి, అలాగే కోయంబత్తూరుకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడికి ముప్పు ఉందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత దక్షిణ భారతదేశంలో అల్లకల్లోలం సృష్టించేందుకు పాకిస్థాన్ కొంతమందిని టార్గెట్ చేసిందన్నారు. ఈ కథనంపై గుంటూరుకు చెందిన జనసేన నేత యర్రంశెట్టి హరినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సంబంధిత చానల్ యాజమాన్యానికి, యాంకర్‌కు నోటీసులు ఇచ్చి వారి వద్ద ఉన్న ఆధారాలు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది.

తమిళనాడు, కేరళకు కేంద్రం గుండు సున్నా

- 2024-25లో విద్యా నిధుల కింద ఒక్క రూపాయి ఇవ్వని కేంద్రం.. ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 22: సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ), పీఎం-శ్రీ పథకాల కింద 2024-25లో తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ఎలాంటి నిధులు ఇవ్వలేదని కేంద్ర విద్యా శాఖ పేర్కొంది. 2023-24లో ఎస్ఎస్ఏ కింద తమిళనాడుకు రూ.1876.16 కోట్లు, కేరళకు రూ.141.66 కోట్లు ఇచ్చినట్టు వెల్లడించింది. అయితే, జాతీయ విద్యా విధానం-2020 అమలు కోసం రూపొందించిన పీఎం-శ్రీ పథకంలో భాగస్వామ్యం అయ్యేందుకు నిరాకరించడంతో ఆ రాష్ట్రాలకు నిధులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జూలై 21న పార్లమెంటుకు లిఖిత పూర్వక వివరణ ఇచ్చింది. మరోపక్క, 2024-25లో ఎస్ఎస్ఏ కింద ఉత్తరప్రదేశ్‌కు రూ.6,264.79 కోట్లు, పీఎం-శ్రీ కింద రూ.246.86 కోట్లు అందాయి. అలాగే, మధ్యప్రదేశ్‌కు ఎస్ఎస్ఏ కింద రూ.3,434.71 కోట్లు, పీఎం-శ్రీ కింద రూ.145.32 కోట్లు అందాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతోందన్న విమర్శలు అధికమయ్యాయి. అయితే, పీఎం- శ్రీ పాఠశాలల్లో జాతీయ విద్యా విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం చెబుతోంది. కానీ, జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు, కేరళలు ఎప్పట్నించో వ్యతిరేకిస్తున్నాయి.

ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు గుర్తింపు కోసమే..

- బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ఈసీ వివరణ

న్యూఢిల్లీ, జూలై 22: ఆధార్, ఓటర్ ఐడీ కార్డు, రేషన్ కార్డు కేవలం గుర్తింపు కోసమేనని ఎన్నికల కమిషన్(ఈసీఐ) స్పష్టం చేసింది. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ--స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యానికి సమాధానంగా ఈసీఐ మంగళవారం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితా శుద్ధీకరణ జరుగుతోందని.. దీనివల్ల అర్హత లేని వ్యక్తులను జాబితా నుంచి తొలగించడం సాధ్యమవుతుందని ఆ అఫిడవిట్‌లో వివరించింది. ఈ చర్యతో భారత రాజ్యాంగంలోని 19వ అధికరణకు భంగం కలుగుతుందనే పిటిషనర్ల వాదనలను ఖండిస్తూ.. ఎన్నికల ప్రక్రియను నిర్దేశించే ప్రకరణలు, చట్టాలను గురించి వివరించింది. ఈ క్రమంలోనే ఆధార్, ఓటర్ఐడీ, రేషన్ కార్డులను కేవలం గుర్తింపు ప్రయోజనాలకే పరిమితంగా వాడుతున్నట్లు తెలిపింది. "ఆధార్ అనేది పౌరసత్వానికి లేదా నివాస ధ్రువీకరణకు ఆధారం కాదు. ఈ విషయాన్ని ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 స్పష్టం చేస్తోంది" అని ఈసీ తన అఫిడవిట్‌లో గుర్తుచేసింది.

52 లక్షల మంది పేర్లు తొలగింపు

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణలో 52 లక్షల మంది పేర్లను తొలగించినట్లు ఈసీ ప్రకటించింది. ఇందులో 18 లక్షల మంది మరణించినట్లు గుర్తించామని, మరో 26 లక్షల మంది ఇత ర నియోజకవర్గాలకు మారారని వివరించింది. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉన్న 7 లక్షల మందిని తొలగించి, ఒకేచోట అవకాశం కల్పించినట్లు తెలిపింది. మరో 21.36 లక్షల మంది ఆచూకీ తెలియరావడం లేదని, వారిని వెల్లడించింది.

ఎయిరిండియా విమానంలో మంటలు

- హాంకాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఫ్లైట్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం
- సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు

న్యూఢిల్లీ, జూలై 22: మంగళవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం(ఏ321)లో స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం 12.12 గంటలకు ఢిల్లీ విమానాశ్రయంలో విమానం దిగిన కొద్దిసేపటికే ఆక్సిలరీ పవర్ యూనిట్ (ఏపీయూ)లో మంటలు చెలరేగాయి. అయితే విమానంలోని సాంకేతిక వ్యవస్థల కారణంగా ఏపీయూ ఆటోమేటిక్‌గా మూసుకుపోవడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులందరూ విమానంలోంచి సురక్షితంగా బయటకు వచ్చారు. ఈ ఘటనలో విమానం స్వల్పంగా దెబ్బతిందని ఎయిరిండియా ప్రతినిధి ఒకరు తెలిపారు.

భరణం కింద బీఎండబ్ల్యూ కారు, ముంబైలో ఇల్లు, 12 కోట్లు

- భర్త నుంచి కోరుతూ సుప్రీంకోర్టులో యువతి పిటిషన్
- ఉద్యోగం చేయడంపైన దృష్టి పెట్టాలని సీజేఐ హితవు

న్యూఢిల్లీ, జూలై 22: మనోవర్తి కింద భర్త నుంచి మీరు ఏం కోరుకుంటున్నారు? అని ఆమెను సీజేఐ జస్టిస్ గవాయ్ అడగ్గా "నాకు బీఎండబ్ల్యూ హైఎండ్ మోడల్ కారు కావాలి. ముంబైలోని ఖరీదైన ఇల్లు, పోషణ కింద రూ.12 కోట్ల నగదును ఇప్పించండి" అని ఆ భార్య సమాధానమిచ్చింది. పెళ్లయిన రెండేళ్లలోపే ఓ జంట విడాకులకు సిద్ధమైతే.. పెద్ద మొత్తంలో భరణం కోరుతూ భార్య సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీన్ని విచారించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, భారీ మొత్తంలో ఆ యువతి మనోవర్తి కోరడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "పెళ్లయిన 18 నెలలకే మీరు విడాకులు తీసుకుంటున్నారు. 18నెలల వైవాహిక జీవితానికి ప్రతిగా నెలకు రూ.కోటి చొప్పున భరణం కింద భర్తను కోరుతున్నారా" అని వ్యాఖ్యానించారు. "మీరు ఎంబీఏ చదివారు. ఐటీ ప్రొఫెషనల్ కూడా. మీకు సంపాదించుకునే సామర్థ్యం ఉంది. చక్కని ఉద్యోగం చేసుకోండి" అని పిటిషనర్‌కు సూచించారు. దీనికి ఆమె బదులిస్తూ.. తన భర్త పెద్ద ధనవంతుడని వివరించారు. తాను మానసిక సమస్యలతో బాధపడుతున్నానని ఆరోపిస్తూ ఆయనే తనకు విడాకులివ్వడానికి నిర్ణయించుకున్నారని చెప్పారు. "నేనేమైనా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లుగా అనిపిస్తోందా మై లార్డ్" అని జస్టిస్ గవాయ్‌ని ఆమె ప్రశ్నించారు. అయితే.. ముంబైలోని కాల్‌పతరులోని ఇల్లు.. అక్కడున్న మంచి భవనాల్లో ఒకటని.. ఆ ఇల్లు... లేదంటే రూ.4 కోట్ల భరణం తీసుకోవాలని జస్టిస్ గవాయ్ ఆమెకు సూచించారు.

భారత్‌పై జల ఖడ్గం!

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్.. సరిహద్దు సమస్య కన్నా తీవ్రమైనదే

న్యూఢిల్లీ, జూలై 22: బ్రహ్మపుత్ర నదిపై చైనా చేపట్టిన భారీ డ్యామ్.. భారత్‌కు ఎన్నో విధాలుగా నష్టానికి దారిస్తుందనే చర్చ జరుగుతోంది. చైనాతో ఉన్న సరిహద్దుల వివాదం కంటే కూడా ఈ డ్యామ్ తీవ్ర సమస్యగా మారుతుందనేటటట అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. బ్రహ్మపుత్ర నదిపై అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలోని న్యింగ్చి ప్రాంతంలో ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మాణ పనులను చైనా ప్రధాన మంత్రి లీ కియాంగ్ ఈ నెల 19న ప్రారంభించారు. సుమారు రూ.14.5 లక్షల కోట్లు (167.8 బిలియన్ డాలర్లు) వ్యయంతో చేపట్టిన ఈ డ్యామ్.. ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా. ఈ క్రమంలో నీటి నిల్వ అత్యంత భారీ స్థాయిలో ఉంటుంది. అయితే ఈ డ్యామ్‌తో నదిలో నీటి ప్రవాహం తగ్గే అవకాశం తక్కువేనని, కానీ చైనా ఎప్పుడైనా కావాలని ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే.. దిగువన పరీవాహక ప్రాంతాల్లో భారీ వరదలు వచ్చి నీట మునుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అరుణాచల్ సీఎం పెమా ఖండూ ఇటీవల ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ... చైనాతో మిలటరీ సమస్య కంటే డ్యామ్ అంశం పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. చైనా దీనిని ఒక 'నీటి బాంబు'లా ప్రయోగించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

డ్యామ్ నిర్మాణ ప్రాంతం.. భూకంప జోన్..

టిబెట్‌లో హిమాలయాల్లో జన్మించే బ్రహ్మపుత్ర నది (చైనాలో యార్లుంగ్ త్సాంగ్‌పోగా పిలుస్తారు) తూర్పు దిశగా ప్రవహించి... నమ్చా బర్వా పర్వత ప్రాంతంలో వెనక్కి తిరిగి (యూటర్న్) పడమర దిశగా ప్రవహిస్తుంది. ఈ మలుపు దగ్గరే భారత్‌లోకి ప్రవేశించి.. అరుణాచల్, అస్సాం మీదుగా ప్రవహించి, బంగ్లాదేశ్‌కి వెళుతుంది. ఇందులో నది మలుపు తిరిగే ప్రాంతంలోనే చైనా భారీ డ్యామ్‌ను నిర్మిస్తోంది. ఇది భారత ఉపఖండ భూఫలకం (టెక్టానిక్ ప్లేట్), యురేషియా భూఫలకం కలిసే ప్రాంతమని.. భూకంపాలకు ఆస్కారం ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. చైనా డ్యామ్ నిర్మిస్తున్న ప్రాంతానికి సమీపంలో 1950లో రిక్టర్ స్కేల్‌పై 8.6 తీవ్రతతో భారీ భూకంపం వచ్చింది. అస్సాం నుంచి టిబెట్ వరకు ప్రకంపనలతో అదిరాయి. హిమాలయాల ప్రాంతమంతా భూకంప జోన్-4లో ఉంది. అలాంటి ప్రాంతంలో అతి భారీ డ్యామ్ అంటే.. నీటి బాంబును పక్కన పెట్టుకున్నట్టేనని నిపుణులు చెబుతున్నారు.

- టిబెట్‌లోని బ్రహ్మపుత్ర ఉపనదులపై చైనా మొత్తంగా 130 డ్యామ్‌ల నిర్మాణం తలపెట్టింది. అందులో కొన్ని ఇప్పటికే పూర్తయ్యాయి కూడా. ఇవన్నీ కలసి ఆ ప్రాంతంలో భూకంపాల సమస్యను పెంచుతాయని కెనడాకు చెందిన 'ప్రోబ్ ఇంటర్నేషనల్' సంస్థ 2012లోనే హెచ్చరించడం గమనార్హం.
- చైనా ఇలా పెద్ద సంఖ్యలో నిర్మిస్తున్న డ్యామ్‌లన్నీ నీటిని నిల్వ చేసుకునేందుకు వీలున్నవేనని.. దానివల్ల ఎండాకాలంలో బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గి నీటి కరువు ఏర్పడే ప్రమాదం ఉంది.
- చైనా కడుతున్న డ్యామ్ నుంచి విద్యుత్ కేంద్రాలకు నీటిని తరలించేందుకు పర్వతాన్ని తొలిచి, ఒక్కోటి 20 కిలోమీటర్ల పొడవైన ఆరు భారీ టన్నెళ్లను నిర్మించనుంది. ఇది ఆ ప్రాంతంలో పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ముందు జాగ్రత్తగా భారత్ భారీ ప్రాజెక్టు చేపట్టినా..

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్, దానితో వచ్చే నష్టాలను ఎదుర్కొనగలిగేలా భారీ ప్రాజెక్టు చేపట్టేందుకు భారత్ సిద్ధమైంది. చైనా నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశించే సియాంగ్ జిల్లాలో భారీ డ్యామ్‌తోపాటు 11 వేల మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాలనూ నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టింది. చైనా ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే.. దిగువన భారీ వరదలు రాకుండా ఈ ప్రాజెక్టు వీలు కల్పిస్తుంది. అయితే అక్కడి గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోంది.

‘పల్నాడు’లో భూ బకాసురులు!

- రూ.40 కోట్ల విలువైన భూమికి ఎసరు
- చనిపోయిన మనిషి బతికున్నట్లు చూపించారు
- 20 దొంగ రిజిస్ట్రేషన్లు చేసిన ‘పేట’ రిజిస్ట్రార్
- ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దుర్వినియోగం
- చర్యలు తీసుకునేందుకు పోలీసులు ససేమిరా
- మంత్రి లోకేశ్ జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు
- పోలీసుల అదుపులో కీలక నిందితుడు?

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

గుంటూరు నగరానికి చెందిన కొత్తపల్లి పద్మజ 2022 ఫిబ్రవరిలో క్యాన్సర్‌తో మృతిచెందారు. ఆమె పేరున గుంటూరు రూరల్ మండలం గోరంట్ల పంచాయతీ సర్వే నం.143లో 1.80 ఎకరాల భూమి ఉంది. భాష్యం రామ సేతు క్యాంపస్ వద్ద ఉన్న ఈ భూమి విలువ అక్షరాలా రూ.40 కోట్లు. దీనిపై కన్నేసిన కొందరు కేటుగాళ్లు దాన్ని కాజేసేందుకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల భూ మాఫియాను రంగంలోకి దించారు. మరణించిన పద్మజను బతికి ఉన్నట్లుగా చూపించారు. నరసరావుపేట రిజిస్ట్రార్‌తో 2023 అక్టోబరులో 18 జీపీఏలు (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేయించారు. అనంతరం ఆ భూమికి రిజిస్ట్రేషన్ చేసి రూ.కోట్లు దండుకున్నారు. దీనిపై పద్మజ భర్త కొత్తపల్లి శ్రీనివాసరావు 2024 జనవరిలో పోలీసులను ఆశ్రయించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో దీనిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ససేమిరా అన్నారు. చివరకు భూమిలో వాటా ఇస్తే కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఇటీవల మంత్రి లోకేశ్‌ను మంగళగిరి కార్యాలయంలో కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. స్పందించిన లోకేశ్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. దీంతో విచారణ ప్రారంభించిన నల్లపాడు పోలీసులు.. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిజాలు నిగ్గు తేల్చారు.



దొంగ రిజిస్ట్రేషన్ జరిగిన గోరంట్ల పంచాయతీ పరిధిలోని భూమి

అంతా నరసరావుపేటలోనే..

గుంటూరు పరిధిలోని భూమిని కొట్టేసేందుకు నిందితులు ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వాడుకున్నారు. భారీ మొత్తం ఆశ చూపించి రిజిస్ట్రార్‌తో 18 జీపీఏలు సహా 20 డాక్యుమెంట్లు రిజిస్టర్ చేయించారు. విషయం బయటకు పొక్కడంతో సదరు రిజిస్ట్రార్ కూడా నిందితులపై నరసరావుపేట పోలీసులకు అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉద్యోగ విరమణ చెందిన రిజిస్ట్రార్‌ను కూడా ఈ కేసులో చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కాగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చింతారెడ్డి మహేశ్‌రెడ్డి ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తేల్చారు. చనిపోయిన పద్మజ స్థానంలో ఓ వితంతువును చూపించి భూమికి జీపీఏలు తీసుకున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం మహేశ్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. పిడుగురాళ్ల మండలానికి చెందిన మరికొందరికి కూడా ఇందులో భాగస్వామ్యం ఉందని, వారే వితంతువును తీసుకొచ్చారని పోలీసు విచారణలో మహేశ్‌రెడ్డి తెలిపినట్లు సమాచారం. కొందరు రౌడీలతో బాధితుడు శ్రీనివాసరావుపై దాడికి కూడా దిగినట్లు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం రాకపోతే..



2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే నా భూమి దక్కేది కాదు. నాకు జరిగిన అన్యాయం గురించి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు పోలీసుల దగ్గరికి వెళ్లినా న్యాయం జరగలేదు. అదేమంటే వాటాలు అడిగారు. నా భూమిని ఆక్రమించి నాపై దాడికి వచ్చారు. మంత్రి లోకేశ్ జోక్యంతో నా ఫిర్యాదుపై కదలిక వచ్చింది. నిజాలు వెలుగులోకి తెచ్చారు.

\- కొత్తపల్లి శ్రీనివాసరావు, బాధితుడు



ఆదిత్యసాయి

అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు!

- రోడ్డు ప్రమాదంలో కొల్లూరు యువకుడి బ్రెయిన్‌డెడ్
- యలవర్తి ఆదిత్యసాయి కళ్లు, కిడ్నీలు, కాలేయం దానం

తాడేపల్లి టౌన్, విజయవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు అవయవ దానం ద్వారా నలుగురి జీవితాలలో వెలుగులు నింపనున్నాడు. బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన యలవర్తి ఆదిత్యసాయి(22) ఈ నెల 19న బైక్‌పై ప్రయాణిస్తూ కొల్లూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురవడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆయనను తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించగా తలకు శస్త్ర చికిత్స చేశారు. అయినప్పటికీ స్పృహలోకి రాకపోవడంతో 21వ తేదీన బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. అవయవ దానానికి కుటుంబసభ్యులు అంగీకరించడంతో ఏపీ జీవన్‌దాన్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, మణిపాల్ ఆస్పత్రి క్లస్టర్ హెడ్ సుధాకర్ కంటెపూడి ఆధ్వర్యంలో అవయవాలను సేకరించారు. కళ్లను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి, ఒక కిడ్నీ, కాలేయాన్ని మణిపాల్ ఆస్పత్రికి, మరో కిడ్నీని క్యాపిటల్ ఆస్పత్రికి అందజేసినట్టు మణిపాల్ ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు.

కీచక పీడీపై చర్యలు తీసుకోండి

- అధికారులకు హెచ్‌ఎం ఫిర్యాదు

కలిదిండి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వ్యాయామోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా కలిదిండి జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.స్వర్ణ కుమారి జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రధానోపాధ్యాయురాలు మంగళవారం విలేకరులకు వివరాలు తెలిపారు. వ్యాయామోపాధ్యాయుడు కె.రత్నదాస్ వ్యాయామం పేరిట పదో తరగతి విద్యార్థినుల శరీర భాగాలపై చేతులు వేస్తూ అసభ్యంగా ప్రవర్తించటం, ఎవరైనా ఎదిరిస్తే జుట్టు పట్టుకుని కొట్టడం చేస్తున్నట్టు విద్యార్థినులు ఈ నెల 7న తనకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ విషయంపై పీడీని ప్రశ్నించగా, ‘నా క్యారెక్టర్ గురించి చెడుగా మాట్లాడతావా’ అని అరుస్తూ ఎదురుదాడి చేశారన్నారు. అప్పటి నుంచి తనను దుర్భాషలాడుతూ, మారణాయుధాలతో దాడి చేస్తానని బెదిరిస్తూ ఈ నెల 16న దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. దీంతో ఈ నెల 17న ఏలూరు వెళ్లి డీవైఈవోకి ఈ విషయమై ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. సమయ పాలన పాటించటం లేదని, ఇష్టానుసారంగా రావటం వెళ్లటం చేస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న పీడీపై చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ విషయమై వివరణ కోరేందుకు యత్నించగా పీడీ అందుబాటులో లేరు.

లోకాయుక్త జోక్యంతో దక్కిన పరిహారం

- పోలవరం నిర్వాసితులకు ఊరట

కర్నూలు లీగల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్యాకేజీ కింద నిర్వాసితులకు నష్టపరిహారం పొందడంలో రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని జోక్యంతో న్యాయం దక్కింది. పోలవరం ప్రాజెక్టులో నల్లాల వెంకటరమణమ్మ, నల్లాల శేషగిరి ఆస్తులు కోల్పోయినా.. పరిహారం దక్కలేదు. దీంతో వీరు లోకాయుక్తను ఆశ్రయించడంతో రాష్ట్ర ఉప లోకాయుక్త సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేశారు. స్పందించిన అధికారులు నిర్వాసితులైన ఫిర్యాదిదారుల పేర్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో చేర్చారు. వారికి ఇంటి స్థలం కేటాయించడంతోపాటు రూ.6.36లక్షల పరిహారం, దానికి అదనంగా మరో రూ.25వేలు చెల్లించినట్లు అధికారులు లోకాయుక్తకు నివేదించారు. నిర్వాసితులకు నష్టపరిహారం లభించడంతో ఫిర్యాదును ముగిస్తూ ఉప లోకాయుక్త ఆదేశాలు ఇచ్చారు.

నేడు బీసీవై ఆవిర్భావ సభ

విజయవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బహుజన నినాదంతో ఆవిర్భవించిన భారతచైతన్య యువజన పార్టీ (బీసీవై) ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, మరెన్నో పోరాటాలను నిర్వర్తించిందని ఆ పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. విజయవాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవాడలోని గురునానక్ కాలనీలో బుధవారం నిర్వహిస్తామని చెప్పారు.

దేశంలోనే అతిపెద్ద స్కాం... ఏపీ లిక్కర్ స్కాం

- స్వాహా సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి: సీపీఐ రామకృష్ణ

కడప మారుతీనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ‘దేశంలోనే అతి పెద్ద స్కాం ఏపీలో జరిగిన లిక్కర్ స్కాం. ఢిల్లీ లిక్కర్ స్కాం దీంతో పోల్చుకుంటే చాలా చిన్నది. ఈ స్కాంలో స్వాహా చేసిన రూ.3,500 కోట్లను నిందితుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి’ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యంతో వేల మంది కిడ్నీలు, లివర్‌లు దెబ్బతిన్నాయని, మధ్యవయస్కులు వారే ఎక్కువగా ఇందులో బాధితులుగా ఉన్నారని సిట్ దర్యాప్తులో తేలిందన్నారు. లిక్కర్ స్కాంలో స్వాహా చేసినదంతా ప్రజా ధనమేనని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ డబ్బును స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని, ఈ స్కాంలో ఎవరున్నా అందరినీ అరెస్టు చేయాలని సూచించారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం పాలన చేపట్టిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై దాదాపు రూ.15,480 కోట్ల భారం మోపడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రజలను, రైతులను రెచ్చగొట్టిన చంద్రబాబు, లోకేశ్ ఇవాళ అదే స్మార్ట్ మీటర్లను బిగించాడానికి ఆమోదం తెలపడం సరైంది కాదన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. రాయలసీమలోని తాగు, సాగు నీటి ప్రాజెక్టులు గత కొన్ని దశాబ్దాలుగా పూర్తి కాక పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఆ విషయాన్ని గాలికొదిలేసి పోలవరం-బనకచర్ల అంటూ కొత్త పల్లవిని చంద్రబాబు అందుకోవడం సరైంది కాదన్నారు. సీమ ప్రాజెక్టులపై ప్రైవేటు వారికి పెత్తనం అంటగడితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో జిల్లా స్థాయి నేతలు పాల్గొన్నారు.

అరకు ఘాట్‌రోడ్డులో మినీ బస్సు బోల్తా

- డ్రైవర్ సహా ముగ్గురు పర్యాటకులకు తీవ్ర గాయాలు
- 14 మందికి స్వల్పగాయాలు
- క్షతగాత్రులు రాజమహేంద్రవరం వాసులు
- బస్సు బ్రేకులు ఫెయిలు కావడంతో ప్రమాదం



ఘాట్‌రోడ్డులో బోల్తాపడిన మినీ బస్సు

అనంతగిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ఘాట్‌రోడ్డులో హెయిర్ పిన్ బెండ్-1 వద్ద మంగళవారం సాయంత్రం ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సు బ్రేకులు ఫెయిలై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు రెండు చేతులు విరిగిపోగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 14 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా అరకు అందాలను తిలకించి రాజమహేంద్రవరం వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని ఓ బ్యూటీపార్లర్‌లో పని చేస్తున్న పది మంది యువకులు, యజమాని కుటుంబానికి చెందిన తొమ్మిది మంది కలిపి మొత్తం 19 మంది అరకులోయ అందాలను తిలకించేందుకు ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సులో మంగళవారం వేకువజామున అరకులోయ వచ్చారు. అరకులోయ పరిసర ప్రాంతాలను సందర్శించి మధ్యాహ్నం అనంతగిరి మీదుగా బొర్రా గుహలు చేరుకున్నారు. బొర్రా గుహలు సందర్శించిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఘాట్‌రోడ్డు హెయిర్‌పిన్ బెండ్-1 మలుపు వద్దకు వచ్చే సరికి బస్సు బ్రేకులు ఫెయిలై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కుమారస్వామి రెండు చేతులు విరిగిపోగా, అందులో ఉన్న లక్ష్మి, గీత, వీరబాబు తీవ్రంగా గాయపడ్డారు. మిగతా 14 మందికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నలుగురిని 108 వాహనంలో, మిగతా 14 మందిని వివిధ వాహనాల్లో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

టీటీడీలో అన్యమత ఉద్యోగుల లెక్క తేలుస్తాం

- వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణానికి నిపుణుల కమిటీ
- టీటీడీలో ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ ల్యాబ్
- టీటీడీ బోర్డు నిర్ణయం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు తదితరులు

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): ‘టీటీడీలో అన్యమత ఉద్యోగుల విషయంలో కఠినంగా ఉన్నాం. గుర్తించేందుకు ప్రత్యేకంగా కమిటీ వేశాం..లెక్కలు తీస్తున్నాం. టీటీడీ విజిలెన్స్ వద్ద అన్యమత ఉద్యోగుల వివరాలున్నాయి....విచారిస్తున్నారు. గతంలో అన్యమత ఉద్యోగులపై ఎలాంటి నిఘా లేదు. కొత్త బోర్డు ఏర్పాటైన తర్వాత గట్టిగా వ్యవహరిస్తున్నాం.’ అని టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఆ వివరాలను ఛైర్మన్, ఈవో బోర్డు సభ్యులతో కలిసి మీడియాకు తెలిపారు. ‘అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్ అవకాశం ఇచ్చాం. ఇప్పటికే కొందరు ముందుకు వచ్చారు. గతంలో కొంతమందికి ఇంక్రిమెంట్లు కట్ చేశారు. అయినప్పటికీ కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తూనే ఉన్నారు. విచారణలో తేలితే వారిని సస్పెండ్ చేస్తున్నాం’ అని తెలిపారు. కాగా, ఆలయానికి సంబంధంలేని టీటీడీ పరిధిలోని ఆస్పత్రులు, విద్యాసంస్థల్లోకి అన్యమత ఉద్యోగులను బదిలీ చేసే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వం సూచించిందని ఛైర్మన్, ఈవో తెలిపారు. ఇటీవల దేవదాయశాఖ మంత్రితోనూ ఇదే అంశంపై చర్చించామన్నారు. ఇది సున్నితమైన అంశం, ప్రతి ఉద్యోగి ఇంటికి వెళ్లి తనిఖీ చేయడం సాధ్యం కాదని, అన్యమతస్తులని సమాచారం అందిన వెంటనే విజిలెన్స్ విచారణకు ఆదేశించి నిజమని తేలితే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా అనమత్య ఉద్యోగులు ఖచ్చితంగా ఎంతమంది ఉన్నారనే సంఖ్య లేదన్నారు. 2018లో కొంతమంది అన్యమత ఉద్యోగులను తొలగించేందుకు నోటీసులు ఇవ్వగా కోర్టు నుంచి వారు స్టే తీసుకువచ్చారని, వారిలో 20 మంది పదవీ విరమణ చేశారని తెలిపారు. మరో 22 మంది అధికారికంగా ఉన్నారన్నారు. ఇక, ప్రభుత్వానికి కామన్ గుడ్ ఫండ్ పెంచే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, సీఎంతో చర్చించిన తర్వాత నిర్ణయాలు తీసుకుంటామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఏఐ ద్వారా త్వరితగతిన దర్శనం చేయించేందుకు ఇప్పటికే గూగుల్, టీసీఎస్ సంస్థలు అధ్యయనం చేస్తున్నాయన్నారు.

మరికొన్ని నిర్ణయాలు..

- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలి.
- నిరుద్యోగులైన వేదపారాయణదారులకు ఎండోమెంట్ ద్వారా నిరుద్యోగ భృతిని చెల్లించేందుకు రూ.2.16 కోట్ల టీటీడీ నిధుల మంజూరుకు ఆమోదం.
- తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో అన్ని వసతులతో విశ్రాంతి కేంద్రాలు(లాంజ్‌లు) ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం.
- భక్తులు సైబర్ మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదం.
- సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్మించిన 320 ఆలయాలకు రూ.79.82 లక్షలతో ఉచితంగా మైక్‌సెట్లు.
- దేవదాయ శాఖ సూచన మేరకు శ్రీవాణిట్రస్టు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించే శ్రీవారి ఆలయాలు, భజన మందిరాలకు నిధులు చెల్లించేందుకు మూడు కేటగిరీల్లో రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షలుగా నిర్ణయం.

ప్రత్యేకాధికారుల పాలన గడువు పెంపు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10 పట్టణ స్థానిక సంస్థల్లోని ప్రత్యేకాధికారుల పదవీ కాలాన్ని మరో ఆర్నెల్లు పొడిగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు మంగళవారం జారీచేసింది. కందుకూరు, ఆముదాలవలస, నరసారావుపేట, పొన్నూరు, కావలి, చింతలపూడి, వైఎస్ఆర్ తాడిగడప, పొదిలి, అల్లూరు, బి.కొత్తకోటల్లో ప్రత్యేకాధికారుల పాలన గడువు త్వరలో ముగుస్తుంది. వీరికి గడువు పెంచుతూ అధికారులు ఆదేశాలిచ్చారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- రేషన్ డీలర్లకు మంత్రి నాదెండ్ల హెచ్చరిక

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. మంగళవారం విజయవాడలోని ఒక చౌక ధరల దుకాణాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో షాపులో డీలరు లేరు. రిజిస్టరు ప్రకారం బియ్యం స్టాక్ కూడా లేదు. కార్డుదారులు ఫిర్యాదులు చేయడానికిగాను షాపు వద్ద క్యూఆర్ కోడ్‌తో పోస్టర్ కూడా లేదు. దీంతో మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేజీబీవీ టీచర్ల రిసోర్స్ పర్సన్లకు శిక్షణ

కేజీబీవీల్లోని విద్యార్థులను సొంత పిల్లల్లా భావించి, నాణ్యమైన విద్యాబోధనతో వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులను కోరారు. రాష్ట్రంలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే స్టేట్ రిసోర్సు పర్సన్లకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవాడలో మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

సత్యసాయి శత జయంతి ఘనంగా నిర్వహించాలి

- ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్.. అధికారులతో సమీక్ష

పుట్టపర్తి టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఈ ఏడాది నవంబరులో జరిగే సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ అధికారులను ఆదేశించారు. సత్యసాయి శతజయంతి వేడుకల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఆయన పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. సత్యసాయి జన్మదినాన్ని ప్రభుత్వ పండుగగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని, వేడుకలలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్టోబరు 15నాటికి శత జయంతి ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.

కడప సెంట్రల్ జైలులో ఖైదీల సెల్‌ఫోన్ వాడకం వాస్తవమే..

- ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

కడప, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో ఖైదీలు సెల్‌ఫోన్ వాడుతున్నారన్నది వాస్తవమని తేలడంతో ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల కాలంలో జైలులో 12 ఫోన్లు దొరికాయి. సెల్‌ఫోన్ల వినియోగంపై ‘ఆంధ్రజ్యోతి’లో కథనం కూడా వచ్చింది. దీంతో ప్రభుత్వం కోస్తా రేంజ్ డీఐజీ రవికిరణ్‌ను విచారణాధికారిగా నియమించింది. ఆయన వారం రోజుల పాటు చేసిన విచారణలో సెల్‌ఫోన్ల వినియోగం వాస్తవమని తేలింది. దీనికి బాధ్యులుగా పరిగణిస్తూ డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్, జైలరు గోవిందరావు, జైలు వార్డర్లు అప్పారావు, వర్మ, నారాయణరావులను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డైరెక్టర్ అంజనీకుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేటుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ 26, 27 తేదీల్లో నిరసనలు

విజయవాడ (బస్టేషన్), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని గవర్నర్‌పేట-1 డిపో, పాతబస్టాండ్ స్థలాలను లులూ షాపింగ్ మాల్‌కు ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు నిరసనగా రాష్ట్రంలోని అన్ని డిపోల్లో ఈనెల 26, 27 తేదీల్లో నిరసనలు చేపట్టాలని నిర్ణయించినట్టు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని అత్యవసరంగా నిర్వహించామని, ప్రైవేట్ సంస్థలకు ఆర్టీసీ స్థలాలను ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలు తెలియజేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దైవానుగ్రహం తోడైతే, పదవీకాలం పూర్తయ్యేవరకూ ఉంటానని సరిగ్గా పన్నెండురోజుల క్రితం ఘంటాపథంగా చెప్పిన ఉపరాష్ట్రపతి, ఇంతలోనే, ఈమాదిరిగా నిష్క్రమిస్తారని ఊహించలేదు. గిట్టనివాళ్ళు కూడా ఇంకా రెండేళ్ళు ఆయన రాజ్యసభాధ్యక్షస్థానంలో ఉంటారనీ, వేగక తప్పదనే అనుకున్నారు. తప్పుబట్టినవారు, పక్షపాతివంటూ నిందించిన వారూ, నడకనీ మాటనీ నమస్కారం చేసే తీరునీ అవహేళన చేసినవారు సైతం ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ నాలుగుమంచి మాటలతో, సగౌరవంగా సాగనంపితే బాగుంటుంది కదా అని జాలిపడుతున్నారు. నిర్ణయాన్ని పునరాలోచించుకోమని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకస్మిక నిష్క్రమణ

భారత ఉపరాష్ట్రపతి ఇలా అర్థంతరంగా నిష్క్రమించిన చరిత్ర ఇటీవలి కాలంలో లేదు. రాష్ట్రపతి కావడానికో, మరో బాధ్యత చేపట్టడానికో రాజీనామా చేయడం చూశాం తప్ప, ఇలా రాత్రివేళ ఆ అత్యున్నత పదవిని వదిలేసిపోవడం లేదు. ధన్‌ఖడ్ అసాధారణ పోరాటశక్తి తెలిసిందే కనుక, ఆరోగ్యసమస్యలున్నప్పటికీ, ఈ నిష్క్రమణకు అవే అసలుకారణాలని ఎవరూ నమ్మడం లేదు. ఒకవేళ ఆయన చెప్పిందే నిజమనుకున్నప్పటికీ, నిండుసభలో కరతాళధ్వనులతోనూ జరగాల్సిన ఈ అధికారిక ప్రక్రియ ఇలా ఒక రాత్రివేళ ట్వీటుతో ముగిసిపోవడం అమితాశ్చర్యం కలిగిస్తుంది. సోమవారం ఆయన రాజ్యసభ వర్షాకాల సమావేశాలను ఆరంభించారు, సభ్యులతో వాదించారు, ఆగ్రహించారు, అనునయించారు, సాయంత్రం వరకూ అంతే ఉత్సాహంతో ఉన్నారు. ఆయన మర్నాటి 1షెడ్యూల్‌ను కూడా రాజ్యసభ కార్యాలయం విడుదల చేసింది. కానీ, రాత్రి తొమ్మిదన్నర ప్రాంతంలో ఉపరాష్ట్రపతి అధికారిక ఎక్స్‌ఖాతాలో ఆయన రాజీనామాలేఖ ప్రత్యక్షమైంది, మర్నాడు మధ్యాహ్నం ప్రధానమంత్రి ఇకపై ఆరోగ్యం జాగ్రత్తంటూ సందేశాన్ని అందించారు, రాష్ట్రపతి ఈ రాజీనామాను ఆమోదించారు. అప్పటివరకూ అధికారపక్ష ప్రముఖులెవ్వరూ ఈ పరిణామం మీద నోరువిప్పలేదు. మోదీ ట్వీటు ఒక్కటి చాలు, తెర వెనుక ఆగ్రహాలు తెలియచెప్పడానికి.

ఎందుకు, ఏమిటి అన్న చర్చ సాగుతోంది. ఆయన ఒకటీ రెండు కాదు, చాలా లక్ష్మణరేఖలు దాటాడని, ఆదిలో అడపాదడపా అలిగిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు అమితాగ్రహంతో స్పష్టమైన సందేశాన్ని అందించడంతోనే ఈయన వెళ్ళిపోవాల్సి వచ్చిందని అంటారు. ఉపరాష్ట్రపతి అయినా కూడా పార్టీ విధేయతనూ, రాజకీయ వాసనలను వదులుకోలేదన్నది ధన్‌ఖడ్ మీద ఉన్న విమర్శ. పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా మమతాబెనర్జీని మూడు చెరువుల నీళ్ళు తాగించి ఈ ఉన్నత పదవికి చేరిన ఈయన ప్రస్తుత విపక్షపాలిత గవర్నర్లకు ఆదర్శమని గిట్టనివారంటారు. ఆయన గొంతు గట్టిది. ఘాటుగా, రెచ్చగొట్టేట్టుగా, హద్దులు దాటి మరీ మాట్లాడగలరు. సభలో ఆయన ఆదేశాలు తీవ్ర ప్రతిష్ఠంభనకు, నిరసనలకు దారితీసిన సందర్భాలనేకం. ఇప్పుడు అనుకూలంగా మాట్లాడుతున్న ప్రతిపక్షమే అభిశంసనను ప్రతిపాదించిన తొలి ఉపరాష్ట్రపతి ఆయన. కొలీజియం వ్యవస్థమీద న్యాయమంత్రుల ఆరోపణలను ఏకంగా పోరాటస్థాయికి తీసుకుపోయి, ఆ వ్యవస్థను అనుమతించినందుకు ఎంపీలను తీవ్రంగా నిందించిన వ్యక్తి ధన్‌ఖడ్. రాజ్యాంగాన్ని ప్రభుత్వ పెద్దలు చిత్తం వచ్చినట్టుగా మార్చడానికి రాజ్యాంగ మౌలిక నిర్మాణ సిద్ధాంతం అడ్డుపడుతున్నందుకు కేశవానందభారతి తీర్పునుంచి ఇటీవలి తీర్పులవరకూ అనేకం తప్పుబట్టి, న్యాయవ్యవస్థను సూపర్ పార్లమెంట్‌గా అభివర్ణించి, దాని చొరవను చొరబాటుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దల మనసు గెలుచుకున్నానని అనుకున్నారాయన. ఇప్పుడు, జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన ప్రయత్నాల్లో తమదే పైచేయి కావాలన్న అధికారపక్షం కలలను వమ్ముచేసి, విపక్షానిది పైచేయి కానిచ్చినందుకే ఇలా నిష్క్రమించాల్సివచ్చిందని విశ్లేషకుల వాదన. ఇది ఒక్కటే కారణం కాకపోవచ్చు, తెరవెనుక వ్యూహాలూ కుట్రలూ అనేకం ఉండవచ్చు. జగదీప్ ధన్‌ఖడ్ తనకుతానుగా చెప్పేవరకూ ఈ అర్థంతర నిష్క్రమణ గుట్టు ఎవరికీ తెలియదు. జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మాదిరిగా దానిని ఎప్పటికైనా విప్పుతారేమో చూడాలి. ఉపరాష్ట్రపతి పదవి అత్యున్నతమైనది. దీని విషయంలో ఊహాగానాలు, పుకార్లు, కొనసాగడం దేశానికి అవమానం. నిజం తెలుసుకొనే హక్కు ప్రజలకు ఉంది, దానిని వెనువెంటనే తెలియచేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

హతుడి కుటుంబంతో సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని ఉరిశిక్ష నుంచి బయటపడే అవకాశం యమన్‌లో మరణ శిక్షను ఎదుర్కొంటున్న కేరళ యువతి నిమిష ప్రియకు ఉన్నది. భారతీయ మీడియా అవగాహన రాహిత్యంతో, ఉభయ పక్షాల వాదనలను నిష్పాక్షికంగా నివేదించకుండా కేవలం ఒక పక్షం వారి వాదనకే ప్రాధాన్యమిచ్చింది. ఈ కారణంగానే నిమిషకు క్షమాభిక్ష లభించకపోయే పరిస్థితి ఏర్పడింది.

నిమిషకు కీడుచేసిన భారతీయ మీడియా!

జీవనోపాధి, విద్యాభ్యాసం నిమిత్తం దేశ సరిహద్దులు దాటుతున్న భారతీయుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. విదేశాలలో ఉంటున్న భారతీయుల స్థితిగతులపై సరైన సమాచారం తెలుసుకొనేందుకు తమకంటూ ఒక స్వంత వ్యవస్థ భారతీయ మీడియాకు ఇప్పటికీ లేదు. దేశ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న దౌత్య నియమాలకు తోడుగా మానవీయకోణంలో స్పందించవల్సిన అనేక సందర్భాలలో భారతీయ మీడియా తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో విఫలమవుతోందని చెప్పక తప్పదు. సామాజిక మాధ్యమాలు లేదా ఒక పక్షం వాదన ఆధారంగానే భారతీయ మీడియా వార్తా కథనాలు ప్రచురిస్తోంది. ఈ కథనాలు వాస్తవాలను కప్పిపుచ్చుతూ ప్రజలలో అయోమయం సృష్టిస్తున్నాయి. యమన్‌లో మరణ శిక్షను ఎదుర్కొంటున్న కేరళ యువతి నిమిష ప్రియ ఉదంతమే భారతీయ మీడియా ధోరణులకు ఒక తాజా ఉదాహరణ.

గల్ఫ్ లేఖ

సున్నితమైన ఒక అంశాన్ని భారతీయ మీడియా అవధులు మీరి జటిలం చేసిందని నిమిష ఉదంతం స్పష్టం చేసింది. హతుడి కుటుంబంతో సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని ఉరిశిక్ష నుంచి బయటపడే అవకాశం నిమిషకు ఉన్నది. అయితే భారతీయ మీడియా అవగాహన రాహిత్యంతో, ఉభయ పక్షాల వాదనలను నిష్పాక్షికంగా నివేదించకుండా కేవలం ఒక పక్షం వారి వాదనకే ప్రాధాన్యమిచ్చింది. ఈ కారణంగానే నిమిషకు క్షమాభిక్ష లభించకపోయే పరిస్థితి ఏర్పడింది. యమనీ హతుడి కుటుంబం నిమిషను క్షమించవచ్చనే అభిప్రాయం ఒక దశలో గట్టిగా ఏర్పడింది. అయితే భారతీయ మీడియా పుణ్యమా అని నిమిషకు మరణ శిక్ష అమలు చేయవల్సిందేనని హతుడి కుటుంబం ఇప్పుడు పట్టుబడుతోంది. వాస్తవాలు తెలుసుకోకుండా భారతీయ మీడియా చేసిన దుష్ప్రచారం తమకు బాధ కలిగించిందని హతుడి కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. కేరళకు చెందిన ఇస్లాం పండితుడి జోక్యం, కుటుంబంతో సంబంధం లేని సంఘాల నాయకులు సుప్రీంకోర్టుకు వెళ్ళిన అంశాలపై మీడియా హంగామా నిమిషకు మేలు కంటే కీడు ఎక్కువ చేసిందని చెప్పవచ్చు.



యమన్ జాతీయుడు తలాల్ మహెదీను నిమిష పెళ్ళి చేసుకున్న విషయాన్ని భారతీయ మీడియా వ్యూహాత్మకంగా వెల్లడించలేదు. మోతాదుకు మించి మత్తు మందు ఇంజక్షన్ ఇవ్వడంతో మహెదీ మరణించినట్లుగా భారతీయ మీడియా చెబుతోంది. అయితే ఆమె అతడి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోసి సంచిలో వేసి నీళ్ళ ట్యాంకులో పారేసి 600 కిలోమీటర్ల దూరానికి పారిపోయినట్లుగా యమనీ మీడియా ప్రచురించిన కథనాలను ఉపేక్షిస్తోంది. ఆ కథనాలను ఎందుకు ప్రస్తావించడం లేదు? భాష రాక పరాయి దేశంలో ఉన్న బాధితురాలిగా నిమిషను చిత్రీకరిస్తున్న భారతీయ మీడియా.. ఈ హత్యలో ఆమెకు సహకరించిన యమనీ పౌరురాలు హనన్‌కు పదేళ్ళ శిక్ష విధించారని, నిమిషను కారులో తీసుకెళ్ళిన యమనీ డ్రైవర్‌కు కూడా జైలు శిక్ష విధించారనే విషయాన్ని చెప్పనే లేదు. స్థానిక భాషా పరిజ్ఞానం లేకుండానే నిమిష అక్కడ ఆసుపత్రిని ఎలా ప్రారంభించిందనే విషయాన్ని భారతీయ మీడియా ప్రశ్నించలేదు.

మహెదీ హత్య అనంతరం నిమిష, తిరుగుబాటుదారులైన హూతీల పాలనలో ఉన్న సనా నుండి పారిపోయి చట్టబద్ధ ప్రభుత్వం ఉన్న హద్రమౌత్ ప్రాంతానికి చేరుకుని అక్కడ ఒక ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగం చేస్తుండగా ఆమెను అరెస్టు చేసినట్లుగా యమనీ మీడియా వార్తలు వెల్లడించాయి. యమన్‌కు పొరుగున ఉన్న ఒక గల్ఫ్ దేశానికి వెళ్లే ప్రయత్నంలో ఉండగా నిమిష పట్టుబడినట్లుగా తెలుస్తోంది.

అసలు పదవ తరగతి కూడా ఉత్తీర్ణురాలు కాకుండా నర్సింగ్ డిప్లొమో చేసిన నిమిష తన స్వంత రాష్ట్రం కేరళలో సైతం నర్సింగ్ వృత్తి చేయడానికి అనర్హురాలు. అయినా నర్సింగ్ ఉద్యోగం చేయడానికి ఆమె యమన్‌కు వెళ్ళింది. ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కొంతకాలం పని చేసిన అనంతరం ఆమె ఏకంగా స్వంత ఆసుపత్రిని నెలకొల్పుకునేందుకు నిర్ణయించుకుని హతుడు తలాల్ సహాయ సహకారాలను తీసుకోవడం ఆసక్తికరమైన విషయం. తలాల్ స్వయంగా కేరళకు వచ్చి ఆమె ఇంట్లో ఆతిథ్యం స్వీకరించి వెళ్ళడం అంతకన్నా ఆసక్తికరం. హూతీ దళాల తిరుగుబాటు తదనంతరం యమన్‌లోని భారతీయులు స్వదేశానికి తిరిగి రావాలని భారత ప్రభుత్వం చేసిన సూచనను మన్నించి అక్కడి ప్రవాసులు అందరూ మాతృభూమికి చేరుకున్నారు. చివరకు సనాలో భారతీయ ఎంబసీని కూడా మూసివేసారు. అయినా నిమిష స్వదేశానికి వెళ్ళకుండా తలాల్ కుటుంబంతో కలిసి అతని ఇంట్లో నివసించిందనేది గమనార్హం. యమనీ మీడియా కథనాల ప్రకారం, ఆమె తలాల్‌ను స్థానిక చట్టాల ప్రకారం వివాహం చేసుకున్నది. ఆ తర్వాతే ఆమె ఆసుపత్రిని ప్రారంభించింది. హతుడి సోదరుడు బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సోదరుడితో నిమిషకు వివాహం జరిగిందని ధ్రువీకరించారు.

హత్య జరిగిన పరాయి దేశంలోని అన్ని స్థాయిల్లోని న్యాయస్థానాలలో అప్పీళ్ల దశ కూడా పూర్తయిన కేసుకు సంబంధించి మన దేశంలోని సుప్రీంకోర్టుకు వెళ్లడం ప్రచార ఆర్భాటం మినహా మరేమీ కాదు. ఒక్క నిమిష ఉదంతంలోనే కాకుండా, అరబ్బు దేశాలలో పనిచేస్తున్న భారతీయులకు సంబంధించిన అనేక ఉదంతాలపై భారతీయ మీడియా ప్రచురించే అర్ధసత్య కథనాల సంచలనాలతో మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతుందని చెప్పవచ్చు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ధన్‌ఖడ్ రాజీనామా మిగిల్చిన ప్రశ్నలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఆయనకు రాజ్యాంగం గురించి అద్భుతమైన పరిజ్ఞానం ఉన్నది. చట్టసభల వ్యవహారాలు ఆయనకు కొట్టిన పిండి..' ఇవి, ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌ఖడ్‌ను ఎంపిక చేసుకున్నప్పుడు ఆయనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కురిపించిన ప్రశంసలు. సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పుడు వారిలో అత్యధికంగా ఉన్న జాట్ రైతులను తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నంలో భాగంగా ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతిగా బీజేపీ ఎంపిక చేసింది. ఆయనను కిసాన్ పుత్రుడని, పరిపాలనా వ్యవహారాల్లో సమర్థుడని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా నాడు కొనియాడారు. అలాంటి ధన్‌ఖడ్ తాను ఆరోగ్యకారణాల రీత్యా రాజీనామా చేస్తున్నానంటే బీజేపీ ఎందుకు వదులుకున్నది? అసలు నిజంగా ఆరోగ్య కారణాల వల్లే ఆయన తప్పుకున్నారా?

సోమవారం ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ప్రతిపక్షాలకు ఎన్నో అస్త్రాలను అందించాయి. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌లో భారతదేశం అయిదు యుద్ధ విమానాలను కోల్పోయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారం రోజుల క్రితం ప్రకటనలు చేయడం, రక్షణదళాల ప్రధానాధిపతి ఈ ప్రకటనను ఖండించకపోవడం ప్రతిపక్షాలకు ఉత్సాహాన్నందించింది. ఆపరేషన్ సిందూర్‌తో పాటు బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఆత్మరక్షణలో పడేయాలని ప్రతిపక్షాలు సమాయత్తమవుతున్న నేపథ్యంలో జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా పరిస్థితిని మరింత అయోమయంగా మార్చిందనడంలో సందేహం లేదు. దేశంలో రెండవ అత్యంత ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి రాజీనామా చేయడం సహజంగానే సంచలనం సృష్టించింది.

2019లో ధన్‌ఖడ్‌ను పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా నియమించినప్పుడు ఆయన గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. 1987లో రైతు నేత దేవీలాల్ ఢిల్లీలో రైతుల ధర్నా నిర్వహించినప్పుడు ధన్‌ఖడ్ తన ఝున్‌ఝున్ ప్రాంతం నుంచి దాదాపు 500 వాహనాల్లో రైతులను సమీకరించి తీసుకు వచ్చి ఆయనకు సన్నిహితుడయ్యాడు. దీనితో 1989లో ఝున్‌ఝున్ నియోజకవర్గం నుంచి ధన్‌ఖడ్‌కు జనతాదళ్ తరపున ఎంపీ సీటు ఇచ్చి స్వయంగా ప్రచారం చేసి గెలిపించడమే కాక విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ప్రభుత్వంలో సహాయమంత్రి పదవి కూడా ఇప్పించారు. దేవీలాల్‌ను వీపీ సింగ్ ఉపప్రధాని పదవి నుంచి తొలగించినప్పుడు ధన్‌ఖడ్ కూడా రాజీనామా చేసి ఆయనకు అండగా నిలిచారు. వీపీ సింగ్ తర్వాత ప్రధాని అయిన చంద్రశేఖర్ మంత్రివర్గంలో కూడా ధన్‌ఖడ్ కొనసాగారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయినప్పుడు జనతాదళ్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతల్లో లాల్‌బహదూర్ శాస్త్రి కుమారుడు అనిల్ శాస్త్రి, ధన్‌ఖడ్ కూడా ఉన్నారు. ఎంపీగా ఓడిపోవడంతో కాంగ్రెస్ ఆయనకు 1993లో రాజస్థాన్‌లో కిషన్‌ఘర్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. బాబ్రీ మసీదు కూల్చి వేత తర్వాత ఆర్ఎస్ఎస్‌ను ధన్‌ఖడ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్ఎస్ఎస్ లాంటి తీవ్రవాద సంస్థకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్థానం లేదని ఆయన శాసన సభలో తీవ్రంగా విమర్శించారు.

ఇదంతా గతం. 1998లో మళ్లీ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఆయన రాజకీయాలను వదిలి న్యాయవాద వృత్తిలో నిమగ్నమయ్యారు. దాదాపు అయిదేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉండి ఏ బీజేపీనైతే తాను తీవ్రంగా విమర్శించారో అదే పార్టీలో ఆయన చేరారు. దరిమిలా చాలా కాలం బీజేపీ లీగల్ సెల్‌లో పనిచేసిన తర్వాత ఆయనకు 2016లో ఆ సెల్ సారథ్యం లభించింది. రామజన్మభూమి కేసుల్లోనూ, ఉగ్రవాద కేసుల్లోను బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు న్యాయ సహాయం అందించేవారు. ధన్‌ఖడ్‌పై మోదీ దృష్టి ఎలా పడిందో కాని 2019లో ఆయనను ఏకంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు. మూడు సంవత్సరాల పాటు అనేక బిల్లులను తొక్కిపెట్టడం, తీవ్ర విమర్శలు చేయడం వంటి పనులతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ముప్పుతిప్పలు పెట్టిన తర్వాత జగదీప్ ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతి వంటి కీలక పదవిలో నియమించారు.

రెండు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కనుమరుగై ఉన్న జగదీప్ ధన్‌ఖడ్‌ను నరేంద్రమోదీ ఏ కారణాలరీత్యా చేరదీశారో తెలియదు. అయితే అదే వ్యక్తిని అనూహ్యంగా పదవి నుంచి తప్పించడం లేదా తప్పుకుంటే చూస్తూ ఉండడం మాత్రం ఆశ్చర్యకరం. న్యాయవ్యవహారాల్లో ధన్‌ఖడ్ పెద్దగా నిపుణుడు కాదని, ఒకటి రెండు ముఖ్యమైన కేసులు తప్ప గొప్ప కేసులు ఏవీ వాదించిన దాఖలాలు లేవని అనేకమంది న్యాయ నిపుణుల అభిప్రాయం. అలాంటి వ్యక్తిని రాజ్యాంగ వ్యవహారాల్లో గొప్ప పరిజ్ఞానం ఉన్న వ్యక్తిగా ప్రశంసిస్తూ అనుభవజ్ఞుడైన వెంకయ్యనాయుడు స్థానంలో మోదీ నియమించినప్పుడు ఆశ్చర్యపోని ఎంపీలు లేరు. ఇప్పుడు ఆయనను తొలగించడం కూడా అంతే ఆశ్చర్యం కలిగిస్తోంది. రాజకీయాల్లో ఒక వ్యక్తి ఉత్థాన పతనాలు ఎలా జరుగుతాయన్నదానికి జగదీప్ ధన్‌ఖడ్ జీవితమే నిదర్శనం.

గవర్నర్ పదవిలో ఉండగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ బలోపేతం కావడానికి కారకుడై, బీజేపీ ఏజెంట్‌గా ముద్ర పడిన ధన్‌ఖడ్ రాజ్యసభ చైర్మన్‌గా కూడా దాదాపు బీజేపీ నాయకుడుగానే వ్యవహరించారు! ప్రతిపక్ష సభ్యులను ఎంతగా కట్టడి చేయాలో అంతగా కట్టడి చేశారు. విపక్ష సభ్యులు మాట్లాడుతుంటే మాటిమాటికీ అడ్డుతగిలేవారు. పార్లమెంట్‌లో గత ఏడాది భద్రతా వైఫల్యం జరిగినప్పుడు నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఒక దశలో ఆయనను తొలగించేందుకు ప్రతిపక్షాలు నోటీసు కూడా ఇచ్చాయి. పూర్వ ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్య ఒకసారి విందు ఇచ్చినప్పుడు 'మీ హయాంలోనే పరిస్థితులు బాగుండేవి' అని పలువురు ప్రతిపక్షసభ్యులు ఆయన వద్ద వాపోయారు. న్యాయవ్యవస్థతో కూడా జగదీప్ ధన్‌ఖడ్ బలంగా ఢీకొన్నారు. న్యాయమూర్తుల నియామకంపై రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కూడా తీవ్రంగా తప్పుపట్టారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో డబ్బు దొరికినప్పుడు అదే అదనుగా ఆయన న్యాయవ్యవస్థపై విరుచుకుపడ్డారు. బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతికి గడువు విధించే హక్కు న్యాయవ్యవస్థకు లేదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలో ఉన్న సోషలిజం, సెక్యులరిజం పదాలకు వ్యతిరేకంగా కూడా వ్యాఖ్యలు చేశారు.



జస్టిస్ వర్మను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసును రాజ్యసభ చైర్మన్‌గా ధన్‌ఖడ్ ఎందుకు ఆమోదించారు? లోక్‌సభలో అధికార ఎంపీలు ఇచ్చిన నోటీసును ఆమోదించి తామే చర్చను ప్రారంభించి న్యాయవ్యవస్థపై పట్టుబిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న విషయం ఆయనకు తెలియదా? పహల్గామ్ ఘటనపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ మల్లిఖార్జున ఖర్గే మాట్లాడేందుకు ధన్‌ఖడ్ ఎందుకు అనుమతించారు?

ప్రభుత్వానికి పరమ విధేయుడులా వ్యవహరించిన ధన్‌ఖడ్ తన పదవీకాలం ఇంకా రెండేళ్లుందనగా రాజీనామా చేశారు. ఆ ఉన్నత పదవి నుంచి ఇలా నిష్క్రమించవలసి వస్తుందని ఆయన కూడా అనుకుని ఉండరు. ఉపరాష్ట్రపతి పదవిలో ఆయన అనేక సౌకర్యాలు డిమాండ్ చేసి మరీ కల్పించుకున్నారు. తన వ్యక్తిగత సిబ్బందిలో పలువురిని పార్లమెంటరీ కమిటీల్లో నియమించుకుని ప్రతిపక్షాల విమర్శలకు గురయ్యారు. 2027 ఆగస్టు వరకూ తాను ఉపరాష్ట్రపతి పదవిలో కొనసాగుతానని 11 రోజుల క్రితమే ఆయన ప్రకటించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను మచ్చలేని సంస్థగా రాజ్యసభలో ప్రశంసించారు. ఇటీవలే ఆర్ఎస్ఎస్ నేత రాంమాధవ్ పుస్తకావిష్కరణలో సావర్కార్‌ను ప్రశంసించిన ధన్‌ఖడ్ తనపై బీజేపీ అగ్ర నేతలు కినుక వహిస్తారని ఊహించి ఉండరు.

ఆరోగ్య కారణాల రీత్యే అయితే ఉపరాష్ట్రపతి పదవిలో ఉన్నవారు రాజీనామా చేయనవసరం లేదు. రాజ్యాంగ పదవులలో ఉన్నవారికి ప్రభుత్వపరంగా అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఎలాగూ లభిస్తాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నంతకాలం రాజ్యసభను నిర్వహించేందుకు వైస్ చైర్మన్, ఇతర ప్యానెల్ చైర్మన్లు ఉండనే ఉన్నారు. అందువల్ల ఆరోగ్య కారణాల రీత్యా రాజీనామా చేశానని ధన్‌ఖడ్ చెబితే నమ్మేవారుండరు. కాని ఆయన నిష్క్రమణ పర్వానికి సంకేతాలు కొద్ది రోజులనుంచే లభిస్తున్నాయని పార్లమెంట్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. అంతర్గత సమాచారం ప్రకారం కొద్ది రోజులనుంచి విదేశాలనుంచి వచ్చే నేతలు, ప్రతినిధులు ఉపరాష్ట్రపతిని కలుసుకోవడం లేదు. ప్రభుత్వాధినేతలు కొన్ని విషయాల్లో తనను విశ్వాసంలోకి తీసుకోవడం లేదని ధన్‌ఖడ్ తన సన్నిహితులతో వాపోయినట్లు సమాచారం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ఆదివారం ఆయన తన సిబ్బంది అందరికీ విందు ఇవ్వడం కూడా ఒక సంకేతం.

అసలు జస్టిస్ వర్మను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసును రాజ్యసభ చైర్మన్‌గా ఆయన ఎందుకు ఆమోదించారు? లోక్‌సభలో అధికార ఎంపీలు ఇచ్చిన నోటీసును ఆమోదించి తామే చర్చను ప్రారంభించి న్యాయవ్యవస్థపై పట్టుబిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న విషయం ఆయనకు తెలియదా? పహల్గామ్ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రభుత్వంపై అనేక ప్రశ్నలు సంధిస్తూ మాట్లాడేందుకు ఆయన ఎందుకు అనుమతించారు? ప్రభుత్వం నుంచి వస్తున్న వ్యతిరేక సంకేతాల మూలంగా వెళ్లిపోయే ముందు స్వతంత్రంగా వ్యవహరించాలని ఆయన అనుకున్నారా? ధన్‌ఖడ్ ఏర్పాటు చేసిన సభా వ్యవహారాల కమిటీ సమావేశానికి ప్రభుత్వం తరపున మంత్రులు రాకపోవడం కూడా ప్రతిపక్షాల దృష్టికి వచ్చింది. ధన్‌ఖడ్‌ను తప్పించడం తప్ప మరో మార్గం లేదని, లేకపోతే సభలో మరిన్ని సమస్యలు తలెత్తుతాయని సోమవారం సాయంత్రం మోదీ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్న తర్వాతే ఆయనతో రాజీనామా చేయించారని అధికారిక వర్గాల కథనం.

దేశ అధికార వ్యవస్థలో అత్యంత శక్తిమంతులైన నరేంద్ర మోదీ, అమిత్ షాల ఆలోచనకు భిన్నంగా వ్యవహరిస్తే ఎంతవారైనా, ఎంత ఉన్నత పదవిలో ఉన్నా కొనసాగడం అంత సులభం కాదని జగదీప్ ధన్‌ఖడ్ నిష్క్రమణతో విశదమయింది. అయితే ఒక రాజ్యాంగ పదవిలో ఉన్నవారు సాధారణ ఉద్యోగిలా రాజీనామా చేసి వెళ్లడం, నమ్మదగిన కారణాలు చెప్పకపోవడంతో ఈ దేశంలో ఏది జరిగినా హతాశులు కానక్కర్లేదన్న విషయమూ స్పష్టమవుతోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

దశాబ్దాల నిరంతర శబ్ద కాంతులు!

ప్రతి ఒక్కరి సంక్షేమం, ప్రతి ఒక్కరి జీవన సౌఖ్యం కోసం నిరంతరం కృషి చేస్తూ, సూర్యచంద్రులతో పోటీ పడుతూ జ్ఞాన, వినోద, సమాచారాల త్రివేణిగా వెలుగొందుతోంది ఆకాశవాణి. మాట లేనిది మనిషి లేడు. భావ వ్యక్తీకరణకు, సమాచార పంపిణీకి, మానసికోల్లాసానికి మాటే వాహిక. మాటే మనిషికీ మనిషికీ మధ్య వారధి. తొంభై ఏళ్ళ పాటు అలాంటి వారధిగా, విశ్వసనీయతకు మారుపేరుగా పనిచేసింది ప్రసార భారతి. ప్రసారం తనకు తానుగా సులభంగా, సరళంగా, వైవిధ్యంగా, విస్తృతంగా ఆకాశవాణి ద్వారా అందుబాటులో ఉంది.

తొంభై ఏళ్ల క్రితం ఆరంభమైన ఆకాశవాణి ప్రపంచ ప్రసార మాధ్యమాల్లో తనదైన ప్రత్యేకతను చాటుకుంది. ఒక తరాన్ని తట్టిలేపిన రేడియో సిగ్నేచర్ ట్యూన్ వారి హృదయాలపై చేసిన సంతకం ఎంత గాఢమైందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వందేమాతరమంటూ పొద్దున్నే నిద్ర లేపి, భక్తిరంజనితో ప్రశాంత ఆధ్యాత్మిక శబ్దాలయపు ద్వారాలు తెరుస్తుంది. హలం పట్టుకుని పొలానికి బయలుదేరే రైతు మెడలో శబ్ద పుష్పాల మాలగా అలంకృతమవుతుంది. మన వాడ నుంచి విశ్వమంతా తిప్పుకు వచ్చేవి ఆకాశవాణి వార్తావాహికలు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ వార్తలు ఒకవైపు, కరెంట్ అఫైర్స్, స్పాట్‌లైట్ వంటి ఆంగ్ల కార్యక్రమాలు, వార్తా వ్యాఖ్యలు, జిల్లా సమాచార లేఖలు, ఎఫ్.ఎమ్. రెయిన్‌బో న్యూస్ బులెటిన్‌లు, ప్రత్యేక వార్తా కథనాలు... ప్రతి రోజూ నిత్య సత్యాలుగా, శబ్ద సాక్ష్యాలుగా అందిస్తూ వస్తున్న వార్తా విభాగం ఇప్పుడు 'న్యూస్ డివిజన్'గా సేవలు అందిస్తోంది.



నాటకాలు, నాటికలు, రూపకాలు, ప్రత్యక్ష వ్యాఖ్యానాలు, ప్రత్యక్ష ప్రసారాలతో... బాలబాలికలు, యువత, మహిళలు, కర్షకులు, కార్మికులు, వయోధికులు... ఇలా అన్ని వయో వర్గాలకు రేడియో ఒక కుటుంబ నేస్తంగా నిలిచింది. లలిత, జానపద, శాస్త్రీయ సంగీత ప్రక్రియలను ప్రేమగా తన గాలి భుజాలపై మోస్తున్న పాటల పల్లకి రేడియో. తెలుగుతో పాటు అనేక ఇతర భాషల ప్రసారాలతో తెలుగు శ్రోతలను అలరిస్తున్న ఆకాశవాణి కేంద్రాలు ఒకదానిని మించి మరొకటి అద్భుతమైన కార్యక్రమాలను అందిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వందలాది ఆకాశవాణి కేంద్రాలు వివిధ భాషల్లో వైవిధ్యభరితమైన కార్యక్రమాలతో శబ్ద కాంతులు పంచుతున్నాయి.

వివిధ ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల జోరులో సైతం తనదైన శైలిలో తొమ్మిది దశాబ్దాలుగా సాగుతున్న రేడియో, నేటికీ 'మొబైల్ యాప్ న్యూస్ ఆన్ ఎయిర్'గా విశ్వాస వాహినై శ్రోతలను చేరుకుంటూనే ఉంది. 1927లో ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ పేరిట బొంబాయిలో మొదలైన ఒక ప్రైవేటు కంపెనీ, ఆల్ ఇండియా రేడియోగా ప్రభుత్వాధీన సంస్థగా స్వర ప్రస్థానం ప్రారంభించింది. 1957 నుంచి వివిధ భారతిగా కూడా విలసిల్లుతోంది.

ప్రతి నెలా చివరి ఆదివారం దేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల నుంచి ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' వినని వారుండరు. భారత ప్రధానమంత్రి మోదీ యావత్ దేశంలో మూలమూలలో జరుగుతున్న నిర్మాణాత్మక కార్యక్రమాలను ఉటంకిస్తూ, యువతను, మహిళలను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, దేశ సమగ్రతను బలోపేతం చేయడానికి, మన దేశాన్ని ప్రపంచ వేదికలపై నిలపడానికి వారి 'మన్ కీ బాత్' ప్రసంగమాలికల ద్వారా నూతన స్ఫూర్తిని అందిస్తున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు అందరికీ సులభంగా అందుబాటులో ఉండే ప్రసార సాధనాలలో రేడియో ముందుంటుంది అన్నది అందరికీ తెలిసిన విషయమే. భాషను, యాసను కాపాడుతూ, సాహితీ పిపాసను పెంపొందించడంలో నాటి నుంచి నేటి వరకు రేడియో ప్రభావవంతమైన సాధనం. ప్రసారభారతి ఆర్కైవ్స్ విభాగం మహనీయుల రికార్డింగులను భద్రపరిచి మనకు అందిస్తున్నది. శాస్త్రీయ, జానపద, లలిత సంగీత, నాటక కళాకారులు ఆకాశవాణి గ్రేడింగ్‌నే ప్రామాణికంగా తీసుకుని రేడియో ద్వారా ఇతర ప్రసార మాధ్యమాలకు అనుసంధానంగా మారుతున్నారు.

ఆకాశవాణి హైదరాబాద్, కడప, విజయవాడ, విశాఖ కేంద్రాలకు తోడుగా, తెలుగు గాలిని శబ్ద పరిమళాలతో నింపుతున్న స్థానిక తెలుగు రేడియో కేంద్రాలు ఆయా మట్టి పరిమళాలను వెదజల్లుతున్నాయి. వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కొత్తగూడెం, అనంతపురం, తిరుపతి, కర్నూల్, మార్కాపురం... వంటి లోకల్ రేడియో స్టేషన్లు మొబైల్ యాప్ మాధ్యమం వలన 'లోకల్ టు గ్లోబల్ వోకల్'గా వినిపిస్తున్నాయి. ప్రసారమే ప్రాణం అన్న నానుడిని సార్థకం చేస్తూ, ఆకాశవాణి ప్రస్థానం నిత్య నూతనంగా కొనసాగాలని ఆశిద్దాం!

◆ మడిపల్లి దక్షిణామూర్తి
(నేడు జాతీయ ప్రసార దినోత్సవం)

పరాకాష్ఠకు కమ్యూనిస్టుల పిడివాదం!

రష్యా, చైనాలను సోషలిస్ట్ సామ్రాజ్యవాద దేశాలని పేర్కొనడం తప్పే. ఎందుకంటే అవి పెట్టుబడిదారీ నియంతృత్వ సామ్రాజ్యవాద దేశాలు. అక్కడ ఉన్నది వ్యక్తి లేదా పార్టీ నియంతృత్వం. అక్కడ పీడిత ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చడం లేదు. అక్కడ సంపద సమాజపరమూ కాలేదు. సోషలిజం వదిలి అవి ఏనాడో పెట్టుబడిదారీ దేశాలైనాయి. అయినా భారతీయ కమ్యూనిస్టులకు రష్యా, చైనాల పట్ల మక్కువ పోవడం లేదు. పెట్టుబడిదారీ ప్రజాస్వామిక సామ్రాజ్యవాద దేశాలకు రష్యా, చైనాలు ఎందులోనూ తీసిపోవు.

"ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధంగా పరిగణించకూడదు కానీ, పాలస్తీనా–ఇరాన్‌లపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను మాత్రం సామ్రాజ్యవాద యుద్ధంగా పరిగణించాలి" అని పేర్కొనడం కమ్యూనిస్టుల హ్రస్వదృష్టికి నిదర్శనం. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత సోవియట్ విప్లవం విజయవంతమైంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత చైనా, తూర్పు యూరోపుల్లో విప్లవాలు చెలరేగి సోషలిస్ట్ శిబిరాలు ఏర్పడ్డాయి. కాబట్టి ఇప్పుడు మూడవ ప్రపంచ యుద్ధం జరిగితే మూడవ వరస విప్లవాలు జయప్రదం అవుతాయి అనుకోవడం (జూలై 8న డా. శ్రీనివాస్ రచన 'సామ్రాజ్యవాద అంతిమ బుసలు') చారిత్రక అవగాహనారాహిత్యమైనా, పిడివాదం పరాకాష్ఠకు చేరడమైనా లేదా సైద్ధాంతిక హింసోన్మాదమైనా కావాలి. అనేక దేశాలు అత్యాధునిక అణ్వాయుధాలు సమకూర్చుకున్న ఈ కాలంలో ప్రపంచ యుద్ధమంటూ జరిగితే మానవజాతి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అపుడు చావగా మిగిలిన మనుషులతో ఆదిమ కమ్యూనిజం స్థాపించడం కమ్యూనిస్టుల ఉద్దేశమా?

"ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం. నర జాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అన్న శ్రీశ్రీ పలుకులు కమ్యూనిస్టు దేశాలకూ వర్తిస్తాయి.

1932, 1933లో ఉక్రెయిన్‌లో తలెత్తిన కరువు స్టాలిన్ నిర్దయ వల్లేనన్నది మానవ చరిత్రలోని చీకటి అధ్యాయాలు చెబుతున్నాయి. లెనిన్ హయాంలో రూపొంది, 1921–1928 మధ్య అమలైన కొత్త ఆర్థిక విధానం వల్ల ఉక్రెయిన్ ఆర్థికంగా పురోగమించింది. కానీ లెనిన్ తదనంతరం ఉక్రెయిన్ వాసుల స్వతంత్ర కాంక్షను తొక్కివేయడానికి, రష్యా పారిశ్రామికీకరణ కోసం స్టాలిన్ అవలంబించిన విధానాల వల్ల ఆకలితో అలమటిస్తూ సుమారు ఐదు మిలియన్ల ఉక్రెయిన్ ప్రజలు నాశనమయ్యారు. ఆ కిరాతక కాలంలో కరువుతో అలమటిస్తూ అక్కడి మనుషులు నరమాంస భక్షణకు పూనుకున్నారనే విషయం మానవజాతి చరిత్రలో అత్యంత విషాదకరం. కమ్యూనిస్టులు పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా మానవజాతికి చూపుతున్న ఉన్నతమైన సమాజం ఇటువంటిదేనా?

చైనాలో సుమారు ఒక మిలియన్ టిబెటన్ పిల్లలను కుటుంబాలను నుంచి వేరు పరచి, ప్రభుత్వం నడిపే బోర్డింగ్ స్కూళ్లలో బలవంతంగా చేర్చి, వారిని టిబెటన్ సంస్కృతి వదిలి హాన్ సంస్కృతిలో భాగమయ్యేలా చేయడానికి అక్కడి కమ్యూనిస్ట్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఐక్యరాజ్యసమితి మానవహక్కుల పరిశీలకులు ఆందోళన వెలిబుచ్చారు. జాతీయవాద అస్తిత్వంతో కూడిన బలమైన సోషలిస్ట్ వ్యవస్థను రూపొందించడానికి చైనా చేస్తున్న అమానవీయ ప్రయత్నాలు ఫాసిజం పరిధిలోకి రావా? దీని గురించి మాట్లాడకుండా భారతదేశంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఫాసిస్టు ప్రభుత్వమంటూ రోజూ గగ్గోలు పెట్టే భారతీయ కమ్యూనిస్టుల విశ్వసనీయత సందేహాస్పదంగా ఉంది.

సామ్రాజ్యవాదులకు సింహస్వప్నమైన ఉత్తర కొరియా కమ్యూనిస్ట్ నాయకుడు కిమ్ ఇల్ సంగ్ నెలకొల్పింది స్వేచ్ఛాయుత సమసమాజమా లేక నిత్యం భయం గుప్పిట్లో ఉండే వంశ పారంపర్య నియంతృత్వ రాజ్యమా? కిమ్ ఇల్ సంగ్ మనవడు కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలో ఉత్తర కొరియాలో విస్తృతంగా మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని 2014 యుఎన్ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ (సీఓఐ) రిపోర్ట్ ప్రపంచానికి చాటిచెప్పింది. నియంత పట్ల విధేయంగా ఉండేందుకు ప్రజలను అన్యాయంగా కారాగారాలలో వేయడం, చంపడం, వారితో వెట్టి చాకిరీ చేయించడం వంటి విధానాలను ఉత్తర కొరియాలో అమలు చేస్తున్నారని, స్త్రీల పట్ల లైంగిక వేధింపులు సాధారణమైపోయాయని, కనీస మానవహక్కులను కూడా ప్రజలకు లేకుండా చేస్తున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలియజేసింది.

రష్యా, చైనా, ఉత్తర కొరియా కథలు వింటేనే అర్థమవుతుంది... కమ్యూనిజం మానవజాతికి ఇచ్చేది అభయం కాదు, భయమేనని. విమర్శలను కాపిటలిస్ట్ ప్రోపగాండా అంటూ కొట్టిపారేస్తూ సైద్ధాంతిక పరిభాషతో తాము చేసిన, చేస్తున్న, చేయబోయే హింసను సమర్థించుకునే కమ్యూనిస్టులతో ఉన్నతమైన సమాజం సాధ్యమవుతుందనుకోవడం అవివేకమే అవుతుంది. ఇది చరిత్ర చాటుతున్న సత్యం.

○ గౌరాబత్తిన కుమార్‌బాబు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 23 జూలై 2025


పెనుమూడి సమీపంలో గుంతలమయంగా కరకట్ట

కరకట్టకు.. కోతలు

గుంతలమయంగా రహదారి

- ప్రమాదభరితంగా మారినా పట్టించుకోరు
- ఇసుక టిప్పర్ల తాకిడికి పూర్తిగా కుంగిన కట్ట
- వరదల సమయంలో అధికారులు హడావుడి

నదీ తీర ప్రాంతాలపై కృష్ణమ్మ కన్నెర్ర చేయకుండా కట్టడి చేయాల్సిన కరకట్ట ప్రమాదకరంగా మారింది. కోతలతో కట్ట ఎక్కడికక్కడ బలహీనంగా మారింది. పటిష్ఠంగా ఉండాల్సిన కరకట్ట రహదారి మొత్తం పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఉంది. కోతలు, గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తోందోనని కరకట్ట సమీప గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ప్రధానంగా వర్షాలు, వరదల సమయాల్లో అయితే రాత్రిళ్లు కంటిమీద కును కు వేయరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతంలో కరకట్టకు పలు ప్రాంతాల్లో కోతతో ఆయా గ్రామాలను వరద ముంచెత్తినా అధికారులు హడావుడితో సరిపెట్టారే కానీ పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గుంతలు పడిన కరకట్ట

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం నుంచి.. దిగువన కృష్ణమ్మ సముద్రంలో కలిసే వరకు ఉన్న కరకట్ట ప్రమాదకరంగా మారింది. వరదపోటును నివారించడంలో కరకట్ట పాత్ర ఎంతో కీలకమైనా ప్రభుత్వం దాని పటిష్ఠతపై దృష్టి సారించడంలేదు. ఎన్నో దశాబ్దాలుగా కృష్ణానది పరివాహక ప్రాంతాలుగా ఉన్న గ్రామాలను కావలి కాసే కరకట్ట పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఇసుక (మిగతా 6వ పేజీలో)

గాడి తప్పిన సంక్షేమం


సాంఘిక సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణలో నిర్లక్ష్యం

- కళాశాల బాలికల భద్రతపై నీలినీడలు
- అనేక ఘటనలు వెలుగు చూస్తున్నా.. పట్టించుకోని వైనం
- మౌలిక వసతులు, భోజనంపై విద్యార్థుల అసంతృప్తి

గుంటూరు (విద్య) జూలై 22 (ఆంధ్రజ్యోతి): పర్యవేక్షణ లోపం, సంక్షేమంపై నిర్లక్ష్యం వెరసి పేద విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గత ఐదేళ్లుగా సాంఘిక సంక్షేమ శాఖలో ఏకపక్ష నిర్ణయాలు ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. నూతన డీడీ చెన్నయ్య ఆధ్వర్యంలో అయినా ఆ శాఖ పనితీరు మెరుగుపడు తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నూతన డీడీ హాస్టల్ (మిగతా 6వ పేజీలో)

సాంఘిక సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నుంచి కొంతమంది అధికారులు నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. సిబ్బంది పనిచేయకపోయినా.. వారికి జీతాలు ఇస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.



ఉప సంఘంలో.. మంత్రులు
అనగాని, నాదెండ్ల
- జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పులకు క్యాబినెట్ సబ్ కమిటీ
- త్వరలో జిల్లాల్లో పర్యటించే అవకాశం

సేవ, నిజాయితీగా విధులు
నిర్వహించాలి
- ప్రొబేషనరీ ఎస్‌ఐలకు రేంజ్ ఐజీ త్రిపాఠి సూచన

కందుల డబ్బులు ఎప్పుడు
పడతాయబ్బా.!
- ఖరీఫ్ సాగు ఖర్చులకు రైతుల ఎదురుచూపులు

8

సెప్టెంబరు 29 నుంచి శబరి ప్రయాణ సమయం మార్పు

అమరావతి రైలు మార్గానికి..భూములిస్తాం !
- నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పాలి
- కొప్పురావూరులోని కొంతమంది రైతులు జేసీకి నివేదన

మంగళగిరి రైల్వే ట్రాకుపై పూర్తయిన ఆర్వోబీ


అనుసంధానం మొదలు


వెస్ట్‌బైపాస్ ఎంట్రన్స్ వద్ద జరుగుతున్న ఆర్చ్ నిర్మాణ పనులు

తుది దశకు వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4

- కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు
- ఎన్‌హెచ్- 16 రాకపోకలు సర్వీసు రోడ్డులోకి మళ్లింపు
- సెప్టెంబరు చివరి నాటికి అందుబాటులోకి..

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, గుంటూరు నగరాల ట్రా ఫిక్‌ను క్రమబద్ధీకరించడం, రాజధాని అమరావతిని అన్ని జిల్లాలకు అనుసంధానించడంలో అత్యంత కీలకమైన వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్టీ ఆర్ జిల్లా విజయవాడ పక్కనే ఉన్న గొల్లపూడి నుంచి గుంటూరు జిల్లా కాజ టోల్‌గేటు వరకు సా గుతున్న ప్యాకేజీ 4 నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రస్తుతం కాజ టోల్ గేట్‌కు సమీపంలో ఈ రోడ్డును ఎన్‌హెచ్-16లో అనుసంధానించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

● కీలకమైన బ్రిడ్జి పూర్తి

విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ప్యాకేజీ- 4 కింద 18.2 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మిస్తు న్నారు. ఇందులో కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల మేర నిర్మించే బ్రిడ్జి అత్యంత కీలకమైంది. ఈ బ్రిడ్జి నిర్మాణం దాదాపు మూడు నెలల క్రితమే పూర్త యింది. రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్ర మంలో భాగంగా మే 2న ఈ బ్రిడ్జి అందుబాటు లోకి కూడా వచ్చింది. ఈ సమయంలో ఎన్టీఆర్, కృష్ణా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల కూటమి ముఖ్య నేతలకు ఈ బ్రిడ్జి మీద నుంచే రూట్ మ్యాప్ ఇచ్చారు. జూన్ నుంచి బ్రిడ్జి అందుబాటులోకి వస్తుందని భావించినప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో పనులు పెండింగ్ ఉండడంతో బ్రిడ్జి ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు. మందడం టోల్‌గేట్ (మిగతా 6వ పేజీలో)


బ్యారేజి దిగువకు 14,498 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వర్షాల ధాటికి మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరిగింది. ఎగువన ఉన్న వాగుల నుంచి 10,877 క్యూసెక్కులు రిజర్వాయర్‌కు చేరుతుందని జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 15 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 14,498 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా కాల్వలకు నీటి విడుదల ఆపారు. తూర్పు డెల్టా కాల్వలకు 3623 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జిల్లా అధ్యక్ష పదవిపై..కసరత్తు

- తప్పుకునేందుకు సిద్ధంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్
- బీసీ సామాజికవర్గానికి ఇస్తే బాగుంటుందని నేతల సూచన
- నెలాఖరులోగా కొలిక్కి వచ్చే అవకాశం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తప్పుకోనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర రాజధాని అమరావతికి కేంద్ర బిందువుగా ఉన్న గుంటూరు జిల్లాలో కొత్త రథ సారథి ఎంపికకు అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే ఎన్నికల తర్వాత పల్నాడు, బాపట్ల జిల్లాల పార్టీ అధ్యక్షులను మార్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గుంటూరు జిల్లాకు కూడా మార్చాలని అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు భావించగా సరైన ప్రత్యామ్నాయాన్ని జిల్లా ప్రజా ప్రతినిధులు



సూచించకపోవడంతో వాయిదా పడింది. రాజధాని ప్రాంత ఎమ్మెల్యే అయిన శ్రావణ్‌కుమార్ అక్కడి వ్యవహారాలతో బిజీగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోని పార్టీ వ్యవహారాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. దీంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైంది. పల్నాడు జిల్లా అధ్యక్ష పదవి కమ్మ సామాజికవర్గానికి ఇవ్వడంతో గుంటూరులో ఇతర సామాజికవర్గాలకు ప్రాధాన్యం ఇస్తే బాగుంటుందని ఆలోచన చేస్తున్నారు. ఇదే జిల్లా నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న యువనేత నారా లోకేశ్ ప్రథమ ప్రాధాన్యం బీసీలకు ఇవ్వాలని జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులకు సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పలువురు బీసీ నేతల పేర్లు తెరపైకి (మిగతా 6వ పేజీలో)


ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరిలో ఐటీ కంపెనీలు

- ప్రతినిధుల ఆసక్తి.. 50 వేల మందికి ఉపాధి
- నియోజకవర్గంలో పది వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం
- సమీక్షలో అధికారులతో మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఐటీ, ఇతర ప్రముఖ కంపెనీలు మంగళగిరికి వచ్చేం దుకు ఆసక్తిని చూపుతున్నాయని, భవిష్యత్తులో 50 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఉండవల్లి నివాసంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడు తూ మంగళగిరికి వచ్చేందుకు ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు ఆసక్తిని చూపిస్తున్నాయని, ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎంతో కాలంగా నివాసం ఉంటున్న వారికి రెండో విడతలో రెండు వేల ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో పది వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని, ఇందుకు అవసరమైన స్థల సేకరణపై కసరత్తు చేయాలన్నారు. అందుబాటులో ఉన్న భూముల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. తాడేపల్లి రిటైనింగ్ వాల్, మంగళగిరి నృసింహాలయ అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు, సాంఘీక సంక్షేమ వసతి గృహాలు,మోడ్రన్ లైబ్రరీ, పార్కులు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసింహ, దేవదాయ కమిషనర్ రామ చంద్ర మోహన్, జడ్పీసీఈవో జ్యోతిబసు పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతలు తొలగింపునకే పీ-4

- వైద్య, విద్యా సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి అట్టడుగున ఉన్న కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరు మార్గదర్శులుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో విద్యాసంస్థల యాజమాన్యాలు దత్తత తీసుకోవాలని కోరారు. పీ4 కార్యక్రమంపై కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రైవేటు వైద్య, విద్యా సంస్థల ప్రతినిధుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 1,00,000 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. మార్గదర్శులు వారి పరిసర ప్రాంతాల్లోనే వ్యక్తిగతంగా కనీసం ఒక కుటుంబాన్ని, సంస్థలు ఐదు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ భార్గవ తేజ, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ శౌరి రాజు, డీవీఏపీ సభ్యుడు, డీఈవో రేణుక, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, ఇంటర్మీడియట్ ఆర్ఐవో సునీత పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి


కృష్ణ బాబుకాలనీలో..


జోసఫ్‌నగర్‌లో..


కార్మికుల కాలనీ 4 వ లైనులో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు.

శివార్లు.. తటాకాలు

గుంటూరు కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ప్రధాన రహదారులతోపాటు లోతట్టు ప్రాంతాలు, శివార్లు పూర్తిగా జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారు. శివారు ప్రాంతాల్లోని పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడుగుపెట్టే పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో లేదు. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇళ్లను కూడా వర్షపు నీరు సమీపంలోని మురుగునీటితో కలిసి ముంచెత్తింది. మంగళవారం వర్షం పడకపోయి నా కమ్మ శేషయ్యగ్రౌండ్, సంగడిగుంట, శ్రీలక్ష్మీనగర్, ఎల్ఆర్‌కాలనీ, ఏటుకూరు రోడ్డు కాలనీ, రామిరెడ్డినగర్, ఐపీడీ కాలనీ, జోసఫ్ నగర్, కార్మికుల కాలనీ తదితర ప్రాంతా లు జలమయంగా దర్శనమిచ్చాయి. ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉం డటంతో వర్షపు నీరు పోయే మార్గాలు మూసుకుపోవడంతోనే ఈ దురవస్థని ప్రజలు వాపోతున్నారు. కాకాని రోడ్డు, అమరావతిరోడ్డు, నందివెలుగు రోడ్డు, పొన్నూరు రోడ్డు, నల్ల పాడు రోడ్డు, పలకలూరురోడ్డు కూడా తటాకాల్లా మారాయి. మూడు వంతెనలు, కంకరగుంట అండర్ పాస్‌ల్లో ప్రజలు రాకపోక లకు అల్లాడుతున్నారు. అయి నా అధికారుల్లో చలనం లేదు.


కార్మికుల కాలనీ ఖాళీ స్థలాల్లో నిలిచిన వర్షపు నీరు.


కేవీపీ కాలనీ శివారులో...

కోల్డ్ స్టోరేజీ రైతులకు పంట బీమా నగదు

● మంత్రి నారా లోకేశ్ చొరవతో న్యాయం

● 280 మంది రైతుల ఖాతాల్లో రూ.18.5 కోట్లు జమ

దుగ్గిరాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాద బాధిత రైతుల ఖాతాల్లో పంట బీమా నగదు జమ ప్రక్రియ తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. ఏడాదిన్నర కాలం పరిహారం కోసం రైతుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. గోడౌన్ జనవరి 19న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా 400 మందికిపైగా రైతుల పంట అగ్నికి ఆహుతైన విషయం విదితమే. నెలల తరబడి పలు ప్రజా సంఘాలు, రైతు సంఘాలతో కలిసి ధర్నాలు, దీక్షలు చేసినప్పటికీ అప్పటి వైసీపీ హయాంలో ఎలాంటి పరిహారం అందకపోవడంతో రైతులు నిరాశ, నిస్పృహలతో మిన్నకుండి పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్ బాధిత రైతులకు న్యాయం చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్ చొరవతో తమకు న్యాయం జరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనవరిలో ప్రమాదం జరిగాక ధర్నాలు, దీక్షలు చేపట్టినప్పటికీ అప్పటి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని వాపోతున్నారు. ఈ సమయంలోనే ఎన్నికల ప్రచారానికి వచ్చిన నారా లోకేశ్‌కు తమగోడును వారు వినిపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, పంట బీమా అందేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు పురోగతిపై చర్చిస్తూ వచ్చారు. ఇన్సూరెన్స్ సంస్థల మార్కెటింగ్ అధికారులు వచ్చి, బాధిత రైతులను పిలిపించి, వివరాలు కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం ఇచ్చిన బాండ్లను, ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గుంటూరులో జరిగిన సమావేశంలో దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీ బాధిత రైతులకు అందాల్సిన పరిహారం గురించి చర్చించారు. ఈ నేపథ్యంలో సోమవారం దుగ్గిరాల ఖాతాలో నగదు జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఐతే కొంతమంది బాండ్ల వివరాలు, ఇతర పత్రాల్లోని వివరాల్లో తేడాలున్నట్లు గుర్తించడంతో తుదిదశ పత్రాల పరిశీలన చేపట్టి నగదు జమచేస్తామని తెలిపారు. తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలి రావాలని సూచించారు. రైతులకు రూ.20.56కోట్లు, వ్యాపారులకు రూ.8కోట్లు మంజూరయ్యాయన్నారు. రైతులకు సోమవారం కొందరు రైతుల బాండ్లను, బ్యాంకు ఖాతా పుస్తకాలను తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం వరకూ తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 280 మందికి రైతుల పత్రాలను పరిశీలించి, రైతుల ఖాతాల్లో రూ.18.5కోట్ల వరకూ జమచేసి, ఆ చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన రైతులకు ఫోన్‌లు చేస్తున్నామని, బుధవారం కూడా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రైతుల కోసం తమసిబ్బంది బాండ్లు, ఇతర పత్రాల తనిఖీ ప్రక్రియ చేపడుతుందని తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు మంచి పేరు తెచ్చేలా, బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరీ ఎస్ఐలకు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. ఈ మేరకు శిక్షణ పూర్తి చేసుకుని మంగళవారం జిల్లా ఎస్పీ వద్ద రిపోర్ట్ చేసిన 23 మంది ప్రొబేషనరీ ఎస్ఐలకు, అలాగే తాజాగా ఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందిన మరో ఆరుగురికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ నూతన ఎస్ఐల చేరికతో జిల్లా పోలీస్ బలగానికి నూతన నోత్సాహం వచ్చిందన్నారు. యువ ఎస్సైలలో పట్టుదల, శక్తి, సేవా తపన ప్రజలకి సమర్థవంతమైన పోలీస్ సేవలను అందించడంలో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రమోటి ఎస్సైలుగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్లలోని అనుభవం, నిర్వాహక నైపుణ్యం ద్వారా పోలీస్‌సేవల నాణ్యత మరింత మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎస్ఐలతో ఎస్పీ సతీష్ కుమార్

ఎస్ఐఆర్ నిర్వహించి ఓటర్ల జాబితా రూపకల్పన

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం గతంలో నిర్వహించిన విధంగా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్) నిర్వహించి ఓటర్ల జాబితా రూపొందించాలన్న ఆలోచనలో ఉందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకొని మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తాము తెలియజేస్తామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ మినీ సమావేశ మందిరంలో డీఆర్వో అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో ఖాజావలి మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో 1,200 మంది ఓటర్లు ఉండేలా, అంతకంటే అదనంగా ఉన్న ఓటర్లను సమీపంలోని పోలింగ్ బూత్‌లలో సర్దుబాటు చేసే ప్రక్రియను ప్రాథమికంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనిపై నియోజకవర్గాల వారీగా ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలతో చర్చించి అమోదం కోసం ఎన్నికల సంఘానికి పంపడం జరుగుతుందన్నారు. జిల్లాలోని బీఎల్వోలకు నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం శిక్షణను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. బీఎల్వోల మార్పులు, చేర్పులకు ఇక నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నందున జూలై 31 నాటికి బీఎల్వోల వివరాలు అమోదం కోసం ఎన్నికల సంఘానికి పంపించటం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ బూత్‌లు వారీగా బీఎల్ఏల వివరాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

చిన్నతనం నుంచి విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

● శాప్ ఛైర్మన్ రవి నాయుడు

పెదకాకాని, జూలై 22(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని శాప్ ఛైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో చిన్నారుల క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ తానా మహా సభల్లో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం, తెలు గు ప్రజలు సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు.

51,209 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 52,273 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,209 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,316 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13400	334	9500	12500
273	9800	12800	నెంబరు. 5	10000	13600
341	10000	13500	273	---	---
4884	---	---	341	10000	13600
సూపర్ 10	-----	---	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	----	---	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12400	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

అనుసంధానం మొదలు

(5వ పేజీ తరువాయి)

నిర్మాణంతో పాటు ఇక్కడే నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు ఇంకా కొంతమేర పెండింగులో ఉన్నాయి. దీంతోపాటు కృష్ణాయపాలెం, కురగల్లు ఈ-11 రోడ్డు సమీపంలో కొండవీటివాగు రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు కూడా జాప్యానికి మరో కారణం. ఈ పనులు కూడా ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. కాగా ఈ-10 రోడ్డు వద్ద అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు గుంటూరు- విజయవాడ రైల్వే లైనుపై మంగళగిరి, చినకాకాని సమీపంలో నిర్మించే ఆర్వోబీ కూడా పూర్తయింది. సేఫ్టీ వాల్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.

కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు

కాజ - చినకాకాని సరిహద్దుల్లో వెస్ట్ బైపాస్ అనుసంధానించడం కోసం ఎన్‌హెచ్- 16 మీద రాకపోకలను సర్వీసు రోడ్డులోకి మళ్లించారు. కాజ జంక్షన్ వద్ద వెస్ట్ బైపాస్ ఎంట్రన్స్‌లో పెద్ద ఆర్చి నిర్మాణాన్ని ఏర్పాటు చేసి సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. చిలకలూరిపేట వద్ద నిర్మించిన బైపాస్‌ను ఎన్‌హెచ్- 16లో అనుసంధానించిన విధంగానే కాజ వద్ద కూడా రెండు రోడ్ల అనుసంధానం ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు. కాగా సెప్టెంబరు చివరి నాటికి వెస్ట్ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని వారు స్పష్టం చేశారు.

గాడితప్పిన సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

వెల్ఫేర్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు జారీ చేశారు.

ఐదేళ్లుగా సమీక్షలు నిల్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాశాల, పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వసతి గృహాలు న్నాయి. వీటిల్లో దాదాపు పదివేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. వసతి గృహాలను పరిశీలిస్తే.. ఒకరిద్దరూ మినహా మిగిలిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా అనేక సమస్యలు వసతి గృహాల్లో తిష్ట వేశాయి.

సంక్షేమ వసతి గృహాల్లో దారుణాలు

● గుంటూరులోని సంక్షేమ శాఖ వసతి గృహంలో వాచ్‌మెన్, ఆయాల ప్రోద్బలంతో కొంతమంది ఆకతాయిలు విద్యార్థుల్ని లైంగికం గా వేధించిన ఘటనలున్నాయి.

● నగరంలోని కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి, బిడ్డకు జన్మనిచ్చినా.. గుర్తించలేని దుస్థితిలో పర్యవేక్షణ ఉంది.

● జూట్ మిల్ సమీపంలోని మరో కళాశాల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని వైసీపీ పాలనలో ఓ నాయకుడి అనుచరులు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేశారు. నగరంలోని రాజీవ్ స్వగృహ నివా సాల్లో ఉంచి రెండు రోజులు వేధించారు.

● నగరం నడిబొడ్డున ఒక వసతి గృహంలో వంట సరిగా లేక.. విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్‌కి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గతం డీడీకి నివేదిం చినా.. పట్టించుకో లేదు.

● మరోవైపు హెచ్‌డబ్ల్యూఓలు పెట్టే బిల్లుల్లో కూడా కమిషన్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పేరుతో భారీ మొత్తంలో వసూళ్లు చేసిన ఘటనలున్నాయి.

● కొంతమంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై విజిలెన్స్ విచారణ ఉన్న పట్టించుకోవడం లేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపడం లేదని విమర్శలున్నాయి.

● తాజాగా నగరంలోని ఓ కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయం గోప్యంగా ఉంచి సదరు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.ఇలా సాంఘిక సంక్షేమ శాఖ గత అధికారుల హయాంలో గాడి తప్పింది. నూతనంగా వచ్చిన అధికారి అయిన శాఖను గాడిలో పెడతారా? లేదా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

కరకట్టకు.. కోతలు

(5వ పేజీ తరువాయి)

టిప్పర్ల రాకపోకలతో ఎక్కడికక్కడ గోతులకు తోడు.. నదిలోని నీటిని వినియోగించుకునేందుకు గండ్లుకొట్టి వేసుకున్న పైపులతో కట్ట శిథిలావస్థకు చేరింది. శిథిలమైన కరకట్ట ప్రస్తుతం బలహీనంగా మారింది. కట్టపై యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్న ఇసుక టిప్పర్ల నియంత్రణపై, అక్రమంగా పైపులైన్లు వేసుకుంటున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కరకట్ట ప్రమాదకరంగా మారింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న కరకట్ట ఇసుక తరలించే వాహనాలతో మరింత అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఎక్కడికక్కడ కుంగిపోయింది. పలుచోట్ల భారీగా కరకట్ట కోసుకుపోయింది. 2009 అక్టోబరు 5న తెల్లవారుజామున రేపల్లె మండలంలోని ఓలేరు పల్లెపాలెం వద్ద భారీ గండి పడి వరద నీరు చుట్టుపక్కల గ్రామాలను, పొలాలను ముంచెత్తింది. అప్పటి నుంచి ప్రతిఏటా వరదల సమయంలో ప్రత్యక్షమయ్యే అధికారులు, ప్రజాప్రతినిధులు కట్టను పటిష్ఠం చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప పదేళ్లుగా పట్టించుకోలేదు. ఓ మోస్తరుగా నదిలో నీరు ప్రవహిస్తున్నా అది సమీప గ్రామాలను ముంచెత్తుతోంది. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. పైగా బ్యారేజి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని కట్ట వెంబడి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరకట్ట పటిష్ఠతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన కృష్ణారివర్ అథారిటీ అధికారులు కనీసం కట్టలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. వాహనాల రాకపోకలు, పైపులైన్లు వేసిన ప్రాంతాల్లో ఇప్పటికే కట్ట పూర్తిగా బలహీనపడింది. ఇలాంటి చోట్ల గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది. కిందటేడాది వచ్చినట్లు వరద వస్తే కట్ట మీద నుంచి రాజధానితో పాటు బ్యారేజీ దిగువన ఉన్న గ్రామాల్లోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నది నుంచి ఇసుకను తరలించే భారీ టిప్పర్లు నిత్యం వందల సంఖ్యలో కరకట్టపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రాజధాని గ్రామాలైన లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెంలో కరకట్ట పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత వైసీపీ హయాంలో అప్పటి ఎంపీ నందిగం సురేశ్ నేతృత్వంలో టిప్పర్ల రాకపోకలతో కరకట్ట పూర్తిగా ధ్వంసమైపోయింది. బ్యారేజి దిగువన పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, కనగాలవారి పాలెం సమీపంలో పైప్‌లైన్లతో ప్రమాద భరితంగా మారింది. దీంతో మైనేనివారిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లక్ష్మీపురం, అడవిపాలెం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కట్టను పటిష్ఠం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోలేదంటున్నారు. కరకట్టపై పెట్రోలింగ్ చెయ్యాల్సిన అధికారులు స్థానికంగా ఉండకుండా గుంటూరులో నివాసం ఉంటున్నారు. దీంతో కట్టపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గత ఏడాది వరదల సమయంలో కృష్ణారివర్ ఏఈ ప్రత్యక్షమై హడావుడి చేశారు. ఆ తర్వాత ఈ పదినెలల్లో ఒక్కసారి కూడా కట్టను పరిశీలించిన దాఖలాలు లేవు.

ప్రమాదవశాత్తూ.. రైలు ఢీకొని ఉద్యోగి మృతి

తెనాలి, మారీసుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుంగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చెంచుపేటకు చెందిన డి జాన్‌బాబు (55) గుంటూరు ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా పెరాల్సిస్ రావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెనాలి రైల్వే స్టేషన్ 4వ నంబరు ప్లాట్‌ఫాం వద్ద పట్టాలు దాటుతుండగా రైల్ రావడం గమనించక ట్రైన్ ఢీకొని మృతి చెందాడు. ట్రైన్ లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు జాన్‌బాబుకు భార్య, కుమార్తె ఉన్నారు.

అంధ బాలిక హత్య కేసులో.. రౌడీషీటర్‌కి జీవిత ఖైదు

గుంటూరు (లీగల్), జూలై 22(ఆంధ్రజ్యోతి): అంధ బాలికను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి షమ్మి పర్విన్ సుల్తాన్ బేగం మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాడేపల్లి పట్టణంలోని ఎన్‌టీఆర్ కట్ట వద్ద 2023 ఫిబ్రవరి 12న ఒంటరిగా ఉన్న 17 ఏళ్ల అంధ బాలికపై నిందితుడు నాగపోగు దయానందరాజు అలియాస్ కుక్కల రాజు తన కోర్కె తీర్చలేదన్న కక్షతో కత్తితో విచక్షణారహితంగా నరికివేశాడు. తీవ్రంగా గాయపడిన బాలికను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా 13న చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. వ్యసనాలకు బానిసైన కుక్కల రాజు భార్య, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ కొంతకాలంగా ఈ ప్రాంతంలో నివశిస్తూ ఈ బాలికపై కన్నేశాడు. తల్లి పనులకు వెళ్లిన సమయంలో బాలిక తన చిన్నమ్మ ఇంటి వద్ద కూర్చొని ఉంది. ఈ సమయంలో నిందితుడు తన కోర్కె తీర్చమని కోరగా బాలిక ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొద్దిసేపటికి బాలిక తల్లి రాగా విషయం తెలుసుకుంది. ఈ విషయంపై బాలిక తల్లి కుక్కల రాజును నిలదీసింది. అనంతరం బాలికను తన ఇంట్లో ఉంచి కిరణా దుకాణం వద్దకు ఆమె వెళ్లింది. దీంతో ఒంటరిగా ఉన్న బాలికపై రాజు ఆగ్రహంతో కత్తితో శరీరం మొత్తం నరికి తీవ్రంగా గాయపర్చాడు. వెంటనే తల్లివచ్చి ఘొల్లుమంది. 108 వాహనంలో బాలికను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. నిందితుడి కుక్కల రాజును తాడేపల్లి పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరు పర్చారు. కోర్టులో అప్పటి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ సౌత్ డీఎస్పీ జెస్పీ ప్రశాంతి చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడు గత రెండున్నర ఏళ్లుగా జైలులో ఉన్నాడు. విచారణలో ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో జీవిత ఖైదు, రెండు రూ.వేల జరిమానా విధిస్తూ న్యాయమూరి తీర్పు నిచ్చారు. ఈ కేసులో మైనర్ బాలిక హత్యకు సంబంధించి పోక్సో చట్టం కింద 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు జీవిత ఖైదు ఏకకాలంలో అమలు చేయాలని న్యాయమూర్తి చెప్పారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి గడ్డం మాధురి కీలక సాక్ష్యం చెప్పారు. అంధబాలికను నరికిన సమయంలో రక్తం చింది నిందితుడు కుక్కల రాజు చొక్కాపై పడటంతో.. పోలీసులు బాలిక రక్తం, నిందితుడు చొక్కాపై పడిన రక్తం నమూనాలను డీఎన్ఏ పరీక్షలకు పంపగా ఒక్కటేనని తేలింది. ఈ నివేదిక కేసులో కీలక సాక్ష్యంగా నిలిచింది. ప్రాసిక్యూషన్ తరుపున జిల్లా డిప్యూటీ డైరక్టర్ ఎండి బర్కత్ ఆలీఖాన్ నిర్వహించారు.

జిల్లా అధ్యక్ష పదవిపై..కసరత్తు

(5వ పేజీ తరువాయి)

వచ్చాయి. వీరిలో ఎవరైతే బాగుంటుందని జిల్లా ప్రజాప్రతినిధులు విశ్లేషిస్తున్నారు. బీసీలకు ఇచ్చే పక్షంలో డాక్టర్ నిమ్మల శేషయ్యకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని పార్టీ నేతలు గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి పెమ్మసానికి సూచించినట్లు తెలిసింది. ఎన్నికల్లో ఆయన పార్టీ విజయానికి అంకిత భావంతో కృషి చేశారని, ఒక దశలో ఆయనకు పశ్చిమ సీటు ఇచ్చే ఆలోచన కూడా అధిష్ఠానం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఆయనకు కాని పక్షంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేకు ఇచ్చినా బీసీలకు ఇచ్చినట్లే అవుతుందని కొందరు సూచించినట్లు తెలిసింది. పైగా పార్టీ కార్యాలయ నిర్వహణ ఖర్చులు భరించే స్తోమత కూడా ఆమెకు ఉన్నాయని చెబుతున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడుగా పనిచేసే అవకాశం తనకి ఇవ్వాలంటూ తాళ్ల వెంకటేష్‌యాదవ్ ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా కాపు సామాజికవర్గానికి చెందిన దాసరి రాజామాష్టారు పేరును కూడా కొందరు నేతలు సూచిస్తున్నారు. గతంలో యువనేత లోకేశ్ నేతృత్వంలో కందుకూరులో ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణా కేంద్రం నిర్వహణలో తాను చేసిన కృషిని ఈ సందర్భంగా రాజామాష్టారు ప్రజాప్రతినిధులను కలిసి గుర్తు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా కసరత్తు పూర్తి చేసి జిల్లా పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉందని సమాచారం.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే నసీర్

ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వం

- తూర్పు ఎమ్మెల్యే నసీర్
- 50 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వమని, అందుకే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తోందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆయన పలువురు అనారోగ్య బాధితులకు రూ.76.72 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.3.50 కోట్ల నిధులు అందజేశామని, ఇది తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్స్ ఎల్లావుల అశోక్, వేముల జ్యోతి, గోళ్ళ ప్రభాకర్, చల్లా ఆంజనేయ ప్రసాదు, మహమ్మద్ హాఫీజ్, జమీర్, ఉస్మాన్, బ్రహ్మాసాని శ్రీనివాసరావు, జబి, రియాజ్, అల్లం బాజీ, రబ్బాని, ఖుద్దూస్, జాదా, రాతంశెట్టి జగన్, సలీం, జాడ సురేష్, కంటే దిలీప్, సుఫియా, కలాం, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండేలా చూసుకోవాలి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షించాలని చెప్పారు. పనులు ఎంత వరకు పూర్తయ్యాయి? ఇంకా ఎంత శాతం పూర్తవ్వాలి? ఎన్ని రోజులు సమయం తీసుకుంటుంది వంటి అంశాలపై ఆయన ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భారీ ప్రాజెక్టులు చేపట్టామని, ఇవి గుంటూరు నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వీటి నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

వంద కోట్ల మందికి నాడీ సంబంధిత రుగ్మతలు

- న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ



ప్రసంగిస్తున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ.విజయ

గుంటూరు మెడికల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మెదడు సంబంధిత వ్యాధులు పుట్టిన నాటి నుంచి వృద్ధాప్య దశ వరకు ఎవరినైనా ప్రభావితం చేయవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్, డాక్టర్ పీ విజయ తెలిపారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా మంగళవారం కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెదడు, నరాల జబ్బులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. పిల్లల్లో సెరిబ్రల్ పాల్సీ, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, మెనింజైటిస్, పెద్దల్లో పక్షవాతం, మైగ్రేన్, నాడీ వ్యవస్థ కేన్సర్లు, డిమెన్షియా, పార్కిన్‌సన్ వ్యాధి, డయాబెటిస్ న్యూరోపతి వంటి మెదడు జబ్బులు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆయా వ్యాధులను తొలి దశలో గుర్తించి తగిన చికిత్సలు పొందితే చాల వరకు సాధారణ జీవితం గడపవచ్చని డాక్టర్ విజయ తెలిపారు. కార్యక్రమంలో న్యూరాలజిస్టులు డాక్టర్ ఉప్పాల వీరమ్మ, డాక్టర్ ఉషా కిరణ్, డాక్టర్ రేష్మా, డాక్టర్ అజ్మా, న్యూరో సర్జన్‌లు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ సృజన, సైకియాట్రిస్ట్ డాక్టర్ అజయ్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రత్నాకర్ తదితరులు మెదడు, నరాల సంబంధిత వివిధ వ్యాధులు, వాటి నిర్ధారణ, చికిత్స పద్ధతులను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మిర్చి యార్డు, అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షిదయానందనగర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మూడు వంతెనల కింద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

- మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్



సమావేశమైన మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని డొంక రోడ్డు మూడు వంతెనల వద్ద వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకు పరిష్కారంగా రైల్వే శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహ్మద్ నసీర్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో రైల్వే ఇంజినీర్లు, జీఎంసీ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో మూడు వంతెనల దగ్గర డ్రైనేజి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రత్యేక సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు వంతెనల మార్గంలో రైల్వే శాఖ ట్రాక్ ఎక్స్ టెన్షన్ నిర్మాణం కోసం చేపట్టిన పనుల్లో భాగంగా డ్రెయిన్ పూర్తి స్థాయిలో నిర్మాణం చేయకపోవడం వలన ప్రజలు వర్షాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో శంకర్ విలాస్ వంతెన పనులు పూర్తి స్థాయిలో చేపడితే గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల అనుసంధాన మార్గంగా మూడు వంతెనల మార్గం ఉంటుంది కావున తక్షణం డ్రెయిన్ డైవర్షన్ పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో సిటి ప్లానర్ రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంట డ్రెయిన్లు, రోడ్ల ఆక్రమణలను తొలగించడంలో రాజీ లేదని, వర్షం నీరు, మురుగు సక్రమంగా పారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను నూరు శాతం తొలగించడానికి వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నల్లచెరువు మెయిన్ రోడ్, అన్న క్యాంటీన్ నుంచి పీకలవాగు వరకు ఇరువైపులా మంగళవారం పర్యటించి, డ్రెయిన్ మీద, ముందుకు ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ నల్లచెరువు మెయిన్ రోడ్డులో మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌పై ఆక్రమణల వలన పూడిక తీయడం వీలు కాలేదని, ఫలితంగా ప్రస్తుత వర్షాలకు నీరు డ్రెయిన్లలోకి వెళ్లడానికి వీలు లేక ఇళ్లల్లోకి వచ్చి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ఆక్రమణలను పట్టణ ప్రణాళిక అధికారులు నూరు శాతం తొలగించాలని అనంతరం పూడికతీత చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గణితం, రసాయన శాస్త్ర అధ్యాపక పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటన తెలిపారు అభ్యర్థులు పీజీలో 50 శాతం మార్కులు ఉండాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 24న ఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమోకు హాజరుకావాలని సూచించారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు వివరించారు వివరాలకు సాంబశివపేటలోని కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సీజీహెచ్ఎస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ విద్య

గుంటూరు, జులై 22 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) గుంటూరు వెల్నెస్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ విద్య నియమితులయ్యారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సీజీహెచ్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సీజీహెచ్ఎస్ నుంచి బదిలీపై ఆమె గుంటూరుకు వచ్చారు. డాక్టర్ విద్యను సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. డాక్టర్ విద్య మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల పాలిట సంజీవిని సీజీహెచ్ఎస్‌ను తీర్చిదిద్దటానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి.వివేకానంద మాట్లాడుతూ అందరూ అభిమానించే వైద్యురాలుగా డాక్టర్ విద్య మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. సీజీహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి మాట్లాడుతూ రోగుల బాగోగులు చూసే వైద్యులే ప్రజల పాలిట కనిపించే దైవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, జీఎస్టీ పెన్షనర్స్ సంఘం నేతలు గద్దె తిలక్, టి.వివేకానంద, పీవీ సత్యనారాయణ, కె సామ్రాజ్యం, పి కోటేశ్వరరావు, నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ విద్యని సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు

డీఎంహెచ్‌వోకు అభినందనలు

గుంటూరు(తూర్పు), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : హెల్త్ సెక్రటరీల బదిలీలను సమర్ధవంతంగా నిర్వహించిన డీఎంహెచ్‌వో విజయలక్ష్మిని ఏపీ ఎన్జీవో జిల్లా నాయకులు అభినందించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య శాఖలో ఒత్తిళ్ళు, అవకతవకలు లేకుండా బదిలీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్ సుందర్ శ్రీనివాసరావు, షరీఫ్, సుకుమార్, వెంకటరెడ్డి, విజయలక్ష్మి, రామకృష్ణ, నాగేశ్వరరావు, కరీం, మహిళా విభాగపు నాయకులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), జూలై 22(ఆంధ్రజ్యోతి): రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన పూర్తిచేసి రజకులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ మాదిరిగా లాండ్రీ వృత్తిదారులకు నెలకు 250 యూనిట్ల ఉచిత కరెంట్ ఇవ్వాలన్నారు. వాచ్‌మెన్‌లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికై ఆగస్టు 25న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. సమావేశానికి సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, సమావేశంలో ఈమని అప్పారావు, ఎల్.అరుణ, బొజ్జా సుబ్బారావు, సుబ్బారావు, అంజయ్య, నరసయ్య, కైలాసం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సమాజ ఎన్నికల నిర్వహణ

గుంటూరు(తూర్పు), జూలై 22(ఆంధ్రజ్యోతి): లోక్ ఆదాలత్ తీర్పు మేరకు త్వరలోనే విశ్వబ్రాహ్మణ సమాజ ఎన్నికలు నిర్వహిస్తామని శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు కందుకూరి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక అరండల్‌పేట ఆర్య సమాజం ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలను పరిష్కరించుకుని విశ్వబ్రాహ్మణ సంఘీయులతో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేదూరి శివరామకృష్ణ, పూసపాటి శేషగిరిరావు, వంగీపురపు వీర బ్రహ్మాచారి, పచ్చ శివాజీ, వేల్పూరి శివరామకృష్ణ, సున్నం మల్లికార్జునరావు, సున్నం శ్రీనివాస్, నల్లపాటి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రలతో జ్ఞానోదయం

గుంటూరు(తూర్పు), జూలై 22(ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలు చేసేటప్పుడు, తీర్థాల ప్రాముఖ్యత, చరిత్ర గురించి తెలుసుకోవడం ద్వారా జ్ఞానం, జ్ఞానోదయం లభిస్తుందని శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై మంగళవారం మహాభారతం అరణ్యపర్వంలోని తీర్థమహాత్యంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే మాధవి తదితరులు

కూలిన జీవితం..

గుంటూరు కార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరులో కల్వర్టు నిర్మాణంలో ఉన్న పనుల్లో స్లాబ్ కూలి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. నగరంలోని దేవాపురం పీకల వాగుపై కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ చెందిన కాంట్రాక్టర్ కావూరి కృష్ణ చైతన్య ఈ పనులను రూ.8 లక్షలకు టెండర్ దక్కించుకొని పనులు ప్రారంభించాడు. కల్వర్టు స్లాబు పనులు చివరి దశలో ఉన్నాయి. కూలి పనులకు వచ్చిన గోరంట్లకు చెందిన తాపీ కార్మికుడు తోట అప్పారావు(50) కిందుకు దిగి.. స్లాబ్ కింద పెట్టిన కర్రలను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో ముందుకు పడబోయిన ఆయన స్లాబ్‌కు పెట్టిన కర్రను లాగడంతో.. నిర్మాణ దశలో ఉన్న స్లాబ్ మొత్తం కూలి అతనిపై పడింది. అప్పారావు స్లాబ్ కింద పడిపోయి అక్కడే మృతి చెందాడు. మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పొక్లెయినర్‌తో స్లాబ్‌ను తొలగించారు. మృతదేహాన్ని బయటకు తీసి.. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు.

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

నగరంలోని దేవాపురంలో పీకలవాగుపై నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ కూలిన ఘటనలో అప్పారావు అనే రోజువారి కూలి మృతి చెందడం దురదృష్టకరమని, మృతుని కుటుంబానికి నగరపాలక సంస్థ తరుపున అండగా ఉంటామని, కాంట్రాక్టర్ మృతుని కుటుంబానికి రూ.5లక్షలు కుటుంబ పోషణ నిమిత్తం ఇచ్చేలా ఒప్పించామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం దేవాపురంలో కల్వర్ట్ కూలిన ఘటనలో మృతి చెందిన అప్పారావు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో మేయర్, కమిషనర్, పశ్చిమ నియోజకర్గ శాసనసభ్యులు గళ్లా మాధవి, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, బూసి రాజలత, షేక్ మీరావలి, ఖాజా మొహిద్దీన్ చిష్టి, అధికారులు పరిశీలించి, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కోర్టు అధికారులు, సిబ్బందిని సత్కరించి మేజిస్ట్రేట్ లత

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఐదో కోర్టు నుంచి బదిలీపై మరో కోర్టుకు వెళుతున్న సూపరింటెండెంట్ హనుమంతరావు, ఇతర సిబ్బందిని ఐదవ కోర్టు మెజిస్ట్రేట్ లత ఘనంగా సత్కరించారు. మేజిస్ట్రేట్ లత మాట్లాడుతూ తన వద్ద సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించిన హనుమంతరావు, ఇతర సిబ్బంది అంకితభావంతో పని చేశారన్నారు. ఈ సందర్భంగా కోర్టు గుమస్తాలు శివరామయ్య, సలాం, మీర్ బేగ్, ఉమాదేవి తదితరులను మేజిస్ట్రేట్ లత ఘనంగా సత్కరించారు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : తాను నడుపుతున్న ఆటోకు కిస్తీలు కట్టడం లేదని తండ్రి మందలించడంతో కుమారుడు మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడు శివారు శ్రీనివాసకాలనీలో చోటుచేసుకుంది. తిరుపతి రాము (28) దోస్త్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొద్ది నెలలుగా ఆటోకు కిస్తీలు కట్టడం లేదు. దీంతో ఫైనాన్షియర్ నుంచి ఒత్తిడి వస్తోంది. ఈ క్రమంలో కిస్తీలు ఎందుకు కట్టడం లేదని తండ్రి శ్రీనివాసరావు సోమవారం మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన రాము గడ్డి మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో ఆయనను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



మృతి చెందిన దినేష్

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చెన్నై-కలకత్తా జాతీయ రహదారిపై పొత్తూరు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రత్తిపాడుకు చెందిన బీటెక్ విద్యార్థి రెడ్డి దినేష్ (22) మృతి చెందాడు. ప్రత్తిపాడుకు చెందిన దినేష్, అదేవిధంగా వరుసకు సోదరుడైన గణేష్ ఇరువురు మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ప్రతి రోజు ద్విచక్రవాహనంపై ప్రత్తిపాడు నుంచి కళాశాలకు వచ్చి వెళ్తుంటారు. ద్విచక్ర వాహనానికి సంబంధించిన స్పేర్ పార్ట్స్ కొనుగోలు చేసేందుకు వారిరువురు మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై గుంటూరు వస్తున్నారు. వారు ప్రయాణిస్తున్న వాహనం పొత్తూరు అండర్ పాస్ పైన అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న దినేష్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న గణేష్‌కు గాయాలయ్యాయి. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చనిపోయిన మహిళ స్థానంలో మరొకరితో తప్పుడు రిజిస్ట్రేషన్

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చనిపోయిన మహిళను బతికున్నట్లుగా చూపి ఆ స్థానంలో మరో మహిళతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై నల్లపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్విఎన్ కాలనీకి చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావు భార్య పద్మావతి గతంలో మృతి చెందారు. ఆమె పేరుతో గోరంట్ల పంచాయతీ పరిధిలో ఎకరం 80 సెంట్ల పొలం ఉంది. అయితే ఏటి అగ్రహారంనకు చెందిన చింతారెడ్డి మహేశ్వర్ రెడ్డి ఓ మహిళను కొత్తపల్లి పద్మావతిగా చిత్రీకరించి గోరంట్ల పరిధిలోని ఆమె పేరుతో ఉన్న ఎకరం 80 సెంట్ల పొలాన్ని వేరొకరి పేరుతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు. దీనిపై మృతురాలి భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎంపికైన అభ్యర్థులతో ఎమ్మెల్యే మాధవి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

యువత కోసం మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక కృషి

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువత భవిష్యత్తు కోసం ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక కృషి చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు బ్రాడీపేట మాస్టర్ మైండ్స్ క్యాంపస్‌లో ఆమె నేతృత్వంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం వరకు జరిగిన ఇంటర్వ్యూలలో 378 మంది ఎంపికయ్యారు. వారందరికీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ నాగలక్ష్మి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజయ్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, మాస్టర్ మైండ్స్ మోహన్ కృష్ణ సహకారంతో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసుకోవటం ఆనందంగా ఉందన్నారు. యువతకు వారి అర్హతను బట్టి రూ.10,000- 40,000 వేల వరకు జీతాలు చెల్లించటానికి వచ్చిన కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రానున్న 5 ఏళ్ళలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు చంద్రముని, విజయ్ లక్ష్మీ, దుర్గా బాయి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు రోటరీ అచీవర్స్ క్లబ్ వితరణ

గుంటూరు విద్య, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేసినట్లు డాక్టర్ నాగార్జున కపిల్ వెల్లడించారు మొత్తం 50 మంది గర్భిణులకు కిట్లు అందజేసినట్లు ఆయన వివరించారు. పౌష్టికాహార వస్తువులైన ఖర్జూరాలు, పల్లి ఉండలు, గుడ్లు, రాగీ లడ్లు, మల్టీ గ్రైన్ పౌడర్లు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండపనేని విజయ్ కృష్ణ, గోనుగుంట్ల వెంకట్, కటకం రాజేష్, క్లబ్ పూర్వ అధ్యక్షుడు పిడికిటి తిలక్ బాబు, వల్లూరి సాంబశివరావు, పూర్వ ట్రెజరర్ గుంటుపల్లి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని తక్షణమే తొలగించాలి

గుంటూరు(తూర్పు), జూలై 22(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరులోని శ్రామిక నగర్, యన్నం వారి వీధి, చెన్నం వారి వీధి, బాలాజీ నగర్ ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు లక్కా అరుణ డిమాండ్ చేశారు. శ్రామిక నగర్ ఇతర ప్రాంతాల్లో మంగళవారం సీపీఎం నాయకులు పర్యటించారు. ఆమె మట్లాడుతూ పలు ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని, దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించి, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

సంజీవయ్యనగర్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజీవయ్యనగర్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంజీవయ్య నగర్‌కి చెందిన అఖిల్ వర్షపు నీటిలో బండి వేగంగా నడుపగా ఆ నీరు రవి అనే యువకుడి మీద పడ్డాయి. దాని గురించి ప్రశ్నించగా ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు కర్రలు, రాడ్లతో కొట్టుకొన్నట్లు ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులు తెలిపారు.

కడకు కన్నీరెంది


కొండవాగు వరదతో చెరువులను తలపిస్తున్న జాలాది పంట పొలాలు

యడ్లపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): తొలకరి.. సాగుకు ముందే ముఖం చాటేశా యి. దీంతో తొలి విడత నాటిన విత్తనాలు మొలకెత్తకుండానే బొగిలిపోయాయి. జూలై సగం గడిచినా వర్షాలు లేక డీలాపడిన రైతులు.. వాతావరణశాఖ చల్లని కబురుతో మరోసారి పొడిన దుక్కిలో విత్తనాలు వేసుకున్నారు. శుక్రవారం 28.8 మి.మీలు, ఆది వారం 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో విత్తనం మొలక వస్తుందని ఆశించిన రైతుల ఆశలను సోమవారం కురిసిన 33 మి.మీల కుండపోత అడియాసలు చేసింది.


లింగారావుపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కవాగు (తూర్పువాగు)

ఉధృతంగా ప్రవాహం

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నక్కవాగుతో పాటు ఉప్పు వాగు కూడా వరద నీటితో నిండుగా ప్రవహిస్తు న్నాయి. లింగారావుపాలెం పడమర వాగు పొంగడంతో వరద నీరు సొలస, చిరుమామిళ్ల రోడ్డుపై నుంచి ప్రవహించాయి. వరద నీరు గ్రామంలోకి వస్తుందేమోనని గ్రామస్తులు పొద్దు పోయే వరకు జాగారం చేశారు. వరుణుడు శాంతించడంతో ఉధృతి తగ్గుముఖం పట్టి.. గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కొండ వరదతో మునకేసిన పొలాలు

ఎగువన కురిసిన వర్షాలకు తోడు కొండల పైనుంచి వచ్చిన ప్రవాహం తోడై లోతట్టు గ్రామాలైన జాలాది, తుర్లపాడు, గణేశు నివారిపాలెం గ్రామాల పరిధిలోని పంట పొలాలు మునకేశాయి. దీంతో ఆయా గ్రామాల్లోని పొలాలకు గండ్లు పడడంతోపాటు, అప్పటికే వివిధ రకాల విత్తుకున్న విత్తనాలు మొలకెత్తకుండా పోయాయి. ఎటు చూసినా కనుచూపు మేరలో నీరే కనిపించడంతో రైతులకు కన్నీరే మిగిలింది.


యడ్లపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పువాగు


గాజుల్లంక-శ్రీకాకుళం తాత్కాలిక మార్గం తూముల కింద నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

వరద ఉధృతి పెరిగితే మార్గం మాయం!

కొల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో వరద నీరు ప్రవహి స్తోంది. ఇటీవల ప్రకాశం బ్యారేజీ ఎగువన కురిసిన వర్షాలతో బ్యారేజీ నీ టి మట్టం 12 అడుగులు దాటడంతో దిగువకు మంగళవారం 10 వేల క్యూ సెక్కుల వరద నీటిని విడుదల చేశారు. దీంతో కొల్లూరు మండలం సుగ్గునలం క, గాజుల్లంక గ్రామాల వద్దకు కృష్ణా నదిలో వరద నీరు సాయంత్రానికి చేరింది. గాజుల్లంక నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు నదిలో తాత్కాలికంగా ఏర్పా టు చేసిన గాలు మార్గం కింద తూముల నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. 20 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తే ఈ తాత్కాలిక గాలు మార్గం వరద నీ టి ఉధృతికి కొట్టుకుపోయే ఆస్కారం ఉంది. గత ఆరేడు నెలలుగా తాత్కాలిక మార్గం నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వరద నీటితో మార్గం కొట్టుకుపోతే ద్విచక్ర వాహనదారులు పడవలను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు లారీలు, నాలుగు చ క్రాల వాహనాలు కూడా గాలు మార్గం ద్వారా కృష్ణా, బాపట్ల జిల్లాలకు రాకపోకలు సాగించా యి. మార్గం తెగిపోతే ఆయా వాహనాలు పెనుమూడి వారధి మీదుగా శ్రీకాకుళం, పామర్రు, గు డివాడ, మచిలీపట్నం ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో దూరాభారం పెరుగుతుంది.

ఉప సంఘంలో..మంత్రులు అనగాని, నాదెండ్ల

జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పులకు క్యాబినెట్ సబ్ కమిటీ

త్వరలో జిల్లాల్లో పర్యటించే అవకాశం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాం లో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల పునిర్వభజనను సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం నియమించిన మంత్రుల బృందంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్యాబినెట్ సబ్ కమిటీలో కీలక పాత్ర పోషిం చనున్నారు. కమిటీలో మొత్తం ఏడుగురు ఉండగా జిల్లా నుంచి ఇద్దరు ఉండటం విశేషం. ముఖ్యంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అసంబద్ధంగా రెవెన్యూ డివిజన్ల విభజన, కొత్తవి ఏర్పాటు జరి గాయి. గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న కొన్ని మండ లాలను తీసుకెళ్లి తెనాలిలో కలిపారు. దీనిపై ఆయా మండలాల ప్రజలు అభ్యంతరాలు చెబుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గం ప్రాతిపదికగా చేసుకొని జిల్లాల విభజన చేయడం సరికాదని అప్పట్లోనే ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గతంలో ఇలా..

గత ప్రభుత్వం 2022 ఏప్రిల్ నెల మొదటి వారంలో జిల్లాల పునిర్వభజన చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా కొత్త గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజితమైంది. గుంటూరు జిల్లాని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన గుంటూరు తూర్పు, పశ్చిమ, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడుకు పరిమితం చేశారు. పల్నాడు జిల్లాని పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట, గురజాలతో ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లాని బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరా ల, పర్చూరు, సంతనూతలపాడు, అద్దంకితో కలిపి ఏర్పరిచారు. జిల్లాల విభజన కోసం రేపల్లె, సత్తెనపల్లిలో కొత్త డివిజన్‌లు నెలకొల్పారు. అయితే కొన్ని మండలాలు ఏర్పాటు చేసిన డివిజన్ హెడ్ క్వార్టర్స్‌కు దూరంగా ఉన్నాయి. మరోవైపు ఇతర డివిజ న్లకు దగ్గరగా ఉండటంతో ప్రజలు అసంతృప్తికి గురవున్నారు. అలానే ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న మండలాలు కొన్ని ఒక డివిజన్‌లో మరికొన్ని వేరే డివిజన్‌లో ఉండటంతో ప్రజాప్రతి నిధులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బాపట్ల జిల్లా ఏర్పాటు విషయంలో అక్కడి ప్రజాప్రతినిధులు అనేక అభ్యంత రాలను అప్పట్లో లేవనెత్తారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం అవేమి పట్టించుకోకుండా ముందుకు సాగింది.

అమరావతి జిల్లా ఏర్పాటుకు డిమాండ్

అమరావతి రాజధాని ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఉంది. అయితే ఇది గుంటూరు హెడ్ క్వార్టర్స్‌కు 35 కిలోమీటర్ల దూరం లో ఉండటంతో పరిపాలన పరంగా కొన్ని సమస్యలు తలెత్తుతు న్నాయి. ముఖ్యంగా సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల రాకపోకలు రాజధానిలో ఎక్కువగా ఉంటున్నాయి. రాష్ట్రస్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు పా ల్గొనే సమావేశాలకు గుంటూరు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రొటోకాల్ పాటించాల్సి వస్తోంది. అలానే సభలు, సమావేశాల ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు చూసుకోవాలి. దీంతో ఇక్కడ పరిపాలనలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. వీటన్నింటిపై మంత్రుల బృందం ఏ మేరకు చర్యలు తీసుకొంటుందో చూడాలి.

కందుల డబ్బులు ఎప్పుడు పడతాయబ్బా..!

జిల్లా వ్యాప్తంగా పడుతున్న వర్షాలు

ఖరీఫ్ సాగు ఖర్చులకు రైతుల ఎదురుచూపులు

పిడుగురాళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కంది డబ్బులు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆరుగాలం పంట దిగుబడి కోసం కష్టపడిన అన్నదాతలు.. ఇప్పుడు విక్రయించిన పంట నగదు కోసం దిగులు పెట్టు కున్నారు. గురజాల నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్, రబీలో కంది పంటను సుమారు 25 వేల ఎకరాలలో సాగు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్వింటాకు సుమారు రూ.7,500కు కొనుగోలు చేశారు. నెల తర్వాత జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌ను మించిపోవడంతో నెలపాటు కొను గోళ్లను నిలిపివేశారు. అప్పటికే రైతుల ఇళ్లకు గోనె సంచులు చేరడం, మరికొంత మందికి సంబంధించి కందులను తూకం వేయడంతో ఆం దోళన వ్యక్తమైంది. మార్క్‌ఫెడ్ అధికారుల సూచనలతో రాష్ట్ర, కేంద్ర స్థాయి అధికారులు స్పందించి తిరిగి కొనుగోలు సామర్థ్యాన్ని పెంచారు. గత నెలలోనే మార్క్‌ఫెడ్ అధికారులు కందుల నిల్వలను కొనుగోలు చే శారు. గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 150 మంది రైతు ల ఖాతాలకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షలు పైగా నగదు జమ కావాల్సి ఉంది.

నగదు జమ అయితే...

ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. రైతులు వివిధ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు పెట్టుబడి ఖర్చులకు బయటి వ్యక్తులు, బ్యాంక్‌లను ఆశ్రయించకుండా ఉండాలంటే.. కొనుగోలు చేసిన కందులకు వెంటనే నగదు జమ కావాలి. మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి కంది నగదును వెంటనే రైతుల ఖాతాలకే జమ అయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.


రైతుల వద్ద కొనుగోలు చేసిన కందుల బస్తాలు

ఇప్పుడు ఎంతో అవసరం : కుర్రా కోటయ్య, రైతు



ప్రస్తుతం పంట సాగుకు చేతిలో డబ్బు ఎంతో అవసరం. కందులు విక్రయించినా నగదు జమ కాకపోవడంతో కాస్త ఆందోళనగా ఉంది. బయట వ్యక్తులను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడేటట్లు ఉంది. ఇప్పుడు నగదు అందిస్తే అవసరానికి ఉపయోగపడతాయి.

మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించాలి : ఆంజనేయులు, రైతు



కొనుగోలు చేసిన కందులకు నగదును వెంటనే జమచేసే విధంగా మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించాలి. అధికారులను అడిగితే నగదు, బ్యాంక్ వివరాలను ప్రభుత్వానికి, బ్యాంక్‌లకు పంపించామని, త్వరలోనే నగదు జమ అవుతాయని చెబుతున్నారు.

సెప్టెంబరు 29 నుంచి.. శబరి ప్రయాణ సమయం మార్పు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌ని సూపర్ ఫాస్టుగా మారుస్తూ రైల్వేబోర్డు ఇటీవల నిర్ణయం తీసుకొన్న దృష్ట్యా సెప్టెంబరు 29 నుంచి ఈ రైలు ప్రయాణ సమయం మారిపోనుంది. 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ 20630 నంబరుగా మారుతుంది. ఈ రైలు తిరువనంతపురంలో సాయంత్రం 6.45కి బయలుదేరి తిరుపతికి రాత్రి 11.15కి, చీరాలకు వేకువజామున 4.08, బాపట్లకు 4.23, నిడుబ్రోలుకు 4.58, తెనాలికి 5.28, గుంటూరుకు ఉదయం 6.20, సత్తెనపల్లికి 7.09, పిడుగురాళ్లకు 7.34, నడికుడికి 7.54, చర్లపల్లికి 10.29, సికింద్రాబాద్‌కు 11 గంటలకు చేరుకొంటుంది. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ 20629గా మారు తుంది. ఈ రైలు నిత్యం మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 5.19కి నడికుడి, 5.39కి పిడుగురాళ్ల, 6.14కి సత్తెనపల్లి, రాత్రి 6.50కి గుంటూరు, 7.48కి తెనాలి, 8.03కి నిడుబ్రోలు, 8.23కి బాపట్ల, 8.38కి చీరాల, అర్ధరాత్రి దాటాక 1.33కి తిరుపతి, మరునటి రోజు సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

సేవ, నిజాయితీగా విధులు నిర్వహించాలి

● ప్రొబేషనరి ఎస్‌ఐలకు రేంజ్ ఐజీ త్రిపాఠి సూచన


ప్రొబేషనరి ఎస్‌ఐలకు దిశా నిర్దేశం చేస్తున్న ఐజీ సర్వ శ్రేష్టత్రిపాఠి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, నిజాయితీ, అంకితభావం, సేవా తత్పరతలతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరి ఎస్‌ఐలకు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 53 మంది ప్రొబేషనరి ఎస్‌ఐలు మంగళవారం మర్యాదపూ ర్వకంగా రేంజ్ కార్యాలయంలో ఐజీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేం దుకు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండా లన్నారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. గుంటూరు జిల్లా నుంచి 23 మంది, పల్నాడు నుంచి 13, బాపట్ల నుంచి 10, ప్రకాశం నుంచి ఒకరు, నెల్లూరు, తిరుపతి నుంచి ముగ్గురు చొప్పున శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొం డలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

453.32 కేజీల గంజాయి ధ్వంసం

● గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పట్టివేత


పట్టుబడిన గంజాయితో ఎక్సైజ్ శాఖ అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో పలు కేసుల్లో దొరికిన 453.32 కేజీల గంజాయిని యడ్లపాడు మండలం నాయుడుపేట డంపింగ్ యార్డ్ వద్ద ధ్వంసం చేసినట్లు మంగళవారం గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఉన్నతాధికారుల సమక్షంలో గంజాయిని పూర్తిగా తగలబెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు కుమార్ రెడ్డి, దయాసాగర్, సుధాకర్ రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం, అరుణ కుమారి, మణికంఠ పాల్గొన్నారు.

అమరావతి రైలు మార్గానికి.. భూములిస్తాం!

● నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పాలి ● భూ సమీకరణ అయితే ఎక్కడ ప్లాట్లు ఇస్తారు ● కొప్పురావూరులోని కొంతమంది రైతులు జేసీకి నివేదన

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజ ధానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రైలు మార్గానికి అవసరమైన భూములు ఇచ్చేందుకు సిద్ధమని పెదకాకాని మండలంలోని కొప్పురావూరుకు చెందిన రైతులు పేర్కొన్నారు. అయితే ముందు తమకు ఎంత నష్టపరిహారం ఇస్తారో స్పష్టం చేయాలని కోరారు. అలానే ఒక వేళ భూ సమీకరణ పథకం కింద భూములు తీసుకొనేట్లు అయితే తమకు రిటర్న బుల్ ప్లాట్స్ ఎక్కడ, ఎప్పటిలోపు ఇస్తారో కూడా చెప్పాల న్నారు. భూ సేకరణ కాంపిటెంట్ అథారిటీ అయిన జాయింట్ కలెక్టర్ జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు రైతులు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌కు వచ్చి జేసీని కలిసి చర్చించారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లా డారు. తమకున్న అనుమానాలను వ్యక్తపరుస్తూ వాటిని నివృత్తి చేయాలన్నారు.

'తాడికొండ మండలంలోని కంతేరుని ఆనుకొనే కొప్పురా వూరు ఉంది. ఈ గ్రామం భూసేకరణ ప్రాజెక్టులతో పూర్తిగా నిర్వీర్యమైపోతుంది. ఇప్పటికే ఒక రైలుమార్గం ఉంది. ఇప్పుడు మరొక రైలు మార్గం వేస్తామంటున్నారు. అలానే ఆ రెండు మార్గాలను కలుపుతూ మరో లైను వేస్తామంటున్నారు. ఇంకో వైపు బైపాసు, ఓఎన్‌జీసీ పైపులైను వేస్తామంటున్నారు. వీటి వల్ల మేము బలవుతున్నాం. మేము జేసీని కలిశాం, అయితే మాకు ఏమి చేస్తారో చెప్పడం లేదు. మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. రైల్వేలైను, గ్యాస్ లైనుకు సపోర్టు చేస్తాం. మమ్మల్ని తీవ్ర గందరగోళంలో పడేసి పెగ్ మార్కింగ్ వేస్తాం.. అప్పుడు చూద్దామంటున్నారు. ఇది ఎంతవరకు సమంజసం' అని రైతులు ప్రశ్నించారు.

అమరావతి రాజధాని కోసం తెలంగాణలోని ఎర్రుబాలెం నుంచి కృష్ణానది, రాజధాని గ్రామాల మీదగా నంబూరు వరకు ఒక రైలుమార్గాన్ని కేంద్రం మంజూరు చేసింది. దీనికి సంబంధించి గుంటూరు జిల్లా వరకు భూసేకరణ అధికారిగా జేసీని నియమించింది. గత ఏడాదే భూసేకరణ నోటిఫికేష న్లను జారీ చేసి రైతుల నుంచి అభ్యంతరాలను తెలపాల్సిం దిగా కోరారు. కొప్పురావూరు రైతులు ఇప్పటికే ఒకటి, రెండు దఫాలు తమ ఆవేదనని కలెక్టర్‌కు నివే దించారు. తాజాగా మంగళవారం జేసీ ఎదుట హాజరు కావాలని వచ్చిన నోటీసులకు సమాధా నంగా రైతులు వచ్చి జేసీని కలిసి తమ అభ్యంతరాలను తెలిపారు.


కలెక్టరేట్‌లో జేసీకి తమ అభ్యంతరాలను తెలిపి బయటకు వస్తున్న కొప్పురావూరు రైతులు

ఆరోగ్యానికి సప్తవర్ణాల సూత్రం!

●సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏడు రంగుల దుప్పట్లు ●వార్డుల్లో పడకలు మరింత శుభ్రంగా


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని మంచాల పై బెడ్ షీట్లు పరుస్తున్న దృశ్యం

సత్తెనపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు వైద్యంతో పాటు.. పారిశుభ్ర వాతావరణం చాలా అవసరం. ఇందుకు కూటమి ప్రభుత్వం సప్తవర్ణాల సూత్రం అమలుకు నిర్ణయం తీసు కుంది. దీంతో ఆస్పతుల్లోని వార్డుల్లో పడకలపై రోజుకొక రంగుతో.. వారం రోజులూ ఏడు రంగుల దుప్పట్లు మార్చ నున్నారు. రోగులు, ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా ఇంద్రధనస్సు తరహాలో సప్త వర్ణాల దుప్పట్లు వేసేందుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పడకల సంఖ్య ఆధారంగా రంగు రంగుల దుప్పట్లు ఇవ్వనున్నారు. ఆదివారం నుంచి శనివారం వరకు ఒక్కో రోజు ఒక్కో రంగు దుప్పటి వేయనున్నారు. 30, 50, వంద పడకల ఆస్పత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉంటాయి. వీటిలో సంస్కరణలు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వార్డుల్లో పడకలు మరింత పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశాలిచ్చింది.

బాలింతలకు మేలు..

వైద్యశాలకు వచ్చే గర్భిణులు సాధారణ ప్రసవాలు ఐతే మూడు రోజులు, సీజేరియన్ జరిగితే తొమ్మిది రోజులు ఆస్పత్రిలో ఉంటారు. ఇంకా వివిధ రకాల జబ్బులతో ఆస్పత్రికి వచ్చే రోగులు రోగాన్ని బట్టి వారం రోజుల వరకు ఆస్పత్రుల్లోనే ఉంటారు. ప్రస్తుతం వినియోగిస్తున్న తెలుపు రంగు దుప్పట్ల స్థానంలో వారంలో ఏడు రోజులు ఏడు రంగుల దుప్పట్లను ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో మంచాలకు వాడుతున్నవన్నీ తెలుగు రంగు దుప్పట్లు, పునర్వినియోగం లేని నీలి రంగు బెడ్ షీట్లు మాత్రమే. వైరల్ ఇన్‌ఫెక్షన్, ఇతర అత్యవసర పరిస్థితిని బట్టి డిస్పోజల్ బెడ్ షీట్లు వాడుతుంటారు. తెలుపు దుప్పట్లపై రక్త, ఇతర మరకలు ఉంటే ఉతికినవి అయినా. మళ్లీ వాడేందుకు ఇబ్బందికరంగా ఉంటాయి. ఈ క్రమంలో సదరు రోగులు ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చి వేసుకుం టున్నారు మరికొందరు బాగున్నవి వేయాలంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

సముచిత నిర్ణయం



ఆస్పత్రికి వచ్చే రోగులు ఇక్కడి వాతావరణం ఎంత బాగుంటే అంత త్వరగా కోలుకుంటారని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఇన్‌చార్జ్ ఆర్ఎంవో డాక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రోగులకు మేలు జరుగుతుందన్నారు. ఏ రోజు ఏ రంగు వాడలో ముందే నిర్ణయించడం సముచితమన్నారు.

-డాక్టర్ కృష్ణమూర్తి, ఇన్‌చార్జ్ ఆర్ఎంవో, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల





ఎప్పటికప్పుడు సరికొత్త చీరలు పుట్టుకొస్తూనే ఉంటాయి. మహిళల మనసులను దోచుకుంటూనే ఉంటాయి. అలాంటివే 'కాంత' చీరలు. దారపు కుట్టుతో కనికట్టు చేస్తున్న ఈ చీరల మీద ఓ లుక్కేద్దాం!

కనికట్టు చేసే కాంత

కాంత అనే బెంగాలీ పదానికి... 'పాత వస్త్రం' అని అర్థం. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లోని మహిళలు కొన్ని వందల ఏళ్లుగా వాడేసిన పాత చీరలతో కాంత క్విల్ట్‌లు, పరుపు, దిండ్ల కవర్లు, అలంకరణ వస్త్రాలు తయారుచేస్తున్నారు. ఈ ఎంబ్రాయిడరీల్లో సరళమైన పూల మోటిఫ్స్ మొదలు అతి పెద్ద సన్నివేశాల వరకూ ఉంటాయి. అయితే వెనకున్న వస్త్రపు రంగుతో సరిపోలేలా, క్విల్టింగ్ తరహా కుట్టు వేయడం ఈ కాంత పనితనం ప్రత్యేకత. ఇదే పనితనంతో తయారవుతున్న కాంత చీరలు ప్రస్తుతం ట్రెండ్‌గా మారాయి. వాటినెలా సింగారించాలో తెలుసుకుందాం!

- కాటన్, సిల్క్, మస్లిన్ వస్త్రాల కాంత చీరలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సిల్క్, మస్లిన్ కాంత చీరలు వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. కాటన్ కాంత చీరలు డైలీవేర్‌గా బాగుంటాయి.
- ఈ చీరలు ఒకింత చికన్‌కారీ పనితనాన్ని తలపించేలా ఉంటాయి. కానీ కాంతలో జానపద కథలు, రోజువారీ జీవనవిధానాలు ఎంబ్రాయిడరీ రూపంలో ఆకట్టుకుంటూ ఉంటే, చికన్‌కారీలో కేవలం పువ్వులు, లతలే మనకు కనిపిస్తాయి. కాబట్టి రొటీన్‌కు భిన్నంగా కనిపించాలనుకుంటే కాంత చీరలే ఎంచుకోవాలి.
- టెర్రకోట ఆభరణాలు, జర్మన్ సిల్వర్ ఆభరణాలు కాంత చీరలకు ఎంతో బాగా సూటవుతాయి.

వినూత్నం

సంప్రదాయ వంటలతో ఆరోగ్యం

ఆహారంలోనే ఆరోగ్యం దాగి ఉంటుంది. కానీ ఎలాంటి ఆహారం తినాలో, ఎలా వండుకుని తినాలో, ఏ పాత్రల్లో వండుకుని తినాలో ఎంతమందికి తెలుసు? కాలక్రమేణా సంప్రదాయ వంటలు కనుమరుగైపోతున్న క్రమంలో, స్వాదిష్టం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా, తెలుగు వంటకాల పట్ల ఆరోగ్యాన్నీ, అవగాహననూ పెంచే ప్రయత్నం చేస్తున్నారు శ్రీకాకుళానికి చెందిన సౌజన్య నర్సీపురం. ఆ స్వాదిష్టమైన వంటల ప్రయాణం ఆమె మాటల్లోనే...



చిన్నప్పటి నుంచి అమ్మ చేస్తే తిని పెట్టడమే తప్ప స్వయంగా వండింది లేదు. కానీ బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగరీత్యా చెన్నైలో ఉండవలసివచ్చినప్పుడు, అమ్మ చేతి వంట విలువ తెలిసొచ్చింది. స్వయంగా వండుకోవాలనే ఆలోచనకు అది నాందిగా మారింది. ఆ క్రమంలో వంటకాల పట్ల ఆసక్తి కూడా పెరిగింది. స్వతహాగా పుస్తకాలు చదివే అలవాటు ఉండడంతో వంటల పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను. అలా డాక్టర్ జి.వి. పూర్ణ చందు గారి పుస్తకాలు చదివి, వంటకాల పట్ల మరింత అవగాహన, ఆసక్తి పెంచుకున్నాను. రెండు వందల ఏళ్ల నాటి వంటకాలకూ నేటి వంటకాలకూ ఏమాత్రం పొంతన లేదనే విషయం ఆయన పుస్తకాలు చదివిన తర్వాత అర్థమైంది. మన వంటకాల్లో ఇంతటి మార్పు ఎందుకొచ్చింది? మనం మన సంప్రదాయ వంటకాలకు ఎందుకు దూరమవుతున్నాం?
ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో సంప్రదాయ తెలుగు వంటకాలు మరుగున పడిపోయే ప్రమాదం ఉంది కదా?... ఇలా నాలో ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. అలా వంటకాల పట్ల నా పరిశోధన మొదలుపెట్టాను.

లోతైన అవగాహన ఏర్పరుచుకుని...

ఎన్నో పుస్తకాలు చదివాను. ఎంతోమందిని విచారించాను. పెద్దలను సంప్రతించాను. తెలియని వంటకాల గురించి వీలున్న ప్రతి మార్గంలో ఆరా తీయడం మొదలుపెట్టాను. కూరగాయల సంతకు వెళ్లినప్పుడు ఏదైనా కొత్త కూరగాయ కనిపిస్తే, దాన్నెలా వండాలో అమ్మేవాళ్లను అడిగేదాన్ని. వాళ్లు చెప్పిన ఆ కొత్త వంటకాన్ని గుర్తుపెట్టుకుని ఇంట్లో వండే ప్రయత్నం చేసేదాన్ని.
అయితే ఇలా వండే వంటకాలన్నిటినీ భద్రపరుచుకోవాలనే ఆలోచనతో 2020లో స్వాదిష్టం అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను మొదలుపెట్టాను. నిజానికి ఇది నా కోసం నేను సృష్టించుకున్న వేదిక. దీని ద్వారా ఎంతో మంది సంప్రదాయ వంటకాల పట్ల అవగాహనను పెంచుకోవడం నాకెంతో సంతృప్తిని కలిగిస్తోంది. వంట వండే విధానంతో పాటు, ఆ వంటకం వెనకున్న కథ, దాన్లోని పోషకాలు, పాత్రల గురించి వివరిస్తూ ఉండడంతో, క్రమేపీ అభిమానులు పెరిగారు. నాలా ఆలోచించే వాళ్లను కలిసిన ప్రతిసారీ ఈ రంగంలో నేను చేయవలసిన కృషి ఇంకా ఎంతో ఉందని అనిపిస్తూ ఉంటుంది. ఈ దిశగా నేనొక అడుగు ముందుకు వేశాననే చెప్పాలి. ఇటీవలే ఓనమాలు అనే ఇనీషియేటివ్‌లో భాగం పంచుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో మరుగున పడిన సంస్కృతులు, సంప్రదాయ వంటకాలను తిరిగి వాడుకలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్న సంస్థ అది.
ఈ సంస్థ తరపున ఉత్తరాంధ్రలో నేనొక కుకింగ్ షోను ప్రదర్శించాను.

ప్రస్తుతం భోగాపురంలో ఉంటున్నాను. అమ్మ సూర్యకుమారి, గృహిణి. నాన్న వెంకట రమణ మూర్తి, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్‌గా పని చేశారు. మా వారు లీలా వినయ్ ఇటీవలే విజయనగరంలో సహజ వ్యవసాయంలోకి అడుగు పెట్టారు. ప్రస్తుతానికి నాలుగు రకాల దేశీ బియ్యంతో పాటు స్థానిక కూరగాయలన్నీ పండిస్తున్నారు. మాకు గిర్, పుంగనూరు మొదలైన దేశీయ ఆవులు కూడా ఉన్నాయి.

పాత్రలు కూడా ప్రధానమే!

పోషక అవసరతల ఆధారంగానే వంటకాలు రూపొందుతూ ఉంటాయి. పాత్రల పట్ల అవగాహన లేక, తోచిన పాత్రల్లో వండేసుకుంటున్నాం. ఇనుప పాత్రలో వండుకుంటే రక్తహీనత తొలగిపోయే మాట వాస్తవమే! కానీ చింతపండు లాంటి పుల్లని పదార్థాలు ఇనుప పాత్రల్లో వండుకోవడం వల్ల అవసరానికి మించిన ఇనుము శరీరంలోకి చేరుకుంటుందని ఎంతమందికి తెలుసు? కాబట్టి ఏ పాత్రలో, ఏ పదార్థాలు వండుకోవాలో అందరూ తెలుసుకోవాలి. దద్దోజనం ఆరోగ్యకరమైన ఆహారమే, కానీ సైనసైటిస్ ఉన్నవారు ఈ ఆహారం తినకూడదు. ఇలాంటి విషయాల పట్ల మరింత అవగాహన పెరిగేలా, పురాతన గ్రంథాలు చదవడం కోసం సంస్కృతం కూడా నేర్చుకున్నాను. మన సంప్రదాయ వంటకాల గురించి ఎంత నేర్చుకున్నా నేర్చుకోవలసింది ఇంకా ఉంటూనే ఉంటుంది. తెలుగింటి వంటల పట్ల ఆసక్తినీ, మక్కువనూ పెంచుతూ అందర్నీ ఆరోగ్యం వైపు నడిపించాలన్నదే నా లక్ష్యం. త్వరలో సంప్రదాయ వంటకాలతో ఒక ఈటరీ మొదలుపెట్టి ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు జీవనవిధానానికి కూడా ప్రచారం కల్పించాలనే ఆలోచన ఉంది.



'ఉప్పిండి' అనే వంటకం నుంచే ఉప్మా అన్న పదం పుట్టింది. ఉప్మా వండడానికి పది నిమిషాలు పట్టొచ్చు. కానీ ఉప్పిండిని ఐదు నిమిషాల్లో వండుకోవచ్చు. పెసరపప్పు, బియ్యం నూక, పోపుతో చిటికెలో తయారైపోయే ఇలాంటి వంటకాలు ఆరోగ్యకరం, సులభతరం. అన్నం, పెసరపప్పుతో తయారు చేసే పులగం కూడా ఇలాంటిదే! వంట కోసం హైరానా పడిపోవలసిన అవసరం లేదు. అనవసరపు మసాలాలు, పొడులు జోడించి దాని నామరూపాలు మార్చేయవలసిన అవసరం అంతకన్నా లేదు. ఇలాంటి సులభతరమైన వంటకాలను ఎంచుకుంటే సమయం ఆదా అవుతుంది. ఆరోగ్యం కూడా నిక్షేపంగా ఉంటుంది.

- గోగుమళ్ల కవిత

వర్షాకాలంలో మొక్కలు పదిలంగా...

మనం ఇంటి చుట్టూ, బాల్కనీలో, మేడపైన రకరకాల మొక్కలు పెంచుకుంటూ ఉంటాం. పెద్ద పెద్ద చినుకులు పడినా, గాలి బలంగా వీచినా ఈ మొక్కలకు నష్టం కలుగవచ్చు. కాబట్టి వర్షాకాలంలో మొక్కల సంరక్షణకు సంబంధించి తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- నిరంతరం కురిసే వర్షాల వల్ల ఒక్కోసారి కాండం, ఆకులు, పువ్వులు కుళ్లిపోవడాన్ని చూస్తూ ఉంటాం. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. లేదంటే క్రిమికీటకాలు చేరి మొక్కను బలహీనపరుస్తాయి.
- గాలి బలంగా వీస్తే మొక్కలు, వాటి కొమ్మలు వంగిపోతుంటాయి. అలాకాకుండా మొక్కలకు సమీపంలో పొడవైన కర్ర లేదా చెక్కను ఆధారంగా నిలబెట్టాలి. సన్నని దారంతో దానికి మొక్కను జతచేయాలి.
- వర్షాకాలంలో తరచూ మొక్కలకు నీళ్లు పోయాల్సిన అవసరం ఉండదు. కుండీల్లో అయితే నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కుండీ అడుగున ఉండే రంధ్రం మూసుకుపోకుండా చూడాలి.
- ఇంటి చుట్టూ, మేడ మీద తోట పెంచుతున్నట్లయితే మొక్కల మొదళ్లలో నీరు నిలవకుండా చూసుకోవాలి. వర్షపు నీరు ఎక్కడా ఆగకుండా ప్రవహించేలా ఏర్పాటు చేసుకోవాలి.
- వర్షాలు కురవగానే మొక్కలకు చిగుర్లు వస్తుంటాయి. ఈ సమయంలో పండ్లు, కాయగూరల నుంచి వచ్చే వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు తయారు చేసి మొక్కలకు అందించాలి. వాడేసిన కాఫీ, టీ పొడులను ఒకసారి మంచినీళ్లతో కడిగి మట్టిలో కలపవచ్చు. ఇలా చేయడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది.
- ఆగకుండా కురిసే వర్షాల వల్ల మొక్కల మొదట్లో మట్టి పక్కకు జరుగుతుంది. దీంతో మొక్కల వేళ్లు బయటికి వచ్చేస్తుంటాయి. అలాంటప్పుడు వర్షం తగ్గగానే వేళ్లమీదికి మట్టిని జరపాలి. అలాగే తేలికపాటి ఎరువులను కూడా అందించాలి.
- ఆకుకూరలు, పూలమొక్కలు ఎక్కువగా వర్షానికి ప్రభావితమవుతాయి. ఇంటి చుట్టూ లేదా మిద్దె తోటలో ఈ మొక్కలు ఎక్కువగా ఉన్నట్లయితే వాటిమీద వర్షం పడకుండా నెట్‌షీట్‌తో కూడిన రెయిన్ కవర్‌ను ఏర్పాటు చేయాలి. వర్షం తగ్గగానే రెయిన్ కవర్ తొలగిస్తే నెట్ షీట్ ద్వారా మొక్కలకు సూర్యరశ్మి అందుతుంది.



గాజుతో అందంగా...

ఇల్లు అందంగా కనిపించాలని గాజుతో తయారుచేసిన రకరకాల అలంకరణ వస్తువులు తెచ్చి పెట్టుకుంటూ ఉంటాం. అలాగే ఇంటిని అలంకరించడానికి సౌకర్యవంతంగా మార్చడానికి కూడా గాజును వినియోగించవచ్చంటున్నారు నిపుణులు.

- గాజుతో రూపొందించిన టీపాయ్, డైనింగ్ టేబుల్, ల్యాప్‌టాప్ టేబుల్ లాంటివి ఇంటికి అదనపు అందాన్నిస్తాయి. పారదర్శకంగా ఉండే గాజు కాకుండా రకరకాల రంగుల్లో లభ్యమయ్యే టఫెండ్ గ్లాస్‌తో తయారుచేసినవాటిని ఎంపిక చేసుకుంటే ఇంటికి రిచ్ లుక్ వస్తుంది. పూలు, రకరకాల బొమ్మలు ప్రింట్ చేసి ఉన్న గాజు మెటీరియల్స్ కూడా లభ్యమవుతున్నాయి. వీటిని తెచ్చి టేబుల్ లేదా టీపాయ్ ఉపరితలం మీద అమర్చుకుంటే ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- ఇంట్లో పెద్దగా ఉన్న హాల్‌ని అందంగా విభజించడం అనేది నేటి ఇంటీరియర్ ట్రెండ్. చెక్కతో తయారుచేసిన హాల్ డివైడర్స్‌ని మనం చూసే ఉంటాం. దీనికి బదులు గాజు పార్టిషన్స్‌ను ఎంపిక చేసుకుంటే ఇల్లు ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చుట్టూరా చెక్క ఫ్రేమ్ ఉన్నప్పటికీ మధ్యలో గాజు మెటీరియల్‌ను అమర్చుకుంటే ప్రత్యేకంగా ఉంటుంది. ప్రింటెడ్, స్టెయిన్డ్, ఫ్రోస్టెడ్ గాజు రకాలు ఈ తరహా పార్టిషన్స్‌కు బాగుంటాయి.
- వంటగది, పడక గది, పిల్లలు చదువుకునే గదుల్లో కొన్ని అరలకు గాజు తలుపులు బిగించుకుంటే సౌకర్యవంతంగా ఉంటుంది. అంతేకాదు ఆ అరల్లో అలంకరణ వస్తువులు, బొమ్మలు, ఫొటోలు లాంటివి సర్దుకుంటే అవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. గదులు కూడా విశాలంగా మెరుస్తుంటాయి.
- కిటికీలకు ఫ్రోస్టెడ్ గాజు తలుపులు అమర్చుకోవచ్చు. వీటి మీద రకరకాల డిజైన్లు ప్రింట్ చేసి ఉంటాయి. వీటివల్ల ఇంట్లోని వస్తువులు బయటికి కనిపించవు. ఇల్లు కూడా అహ్లాదకరంగా ఉంటుంది.
- సాధారణంగా మనం ఫాల్స్ సీలింగ్ కోసం చెక్క, పీఓసీ, జిప్సం లాంటి మెటీరియల్స్ వాడుతూ ఉంటాం. వీటికి బదులు గాజు సీలింగ్‌ని వినియోగిస్తే ఇల్లు గ్రాండ్‌గా కనిపిస్తుంది. పూర్తిగా కాకపోయినా ఒక లేయర్‌ను ఇలా ప్రింటెడ్ గాజుతో అమరిస్తే బాగుంటుంది. మధ్యమధ్యలో అందమైన లైటింగ్స్ పెట్టించుకుంటే ఇంటికి రిచ్ లుక్ వస్తుంది.



దివ్యాంశి భౌమిక్... టేబుల్ టెన్నిస్ రాకెట్ పడితే ప్రత్యర్థి ఎవరైనా దూకుడుగా పోరాడడం ఆమె నైజం. ఇటీవల తాష్కెంట్‌లో జరిగిన 'ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్- సింగిల్స్'లో సంచలన విజయాలు నమోదు చేసింది. అంతేకాదు... ముప్ఫై ఆరేళ్ల తరువాత ఆ పోటీల్లో టైటిల్ నెగ్గిన భారతీయురాలిగా నిలిచింది. అండర్-15 వరల్డ్-3 ర్యాంక్‌లో ఉన్న ఈ అమ్మాయి ఒలింపిక్స్ స్వర్ణమే తన లక్ష్యం అంటోంది.



రాకెట్ పడితే పతకాల పంట!

"ప్రతి మ్యాచ్ ఏదో ఒక కొత్త పాఠం నేర్పుతుంది. ఎప్పటికప్పుడు సాంకేతికంగా, మానసికంగా, శారీరకంగా మెరుగుపడుతూనే ఉండాలి. క్రీడలు మన వ్యక్తిత్వానికి సానపెడతాయి. అందుకే నాకు క్రీడలంటే ప్రాణం" అంటోంది దివ్యాంశి భౌమిక్. ఈనెల మొదటివారంలో... ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో ముగిసిన 'ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్- సింగిల్స్‌లో ఆమె స్వర్ణాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. సుబ్రమణియన్ భువనేశ్వరి (1986లో) తరువాత... 36 ఏళ్ళకు ఈ టైటిల్‌ను మన దేశానికి తీసుకువచ్చిన దివ్యాంశి... భారత మహిళా టేబుల్ టెన్నిస్ ఆశాకిరణంగా ప్రశంసలందుకుంటోంది.

అప్పుడు సీరియస్‌గా తీసుకోలేదు...

దివ్యాంశి కుటుంబం కోల్‌కతా నుంచి వచ్చి ముంబైలో స్థిరపడింది. ఆమె తండ్రి రాహుల్ ఒక బహుళ జాతి కంపెనీలో ఉన్నతాధికారిగా ఉన్నారు. "మా స్కూల్‌లో ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను తప్పనిసరిగా అభ్యసించాలి. నేను టేబుల్ టెన్నిస్ ఎంచుకున్నాను. కానీ అప్పుడు దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు" అని చెబుతోంది దివ్యాంశి. అయితే కొవిడ్ లాక్‌డౌన్‌తో ఇంటిల్లిపాదికీ తీరిక దొరికింది. అక్క హితాంశితో, ఒకప్పుడు క్రీడాకారుడైన తండ్రితో ఇంట్లోనే వీలైనంతసేపు టేబుల్ టెన్నిస్‌ను దివ్యాంశి ప్రాక్టీస్ చేసింది. "అప్పుడే నాకు ఆ ఆట మీద ఇష్టం ఏర్పడింది. వరుసగా గెలవడంతో ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది అని ఆమె అంటోంది. ఆమె నైపుణ్యాన్ని గుర్తించిన తండ్రి స్థానికంగా శిక్షణ ఇప్పించారు. కొన్నాళ్ళకు తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న దివ్యాంశి... సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. ఇంకా ప్రోత్సహిస్తే మరింత రాణించగలదని ఆమె తండ్రి భావించారు. అప్పటి నుంచి అదే ఆమె లోకమైపోయింది. 2022కల్లా రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించుకుంది. క్రమంగా జాతీయ స్థాయికి ఎదిగింది. దాదాపుగా ప్రతి పోటీలోనూ పతకం సాధిస్తోంది. ఇప్పటికే జాతీయ స్థాయిలో ఏడు పతకాలు, పదకొండు డబ్ల్యూటీటీ యూత్ కంటెండర్ టైటిల్స్, 2023లో 'వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్- డబుల్స్'లో స్వర్ణం... ఆమె ఖాతాలో ఉన్నాయి.

మా స్కూల్‌లో ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను తప్పనిసరిగా అభ్యసించాలి. నేను టేబుల్ టెన్నిస్ ఎంచుకున్నాను. కానీ అప్పుడు దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు కొవిడ్ లాక్‌డౌన్‌లో అక్క హితాంశితో, ఒకప్పుడు క్రీడాకారుడైన తండ్రితో ఇంట్లోనే టేబుల్ టెన్నిస్ ఆడేదాన్నిఅప్పుడే నాకు ఆ ఆట మీద ఇష్టం ఏర్పడింది



చాలా శ్రమ పడాల్సి వస్తోంది...

తాజాగా 'ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్- సింగిల్స్'లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను దివ్యాంశి సాధించింది. చైనీయుల ఆధిపత్యం ఉన్న ఈ టోర్నీలో... ముగ్గురు చైనా అమ్మాయిలపై నెగ్గి... స్వర్ణాన్ని అందుకోవడంలో ఈ గెలుపు మరింత ప్రత్యేకంగా మారింది. ప్రస్తుతం బాలికల అండర్-15 వరల్డ్-3 ర్యాంక్‌లో దివ్యాంశి కొనసాగుతోంది. "దీనికోసం చాలా శ్రమ పడాల్సి వస్తోంది. ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాల్సి వస్తోంది. మా కోచింగ్ క్యాంప్‌లు బెంగళూరులో జరుగుతాయి. ముంబై నుంచి అక్కడికి తరచూ వెళ్ళాల్సి వస్తోంది. మరోవైపు పదో తరగతి పరీక్షలకి సన్నద్ధం కావాలి. శిక్షణ తరువాత చదువుకోవడం కష్టమే అయినా మరో మార్గం లేదు. మార్కుల కోసం నాన్న, అమ్మ ఒత్తిడి చెయ్యరు. కానీ చదువులో వెనుకపడడం నాకు ఇష్టం లేదు. నా కుటుంబం, కోచ్‌ల సహకారంతో చదువును, క్రీడల్ని బ్యాలెన్స్ చేసుకుంటున్నా" అంటోందామె. ఈ ఏడాది నవంబర్‌లో రొమేనియాలో జరిగే 'వరల్డ్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ కోసం సన్నద్ధం అవుతున్న దివ్యాంశి... 2028 ఒలింపిక్స్‌లో మన దేశానికి స్వర్ణాన్ని సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది.





గెలవాల్సిందే..

తీవ్ర ఒత్తిడిలో టీమిండియా
- వెంటాడుతున్న గాయాలు
- పేసర్ ఆకాశ్ అవుట్
- జోష్‌లో ఇంగ్లండ్


స్టోక్స్

మాంచెస్టర్: ఎనిమిది రోజుల సుదీర్ఘ విరామం తర్వాత భారత్-ఇంగ్లండ్ జట్లు మరోసారి ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడబోతున్నాయి. అయితే లార్డ్స్‌లో విజయం అంచుల వరకూ వచ్చి ఓడిన నిరాశతో పాటు తాజాగా ఆటగాళ్ల గాయాలు భారత జట్టును వేధిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో బుధవారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టు బరిలోకి దిగనుంది. ఇక ఈ మ్యాచ్ ఆతిథ్య జట్టు కన్నా గిల్ సేనకే అత్యంత కీలకం. ఎందుకంటే ఇప్పటికే 1-2తో వెనుకబడిన టీమిండియాకు ఈ సిరీస్‌పై ఆశలు నిలవాలంటే మాంచెస్టర్‌లో ప్రత్యర్థిని మట్టి కరిపించాల్సిందే. లేకుంటే చివరి టెస్టు నామమాత్రంగా మారుతుంది. మరో వైపు ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో భారత జట్టుకు ఒక్క విజయం కూడా లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇక్కడ 9 మ్యాచ్‌లు ఆడితే నాలుగింట్లో ఓడి, ఐదింటిని డ్రా చేసుకుంది. 2014లో ఆడిన చివరి మ్యాచ్‌లోనైతే ఇన్నింగ్స్ 54 రన్స్ తేడాతో చిత్తుగా ఓడింది. అంతేకాదు.. 1990లో సచిన్ శతకం తర్వాత మరే భారత బ్యాటర్ కూడా ఇక్కడ మూడంకెల స్కోరు సాధించలేకపోయాడు. కానీ రెండో టెస్టు జరిగిన ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ తొలిసారిగా అద్భుత విజయం సాధించింది. అదే స్ఫూర్తితో నాలుగో టెస్టును చిరస్మరణీయం చేసుకోవాలనుకుంటోంది. అటు సిరీస్‌లో పైచేయి సాధించిన ఇంగ్లండ్ రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఆటగాళ్లంతా ఫామ్‌లో ఉండడంతో పాటు ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ఆడిన చివరి పది టెస్టుల్లో ఇంగ్లండ్ ఒక్కసారే ఓడడం గమనార్హం.

జట్టు కూర్పే సమస్య..: టెస్టు బరిలోకి దిగడానికి ముందు తుది జట్టు కూర్పుపై టీమ్ మేనేజ్‌మెంట్ తర్జనభర్జన పడుతోంది. లార్డ్స్ టెస్టులో ఆడిన నితీశ్ కుమార్ గాయాల కారణంగా సిరీస్‌కు దూరం కాగా, పేసర్ ఆకాశ్ దీప్ ఈ టెస్టుకు దూరమయ్యాడు. పేసర్ అర్ష్‌దీప్‌ది కూడా అదే పరిస్థితి. దీంతో సిరీస్‌లో కచ్చితంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లోనూ మార్పులు తప్పవు. అయితే స్టార్ పేసర్ బుమ్రా బరిలోకి దిగుతుండడం.. అలాగే రిషభ్ పంత్ కీపింగ్ కూడా చేస్తాడని కెప్టెన్ గిల్ చెప్పడం అతి పెద్ద రిలీఫ్‌గా భావించవచ్చు. ఇక ఆకాశ్ స్థానంలో ప్రసిద్ధ్ క్రిష్ణ, అన్షుల్ కాంబోజ్ మధ్య పోటీ ఉంది. ప్రసిద్ధ్‌కు ఇప్పటికే రెండుసార్లు అవకాశం ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదు కాబట్టి అన్షుల్ వైపే మొగ్గుచూపవచ్చు. ఇక నితీశ్ స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా సాయి సుదర్శన్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. వరుసగా మూడు టెస్టుల్లో విఫలమైన కరుణ్ నాయర్‌పై వేటు తప్పదని అంతా భావించినా.. కెప్టెన్ గిల్ మాత్రం అతడికి మద్దతుగా నిలిచాడు. దీంతో కరుణ్‌కు మరో చాన్స్ దక్కినట్టే. ఒకవేళ పిచ్ సీమర్లకు ఎక్కువగా అనుకూలించినట్టయితే స్పిన్నర్ సుందర్‌ను తప్పించి శార్దూల్‌ను ఆడించాలనుకుంటున్నారు.

ఆత్మవిశ్వాసంతో ఆతిథ్య ఇంగ్లండ్: ఇంగ్లండ్ జట్టు మాత్రం నాలుగో టెస్టు కోసం ఇప్పటికే తమ ఆటగాళ్లను ప్రకటించింది. స్పిన్నర్ షోయబ్ బషీర్ గాయంతో దూరం కాగా అతడి స్థానంలో లియామ్ డాసన్ ఎనిమిదేళ్ల తర్వాత టెస్టుల్లో చోటు దక్కించుకున్నాడు. ఈ లెఫ్టామ్ స్పిన్నర్ బ్యాటింగ్‌లోనూ రాణించగలగడం జట్టుకు అదనపు బలం కానుంది. టాపార్డర్‌లో క్రాలే, డకెట్, పోప్‌తో పాటు మిడిలార్డర్‌లో రూట్, బ్రూక్, స్టోక్స్‌తో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. పేసర్ ఆర్చర్ లార్డ్స్ టెస్టులో భారత్‌ను ఇబ్బందిపెట్టాడు. 2-1తో ఆధిపత్యంలో ఉన్న ఇంగ్లండ్ ఎలాంటి అలక్ష్యానికి తావీయకుండా ఇక్కడే సిరీస్ పట్టేయాలనుకుంటోంది.

మ.3.30 గం. నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..



90 సెకన్ల ఆలస్యంగానా?

ఇంగ్లండ్ క్రీడా స్ఫూర్తిని ప్రశ్నించిన గిల్

లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించిందని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆరోపించాడు. ఇంగ్లిష్ ఓపెనర్లు ఉద్దేశపూర్వకంగానే 90 సెకన్లు ఆలస్యంగా క్రీజులోకి వచ్చారని అన్నాడు. '10 కాదు.. 20 కాదు.. ఏకంగా 90 సెకన్లు ఆలస్యంగా వచ్చారు. మేం ఆ పరిస్థితుల్లో ఉండి ఉంటే.. అలాగే ఆలోచించే వాళ్లమేమో. కానీ, దేనికైనా ఓ పద్ధతి ఉంటుంద'ని గిల్ అన్నాడు.

చెత్త రికార్డుకు చేరువలో..

మాంచెస్టర్‌లో కచ్చితంగా గెలిచి తీరాల్సిన ఒత్తిడితో పాటు ఇక్కడ మరో 'రికార్డు' కూడా భారత జట్టును వణికిస్తోంది. స్థానిక ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో భారత్ ఆడిన 9 మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా గెలువలేదు. నాలుగింట్లో ఓడి, ఐదింటిని డ్రా చేసుకుంది. 2014లో ఆడిన చివరి మ్యాచ్‌లోనైతే ఇన్నింగ్స్ 54 రన్స్ తేడాతో చిత్తుగా ఓడింది. ఒకవేళ ఈ టెస్టులోనూ ఓడితే భారత్ ఖాతాలో ఏ జట్టూ కోరుకోని రికార్డు చేరనుంది. టెస్టు చరిత్రలో ఒకే వేదికపై వరుసగా పది మ్యాచ్‌ల్లోనూ గెలుపు రుచి చూడని జట్టుగా నిలవనుంది. ప్రస్తుతం భారత్‌తో పాటు ఆస్ట్రేలియా (కరాచీ వేదికపై), శ్రీలంక (లార్డ్స్‌లో) కూడా వరుసగా తొమ్మిది టెస్టుల్లో గెలుపు లేకుండా సమంగా ఉన్నాయి.

తుది జట్లు

భారత్ (అంచనా): జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్ (కెప్టెన్), పంత్, కరుణ్ నాయర్, జడేజా, సుందర్/శార్దూల్, బుమ్రా, ప్రసిద్ధ్/అన్షుల్, సిరాజ్.
ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్ (కెప్టెన్), స్మిత్, వోక్స్, డాసన్, కార్స్, ఆర్చర్.

పిచ్, వాతావరణం

మాంచెస్టర్ పిచ్ సహజంగానే పేసర్లకు అనుకూలిస్తుంటుంది. చక్కటి బౌన్స్‌తో బ్యాటర్లను ఇబ్బందిపెడుతుంటారు. వాతావరణ పరిస్థితిని బట్టి కూడా టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. అలాగే టెస్టు జరిగే ఐదు రోజులు చిరు జల్లులకు ఆస్కారం ఉంది. తొలి రెండు రోజులు మ్యాచ్‌కు అంతరాయం కలిగించవచ్చు.

ప్రీక్వార్టర్స్‌లో ప్రణయ్



చాంగ్జౌ: చైనా ఓపెన్ తొలి రౌండ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ అదరగొట్టాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో తను ఏకంగా ఐదు మ్యాచ్ పాయింట్లను కాచుకుని కోకి వటనబే (జపాన్)పై 8-21, 21-16, 23-21 తేడాతో గెలిచాడు. తొలి గేమ్‌లో ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన ప్రణయ్.. రెండో గేమ్‌లో మాత్రం జోరు చూపి నిలిచాడు. ఇక నిర్ణాయక గేమ్‌లో 2-11తో వెనుకబడినా పుంజుకుని వరుసగా ఐదు పాయింట్లు సాధించాడు. అలాగే 15-20తో ఓటమి ఖాయమనిపించినా.. ప్రత్యర్థి ఐదు మ్యాచ్ పాయింట్లను వమ్ము చేసి 21-20తో లీడ్‌లోకి వచ్చి పట్టు కోల్పోలేదు. మరోవైపు లక్ష్యసేన్ 21-14, 22-24, 11-21 తేడాతో లి షి ఫెంగ్ (చైనా) చేతిలో తొలి రౌండ్‌లోనే ఓడాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సూర్య-ప్రముతేష్, రోహన్ కపూర్-రుత్విక జోడీలకు ఓటమి ఎదురైంది.

తొలి గేమ్‌లో హంపి, దివ్యకు డ్రా

మహిళల చెస్ వరల్డ్‌కప్ సెమీస్

బటూమి (జార్జియా): మహిళల చెస్ వరల్డ్‌కప్ సెమీస్‌లో భారత జీఎం కోనేరు హంపి, ఐఎం దివ్య దేశ్‌ముఖ్ తమ తొలి గేమ్‌లను డ్రాగా ముగించారు. చైనా గ్రాండ్ మాస్టర్ లి టింగ్జీతో మంగళవారం జరిగిన సెమీస్ మొదటి క్లాసిక్ గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి సులువుగా గేమ్‌ను డ్రా చేసుకుంది. ఓపెనింగ్‌లోనే ప్రత్యర్థికి కోనేరు ఝలక్ ఇచ్చింది. దీంతో ఏం చేయాలో అర్థం కాని టింగ్జీ తన బలగాలను సరిగా నడిపించలేకపోయింది. మిడిల్ గేమ్‌లో ఇద్దరూ క్వీన్‌లను కోల్పోయినా.. హంపి ఎక్కడా ఒత్తిడికి గురికాలేదు. మరో సెమీస్‌లో చైనా జీఎం టోన్ జోంగ్‌యితో దివ్య పాయింట్ పంచుకొంది. బుధవారం కీలక రెండో క్లాసిక్ గేమ్ జరగనుంది.

● దక్షిణాఫ్రికాపై కివీస్ గెలుపు

హరారే: టిమ్ సీఫెర్ట్ (66 నాటౌట్) అర్ధ శతకంతో చెలరేగడంతో.. టీ20 ముక్కోణపు సిరీస్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత సౌతాఫ్రికా 134/8 స్కోరు చేసింది. హెండ్రిక్స్ (41) టాప్ స్కోరర్. ఛేదనలో కివీస్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 135 పరుగులు చేసి నెగ్గింది.

హర్మన్ శతకం

● భారత్ 318/5



చెస్టర్‌లీ స్ట్రీట్: హర్మన్‌ప్రీత్ కౌర్ (84 బంతుల్లో 14 ఫోర్లతో 102) సెంచరీతోపాటు మిగతా బ్యాటర్లు రాణించడంతో భారత మహిళల జట్టు భారీ స్కోరు చేసింది. ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగిన సిరీస్ నిర్ణాయక ఆఖరి, మూడో వన్డేలో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకొన్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 318 పరుగుల భారీ స్కోరు చేసింది. జెమీమా రోడ్రిగ్స్ (50), స్మృతి మంధాన (45), హర్లీన్ డియోల్ (45) చక్కని సహకారం అందించారు. ఎకెల్‌స్టోన్, లారెన్ ఫైలర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ కడపటి వార్తలందే సమయానికి 35 ఓవర్లలో 195/4 స్కోరు చేసింది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ (98) త్రుటిలో సెంచరీ చేజార్చుకొంది. ఓపెనర్లు అమీ జోన్స్ (4), బ్యూమాంట్ (2)ను క్రాంతి పెవిలియన్ చేర్చగా.. అర్ధ శతకం సాధించిన ఎమ్మా ల్యాంబ్ (68)ను శ్రీచరణి బౌల్డ్ చేసింది.

విహాన్ సెంచరీ

చెమ్స్‌ఫోర్డ్: ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో విహాన్ మల్హోత్రా (120) శతకంతో రాణించాడు. దీంతో భారత్ అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 279 పరుగులు చేసింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (80) అర్ధసెంచరీ సాధించాడు. ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి 93/0 స్కోరుతో ఉంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 309 పరుగులు సాధించింది.

పాక్‌కు బంగ్లా మరో షాక్

ఢాకా: పాకిస్థాన్‌తో ఉత్కంఠభరితంగా సాగిన రెండో టీ20లో బంగ్లాదేశ్ 8 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో దక్కించుకుంది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 20 ఓవర్లలో 133 పరుగులు చేసింది. జకెర్ అలీ (55), మెహదీ హసన్ (33) రాణించారు. సల్మాన్, దనియాల్, అబ్బాస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ 19.2 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. షోరిఫుల్‌కు మూడు.. తన్‌జీమ్, మెహదీలకు రెండేసి వికెట్లు దక్కాయి.

జాతీయ క్రీడా బిల్లు పరిధిలోకి బీసీసీఐ

బిన్నీకి లక్కీ చాన్స్?

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇంతకాలం స్వతంత్రంగా వ్యవహరిస్తూ వస్తోంది. ప్రభుత్వం నుంచి బీసీసీఐ ఎటువంటి నిధులూ తీసుకోదు.. క్రీడా శాఖ కూడా బోర్డు కార్యకలాపాల్లో ఎక్కడా జోక్యం చేసుకొన్న సందర్భాలు లేవు. అయితే, బుధవారం కొత్త జాతీయ కీడా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పాస్ అయితే బీసీసీఐకి కూడా కొత్త క్రీడా చట్టం వర్తిస్తుందని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ నిధులపై బీసీసీఐ ఆధారపడకపోయినా.. జాతీయ క్రీడా బోర్డు నుంచి తప్పనిసరిగా గుర్తింపు పొందాల్సి ఉంటుందని తెలిపాయి. అయితే, మిగతా జాతీయ క్రీడా సంఘాల తరహాలోనే బీసీసీఐ స్వతంత్రంగా వ్యవహరించవచ్చు. కానీ, ఏదైనా వివాదాలు తలెత్తితే మాత్రం ప్రతిపాదిత జాతీయ క్రీడా ట్రైబ్యునల్ పరిధిలోనే వాటిని పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుత బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీకి నూతన స్పోర్ట్స్ బిల్లు వరంగా మారే అవకాశం ఉంది. బోర్డు రాజ్యాంగం ప్రకారం 70 ఏళ్లకు మించిన వారు ఏ పదవిలోనూ కొనసాగకూడదు. అయితే, గత శనివారంతో బిన్నీకి 70 నిండాయి. కానీ, బిల్లు ముసాయిదాలో ఈ వయో నిబంధనను 70 నుంచి 75 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదన ఉంది.

మళ్లీ చాంపియన్స్ లీగ్ టీ20?

న్యూఢిల్లీ: పదేళ్ల క్రితం రద్దు చేసిన చాంపియన్స్ లీగ్ టీ20 టోర్నీకి మళ్లీ జీవంపోసే అవకాశాలున్నాయి. సింగపూర్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ టోర్నీపై కీలక నిర్ణయం తీసుకొన్నట్టు సమాచారం. అంతా సవ్యంగా సాగితే వచ్చే ఏడాది లీగ్‌ను నిర్వహించే అవకాశం ఉంది. ఫ్రాంచైజీ జట్ల మధ్య జరిగే చాంపియన్స్ లీగ్‌ను 2015లో నిలిపేశారు. అయితే, ఈ పదేళ్లలో ఫ్రాంచైజీ క్రికెట్ ఎంతో వృద్ధి చెందింది.

'చెన్నై గ్రాండ్‌మాస్టర్స్' బరిలో అర్జున్

చెన్నై: వచ్చే నెల ఆరునుంచి జరిగే చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్, జీఎంలు విదిత్ గుజరాతి, అనిష్ గిరి హాట్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. దేశంలో జరిగే అత్యంత ప్రతిష్ఠాత్మక క్లాసికల్ చెస్ టోర్నీ అయిన చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో మొత్తం 20 మంది ప్లేయర్లు మాస్టర్స్, చాలెంజర్స్ కేటగిరీల్లో తలపడనున్నారు. మాస్టర్స్ విభాగం ప్రైజ్ మనీ రూ.1 కోటి కాగా, చాలెంజర్స్ కేటగిరీ ప్రైజ్ మనీ రూ.25 లక్షలు. చాలెంజర్స్ విభాగంలో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక, ఆర్.వైశాలి పాల్గొననున్నారు.

అత్యంత ఆకర్షణీయ బ్రాండ్లలో

టాటా, గూగుల్, ఇన్ఫోసిస్

రాండ్‌స్టడ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగులకు అత్యంత ఆకర్షణీయ కార్పొరేట్ బ్రాండ్ల జాబితాలో టాటా గ్రూప్, గూగుల్ ఇండియా, ఇన్ఫోసిస్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయని 'రాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్ఈబీఆర్) 2025' నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఉద్యోగులు వృత్తి-వ్యక్తిగత జీవిత సంతులనం, ఈక్విటీ, ఆకర్షణీయ వేతనం సహా అదనపు ప్రయోజనాలు వంటి ఎంప్లాయీ వాల్యూ ప్రపోజిషన్స్ (ఈవీపీ)కు అధిక ప్రాధాన్యమిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఆర్థిక సమృద్ధి, వృత్తిలో పురోగతి అవకాశాలు, పేరు ప్రతిష్ఠల విషయంలో టాటా గ్రూప్‌నకు అధిక స్కోర్ లభించిందని, తద్వారా లిస్ట్‌లో టాప్‌లో నిలిచిందని రాండ్‌స్టడ్ తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే గూగుల్ ఇండియా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుని రెండో స్థానానికి చేరుకోగా.. దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మూడో స్థానంలో ఉంది.

ఈ జాబితాలో సామ్‌సంగ్ ఇండియా, జేపీ మోర్గాన్ చేజ్ 4, 5 స్థానాలను దక్కించుకోగా.. ఐబీఎం, విప్రో, రిలయన్స్ ఇండస్ట్రీస్, డెల్, ఎస్‌బీఐ వరుసగా 6 నుంచి 10 స్థానాల్లో నిలిచాయంది. ఈ జాబితాలోని ఏకైక బహుళజాతి ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌బీఐ అని రిపోర్టు వెల్లడించింది. భారత్‌లో 3,500 మందితో సహా 34 మార్కెట్లలో 1.70 లక్షల మంది నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా రాండ్‌స్టడ్ ఈ నివేదికను రూపొందించింది. నివేదికలోని మరిన్ని విషయాలు..

- నేటి తరం ఉద్యోగులు యజమాని నుంచి వేతనానికి మించి చాలా ఆశిస్తున్నారు. వృత్తితో పాటు వ్యక్తిగత జీవిత వృద్ధికి మద్దతిచ్చే సమగ్ర, భవిష్యత్ దృష్టితో కూడిన కంపెనీల్లో పనిచేయాలనుకుంటున్నారు.
- సర్వేలో పాల్గొన్న వారిని ఆదర్శవంతమైన యాజమాన్యాలపై అభిప్రాయాన్ని కోరినప్పుడు, భారత కంపెనీల్లో వృత్తి-వ్యక్తిగత జీవిత సమతుల్యం, ఆకర్షణీయ వేతనం.. ప్రయోజనాల వంటి అంశాలు ఇంకా పరిష్కరించాల్సిన అంతరాలుగా కన్పించాయి.
- ఈ ఏడాది నివేదిక స్పష్టమైన మార్పును ప్రతిబింబిస్తోంది. నేటితరం ఉద్యోగులు సంప్రదాయ ఉద్యోగాలతో సంతృప్తి చెందడం లేదు. ఈక్విటీ, ఉద్దేశం, అర్థవంతమైన వృద్ధితో పాటు వృత్తి-వ్యక్తిగత జీవిత ఐక్యతను వారు కోరుకుంటున్నారని రాండ్‌స్టడ్ ఇండియా ఎండీ, సీఈఓ విశ్వనాథ్ పీఎస్ అన్నారు.

టాప్-10 బ్రాండ్లు

ర్యాంక్	కంపెనీ
1	టాటా గ్రూప్
2	గూగుల్ ఇండియా
3	ఇన్ఫోసిస్
4	సామ్‌సంగ్ ఇండియా
5	జేపీ మోర్గాన్
6	ఐబీఎం
7	విప్రో
8	రిలయన్స్ ఇండస్ట్రీస్
9	డెల్ టెక్నాలజీస్
10	ఎస్‌బీఐ

ఉద్యోగం మారుతాం..

కొత్త కొలువులోకి మారాలన్న అభిప్రాయం నిలకడగా పెరుగుతూ వస్తోందని, ముఖ్యంగా యువ నిపుణుల్లో ఇది ఎక్కువగా కన్పిస్తోందని ఈ ఏడాది సర్వేలో వెల్లడైనట్లు రాండ్‌స్టడ్ వెల్లడించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో 47 శాతం మంది భారత ఉద్యోగులు కొత్త ఉద్యోగంలోకి మారాలని ఆలోచించారని.. జెన్ జెడ్ (51 శాతం), మిలీనియల్స్ (50 శాతం)లో ఇది ఎక్కువగా ఉందని తెలిపింది. ఇది యాజమాన్యాలకు మేలుకొలుపు అని విశ్వనాథ్ అన్నారు. కేవలం ప్రోత్సాహకాలతో సరిపెట్టకుండా సంస్థలో విశ్వసనీయత, పారదర్శకత, ఉమ్మడి ప్రయోజనాలతో కూడిన సంస్కృతిని పెంచాలన్నారు. నైపుణ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారుతున్న తరుణంలో ప్రతిభావంతుల కోసం కంపెనీల మధ్య పోటీ మరింత పెరగనుందన్నారు.

వేగంగా పెరుగుతున్న ఏఐ వినియోగం

ఉద్యోగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వినియోగం శరవేగంగా పెరుగుతున్నదని నివేదిక తెలిపింది. భారత ఉద్యోగుల్లో 61 శాతం మంది ఏఐని తరుచుగా ఉపయోగిస్తున్నారు. అందులో మిలీనియల్సే అధికమని, గత ఏడాదితో పోలిస్తే ఏఐ వినియోగం 13 శాతం పెరిగిందని రిపోర్టు పేర్కొంది. తమ పనిపై ఏఐ గణనీయ ప్రభావం చూపిస్తోందని 38 శాతం మంది ఉద్యోగులు అభిప్రాయపడినట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో కాస్ట్‌కో జీసీసీ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ కంపెనీ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయబోతోంది. అమెరికా కేంద్రంగా పనిచేసే ప్రముఖ రిటైల్ కంపెనీ 'కాస్ట్‌కో హోల్‌సేల్ కార్ప్' ఈ జీసీసీని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఈ కేంద్రంలో తొలి దశలో వెయ్యి మంది వరకు పని చేసే అవకాశం ఉంది. ఈ జీసీసీ ద్వారా 'కాస్ట్‌కో హోల్‌సేల్ కార్ప్' తన టెక్నాలజీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కార్యకలాపాలను నిర్వహించనుంది. హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డోనాల్డ్స్, హెనెకిన్, వాన్‌గార్డ్ గ్రూప్ వంటి అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ జీసీసీలు ఏర్పాటు చేశాయి.

జీసీసీల కోసం 'ఎనేబ్లర్' సొల్యూషన్

కోవాసంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కోవాసంట్ టెక్నాలజీస్.. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) కోసం ఎనేబ్లర్ పేరుతో ప్రత్యేక టెక్నాలజీని విడుదల చేసింది. ఈ ఏఐ ఆధారిత టెక్నాలజీ సొల్యూషన్ జీసీసీల వ్యూహాత్మక విలువ లోటును పూడ్చడంలో ఎంతో సహాయకారిగా ఉంటుందని కంపెనీ తెలిపింది. 'నేటి జీసీసీలు ఆఫ్‌షోర్ సపోర్ట్ సిస్టమ్స్ స్థాయి నుంచి నవకల్పనలు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రాలుగా ఎదిగాయి. దీంతో జీసీసీల ప్రాథమిక నిర్వచనం కూడా మారిపోయింది. మా ఎనేబ్లర్ ఈ సవాళ్లను అధిగమించడంలో జీసీసీలకు సహాయపడుతుంది' అని ఎనేబ్లర్ సీఎండీ సీవీ సుబ్రమణ్యం తెలిపారు.

మార్చి నాటికి దాచేపల్లి ప్లాంట్ విస్తరణ పూర్తి

రూ.140 కోట్లతో సౌర విద్యుదుత్పత్తి కేంద్రం
సాగర్ సిమెంట్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాగర్ సిమెంట్స్ కార్యకలాపాల విస్తరణ తుది దశకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కంపెనీ నిర్వహణలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 60 లక్షల టన్నులకు విస్తరిస్తున్నట్లు సాగర్ సిమెంట్స్ జెఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న ఆంధ్రా సిమెంట్స్‌ను సాగర్ సిమెంట్స్ 2023 ఫిబ్రవరిలో రూ.922 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు రూ.468 కోట్లతో ప్రస్తుత 30 లక్షల టన్నుల నుంచి 60 లక్షల టన్నులకు విస్తరిస్తోంది. 'దాచేపల్లిలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్య విస్తరణ పనులు అనుకున్న ప్రకారం జరుగుతున్నాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఈ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం 60 లక్షల టన్నులకు చేరుతుంది' అని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దాచేపల్లి ప్లాంట్ విస్తరణతో పాటు తన అనుబంధ సంస్థ సాగర్ సిమెంట్స్ (ఎం) ప్రైవేట్ లిమిటెడ్ వార్షిక సిమెంట్ గ్రైండింగ్ సామర్థ్యాన్నీ ప్రస్తుత 15 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు విస్తరిస్తోంది. వీటికి తోడు ఇంధనఖర్చులు తగ్గించుకునేందుకు రూ.140 కోట్ల అంచనాతో 6 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సౌర విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకు సాగర్ సిమెంట్స్ (ఎం) ప్రైవేట్ లిమిటెడ్ బోర్డు ఆమోదం తెలిపినట్టు శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు.

మార్కెట్లో ఆద్యంతం ఊగిసలాటలే..

సెన్సెక్స్ 13 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 338 పాయింట్లు ఎగబాకినప్పటికీ, క్రమంగా లాభాలను చేజార్చుకున్న సూచీ చివరికి 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్లు కోల్పోయి 25,060.90 వద్ద స్థిరపడింది. ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఇందుకు కారణమైంది. క్విక్ కామర్స్ సంస్థ ఎటర్నల్, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ నష్టాలను పరిమితం చేశాయి. ఆగస్టు 1 నుంచి ట్రంప్ అదనపు సుంకాలు అమలులోకి రానున్న నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరకపోవడం, ఎఫ్‌ఐఐలు లాభాలు స్వీకరిస్తుండటం మన మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోగా.. టాటా మోటార్స్ షేరు అత్యధికంగా 2.04 శాతం క్షీణించింది. ఎటర్నల్ షేరు మాత్రం 10.56 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

స్పామ్ కాల్స్ నుంచి రక్షణకు సరికొత్త విధానం: ట్రాయ్

న్యూఢిల్లీ: వాణిజ్యపరమైన సందేశాల విషయంలో వినియోగదారునికి పూర్తి అదుపు ఇస్తూ ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టును చేపట్టనున్నట్టు టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ ప్రకటించింది. ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగంగా స్పామ్ కాల్స్‌ను నియంత్రించేందుకు ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో వినియోగదారులు అందిస్తున్న అనుమతి స్థానంలో డిజిటల్ అనుమతిని ప్రవేశపెడతారు. ట్రాయ్, ఆర్‌బీఐ ప్రతినిధులతో పాటు టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు, ప్రధాన బ్యాంకుల ప్రతినిధులు ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉంటారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, నిర్వహణాపరమైన, చైతన్యకల్పన అంశాలను నాలుగు ప్రత్యేక కార్యాచరణ బృందాలు పర్యవేక్షిస్తాయి. మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన రెగ్యులేటర్ల జాయింట్ కమిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టుపై చర్చించారు. ఇందులో భాగంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాల లావాదేవీలు, సేవల కోసం ప్రత్యేకంగా 1600 నంబర్ సీరీస్‌ను కేటాయించనున్నారు. వివిధ రంగాల రెగ్యులేటర్లు ట్రాయ్‌కి అందించే సమాచారం ఆధారంగా దశల వారీగా ఈ నంబర్‌కు మారేందుకు అనుమతించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	505
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	114
వరంగల్	112	గుంటూరు	119
కరీంనగర్	112	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	109
కర్నూలు	112	నెల్లూరు	114
విశాఖపట్నం	97	అనంతపురం	114
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,290 ▲	92,850 ▲	1,28,000 ▲
విజయవాడ	1,02,600 ▲	96,500 ▲	1,18,000 ▲
విశాఖపట్నం	1,03,000 ▲	92,850 ▲	1,28,000 ▲
రాజమండ్రి	1,01,290 ▲	92,850 ▲	1,16,100 ▲
ప్రొద్దుటూరు	99,200 ▲	91,260 ▲	1,11,650 ▲
ముంబై	99,508 ▲	91,149 ▲	1,14,493 ▲

తొలిసారిగా లాభాల్లోకి పేటీఎం

న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండ్ మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తొలిసారిగా లాభాల్లోకి అడుగు పెట్టింది. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.122.50 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. వ్యయాలను గణనీయంగా నియంత్రించడంతో పాటు పేమెంట్ ఆదాయాలు పెరగడం ఇందుకు దోహదపడినట్టు కంపెనీ తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.840 కోట్ల నికర నష్టం ప్రకటించింది. స్థూల లాభం సైతం రూ.72 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే కంపెనీ మార్కెటింగ్, ప్రచార వ్యయాలను సగానికి సగం తగ్గించుకుంది. జూన్ త్రైమాసికంలో పేమెంట్ ప్రాసెసింగ్ మార్జిన్లు పెరిగిన కారణంగా కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,917.50 కోట్లకు పెరిగింది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లాభంలో 41% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.89 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.63 కోట్లు)తో పోల్చితే లాభం 41 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా 25 శాతం వృద్ధితో రూ.577 కోట్ల నుంచి రూ.721 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికంలో నిర్వహణాపరమైన సామర్థ్యాలను పెంచుకోవటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్ 2027-28 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అందుబాటులోకి వస్తుందని తెలిపింది. అలాగే రూ.700 కోట్ల పెట్టుబడితో మధ్యప్రదేశ్‌లో నెలకొల్పుతున్న ప్లాంట్ 2027 మార్చి నాటికల్లా ప్రారంభం కానుందని పేర్కొంది.

ప్రగతి పనుల్లో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం!

- రాష్ట్రంలో తొలిసారిగా పీపీపీ విధానంలో అమృత్ టెండర్లు
- రూ.1,092 కోట్లతో మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులు
- కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో టెండర్ వాయిదా

నరసరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకం కింద మున్సిపాలిటీల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులను భాగస్వామ్యం చేయనున్నది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల పరిధిలో అమృత్ 2.0 కింద రూ.1,092.60 కోట్లతో చేపట్టే ప్రగతి పనుల కోసం ఒకే ప్యాకేజీ కింద ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ గత నెల 24న టెండర్ల ప్రక్రియ చేపట్టింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు పీపీపీ విధానంలో టెండర్లు పిలిచింది. ఈనెల 21న టెండర్లు దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించింది. అయితే ఎవరూ టెండర్లు దాఖలు చేయకపోవడంతో వచ్చే నెల 7వ తేదీ వరకు గడువును పొడిగించింది.

పీపీపీ విధానంలో ఇలా..

పీపీపీ విధానంలో చేసిన పనులకు ప్రభుత్వం 50 శాతం నిధులను పనిపూర్తయ్యే లోపు ఇస్తుంది. మిగిలిన 50 శాతం కాంట్రాక్టర్ భరించాల్సి ఉంటుంది. సదరు ప్రైవేటు వ్యక్తి లేదా సంస్థ ఖర్చు చేసే 50 శాతం నిధులను వడ్డీతో కలిపి మూడు నెలలకు ఒకసారి చొప్పున పదేళ్ల పాటు 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ విధానంలో కాంట్రాక్టర్ 10 ఏళ్ల పాటు సంబంధిత అభివృద్ధి పనుల నిర్వహణకూడా చేయాల్సి ఉంటుంది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

రహదారులు వంటి ప్రగతి పనులకు ఎలాంటి లోపాలు చోటుచేసుకున్నా.. కాంట్రాక్టరే మూడేళ్ల పాటు మరమ్మతు చేయాలనే నిబంధన ఉంది. పని పూర్తయ్యేలోపు కాంట్రాక్టర్‌కు టెండర్ ప్రకారం పూర్తి బిల్లులు చెల్లించేవారు. అయితే కొత్త పీపీపీ విధానంలో కాంట్రాక్టర్ ఖర్చు చేసిన 50 శాతానికి 10 ఏళ్ల లోపు చెల్లించే విధానాన్ని అమలు చేయడంతో అమృత్‌కు టెండర్లు దాఖలు చేసేందుకు పెద్ద కాంట్రాక్టర్లు సహా ఎవరూ ముందుకు రాలేదు. పని పూర్తయ్యాక నిధుల చెల్లింపులో జాప్యం జరిగితే నష్టపోతామని వారు భావిస్తున్నారు. అయితే పెద్ద నిర్మాణ సంస్థ ఒకటి అమృత్ టెండర్లు దాఖలు చేయనున్నట్లు సమాచారం. వచ్చే నెల 7 లోపు టెండర్లు దాఖలు కాకపోతే.. పనుల్లో జాప్యం తప్పదు!

పంటల బీమా బకాయిలు రూ.2,565 కోట్లు

- 30 లక్షల మంది రైతుల ఎదురుచూపులు
- రైతులను మోసం చేసిన వైసీపీ: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న పంటల బీమా బకాయిల్లో అత్యధికంగా 40 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. మొత్తం రూ.6,604 కోట్లలో ఏపీ రైతులకే రూ.2,565 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుపై పార్లమెంట్‌లో ప్రశ్నించగా కేంద్రం ఈమేరకు సమాధానం ఇచ్చిందని, మంగళవారం ఆయన మీడియా సమావేశంలో చెప్పారు. 2022-2024 సంవత్సరాల్లో పంట నష్టపోయిన సుమారు 30 లక్షల మంది రైతులు బీమా కోసం ఎదురుస్తున్నారని తెలిపారు. కర్నూలు జిల్లాలో 4లక్షలు, అనంతపురంలో 3 లక్షలు, కడపలో 2 లక్షలు, సత్యసాయి జిల్లాలో 2లక్షల మంది రైతులకు బీమా అందాల్సి ఉందన్నారు. కాగా, ఢిల్లీలో టీడీపీ కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కోరినట్లు కలిశెట్టి చెప్పారు. పార్టీ కార్యాలయం కోసం గతంలో స్థల పరిశీలన జరిగిందని, ఢిల్లీలో కార్యాలయం నిర్మిస్తామని అన్నారు.

తొలి ప్రాధాన్యం రాజకీయాలకే!

'హరిహర వీరమల్లు' ప్రచారం నా బాధ్యత: పవన్ కల్యాణ్

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ రాజకీయమా.. సినిమా అంటే నా మొదటి ప్రాధాన్యం రాజకీయాలకే ఇస్తానని, ప్రజా సేవలకే అంకితం చేస్తానని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. హరిహర వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నేను జనసేనపై పూర్తిస్థాయిలో ఫోకస్ నడుపుతున్న సమయంలో ప్రారంభించిన సినిమాలు ఇవి. ప్రభుత్వంలో భాగస్వామ్యం అయిన తర్వాత ప్రత్యేక పరిస్థితుల్లో సినిమా చేయాల్సి వచ్చిందన్నారు.



సనాతన ధర్మానికి, ఈ సినిమాకు సంబంధం ఉందా..?

ఈ సినిమా ఏపీకి చాలా కీలకం. కోహినూర్ వజ్రం విజయవాడ కృష్ణా తీరం కొల్లూరు వజ్రాలగనుల వద్ద దొరికింది. ఇదే సమయంలో మన మచిలీపట్నం అంతర్జాతీయంగా ఎగుమతులు, దిగుమతులకు కేంద్రంగా ఉండేది. అలాంటి చోట జరిగిన కథే ఇది. కోహినూర్ కులీకుతుబ్‌షా నుంచి మొగల్ చక్రవర్తుల వద్దకు చేరింది. ఔరంగజేబు ఆశీనుడై ఉండే నెమలి సింహాసనంపై వజ్రం ఉంటుంది. అలాంటి వజ్రాన్ని తీసుకురావాలని హీరోకు బాధ్యత అప్పగిస్తారు. అది నాకు చాలా ఇంట్రెస్టింగా అనిపించింది. ఈ సినిమా చేయడానికి ఐదేళ్లు పట్టింది. 2 కరోనాలు ఇబ్బందులు పెట్టాయి. మ్యాన్ మేడ్ డిజాస్టర్ (వైసీపీ) మరింత ఇబ్బంది పెట్టింది. సినిమా చేద్దామనుకునేలోగా గత ప్రభుత్వం చంద్రబాబును అరెస్టు చేయడం.. నన్ను వైజాగ్‌లో ఇబ్బందులు పెట్టడం వంటివి ఎదురయ్యాయి. చివరగా ప్రభుత్వం మారిన వెంటనే చేయాలని నిర్ణయించాను. కానీ, ప్రభుత్వం వచ్చిన కొత్తలో 6 నెలల పాటు అడ్మినిస్ట్రేషన్‌పై అవగాహన పెంచుకుని.. ఆ తర్వాత మిడ్ వ్యాలీలో సెట్స్ వేశాం. రోజూ ఉదయం 7 గంటల నుంచి 2 గంటలు షూటింగ్ చేశాం. రాత్రిళ్లు కూడా చేశాం. ఈ సినిమాలో ధర్మం అనేదీ ఒక ఎలిమెంట్. నేను రాజకీయాల్లోకి వచ్చాను. సినిమానా, రాజకీయమా అంటే తొలి ప్రాధాన్యం రాజకీయాలకే.

తొలిసారి సినిమా ప్రమోషన్లలో..

నా వల్ల నిర్మాతలు నష్టపోయారు. నేను ప్రత్యేక పరిస్థితుల్లో ఈ సినిమా ప్రమోషన్ చేయాల్సి వస్తోంది. కరోనా, పొలిటికల్ డిజాస్టర్, అడ్మినిస్ట్రేషన్.. మూడింటికీ నిర్మాతలు బలయ్యారు. వారికి అండగా నిలవాల్సిన నైతిక బాధ్యత నాపై ఉంది. కాబట్టి ప్రచారం చేయాల్సి వస్తోంది. నేను రెమ్యునరేషన్ కూడా తీసుకోలేదు. రేపు హిట్ అవుతుందో లేదో తెలియదు. కానీ సినిమా రిలీజ్ చేయాలి.. ఆడాలి.. విజయం సాధించాలనే ఆశతో ఉన్నాం.

సర్వాయి పాపన్న క్యారెక్టర్‌కు సంబంధం లేదు..

సర్వాయి పాపన్న గౌడ్ క్యారెక్టర్‌కు, ఈ సినిమా హీరోకు సంబంధం లేదు. ఒక వేళ కోహినూర్ వజ్రమే తీసుకొస్తే ఎలా తెస్తారన్నదానిపైనే కథ ఉంటుంది. ఇది చారిత్రక ఆధారాలున్న పాత్ర కాదు. సృష్టించిన క్యారెక్టర్ మాత్రమే.

సినిమా తీసినప్పుడు ఇబ్బందులు పడ్డారా?

వైజాగ్‌లో ఇబ్బంది పెట్టిన తర్వాత పార్టీని సీరియస్‌గా నడిపించాలని నిర్ణయించుకున్నాను. రాజకీయాలతో పాటు సినిమాలు చేస్తూనే ఇబ్బందులు అధిగమించి ఇక్కడి వరకూ వచ్చాను. ఇదే పెద్ద విజయంగా అనిపిస్తోంది. జీవితంలో ఆర్గానిక్‌గా కొన్ని ఇబ్బందులు వస్తాయి. నేను ప్రతి చిన్న పనికీ యుద్ధమే చేయాల్సి వస్తుంది. నా జీవితంలో సంఘర్షణ భాగమైంది. అయినా సరే ఎంత బలంగా నిలబడగలమన్న దానిపైనే నా ఆలోచన ఉంటుంది.

టికెట్ల ధరలపై..

భీమ్లానాయక్ సినిమా విడుదల సమయంలో టికెట్లు రేట్లు తగ్గించినా.. ఇప్పుడు రేట్లు పెంచినా నిరుత్సాహం లేదు. భగవంతుడు ఏది ఇస్తే అది తీసుకోవడమే. నా సినిమాకు ప్రత్యేకించి ఇస్తే ఆనందించేవాడిని కాదు. టికెట్ల ధరలు అందరికీ పెంచారు. ఇలాంటి సమయంలో నాకు ఇవ్వకపోతే వివక్ష చేసినట్లు ఉంటుంది. అది కూడా తప్పవుతుంది. అందుకని దీనిని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదు.

నిర్మాతలు నష్టపోయారని..

నేను, నిర్మాతలు నష్టపోయాం. భగవంతుడు ఇచ్చేది రూపాయైనా దానితోనే సరిపెట్టుకోవాలని నిర్ణయించుకున్నాం. గత ప్రభుత్వంలో వాళ్లు ప్రత్యర్థుల ఆర్థిక మూలాల మీద దెబ్బకొట్టడం సహజం. మేం కూడా యుద్ధంలో దిగాం కాబట్టి దీనిని అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని వదిలేశాం. సినిమా విడుదల సందర్భంగా కొంత బాధ్యతతో వ్యవహరించాలి.

ఎమ్మెల్యేలకు చూపిస్తారా..?

ఆ ప్రతిపాదన ఇప్పటి వరకూ లేదు. కూటమి ఎమ్మెల్యేలు ప్రత్యేక షో అడిగితే వేస్తాను.

సీఎంగారిని పిలుస్తారా..?

ఆయన బిజీ. ఆయన సినిమాలు ఐదు నిమిషాలు చూస్తారేమో! రోజూ నన్నే చూస్తారు కదా..!

క్లైమాక్స్ డైరెక్ట్ చేశారా..?

ఒక సినిమా తీసేటప్పుడు రోజూ చాలా నలుగుతాం. ప్రతి ఒక్కరం పోరాటం చేస్తాం. సినిమా గ్లామర్‌గా కనిపిస్తుంది. నాకు చిరంజీవి గారి లాంటి అన్నయ్య ఉండి కూడా చాలా విజయాల తర్వాత జానీ సినిమా డైరెక్ట్ చేశాను. అది ఫస్ట్ షోలోనే పోయింది. బాగోలేదని అనగానే డిస్ట్రిబ్యూటర్లు మా ఇంటి మీదకు వచ్చేశారు. డబ్బులు వచ్చినప్పుడు నాకు ఎక్కువ ఇవ్వలేదు.. ఇప్పుడెందుకు ఇలా వచ్చారని అనిపించింది. ఆ రోజు నా రెమ్యునరేషన్ వెనక్కి ఇచ్చేశాను. దాని కోసం రూ.15 లక్షల అప్పు తీసుకున్నాను. జానీ ఫెయిల్యూర్ రాజకీయాల్లో ఉపయోగపడింది. 2019లో ఓడిపోతే ఆ సినిమాయే గుర్తుకొచ్చింది. జీవితంలో ఫెయిల్ ఒక పార్ట్. ఏఎం రత్నం(నిర్మాత)లాంటి వ్యక్తి ఈ రోజు సినిమా రిలీజ్‌లకు ఇబ్బంది పడుతుంటే చాలా బాధేసింది. అందుకే నేనే దగ్గరుండి ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లాలని నిర్ణయించాను. పాలిటిక్స్‌లో ఉన్నాను కాబట్టి సినిమాలు బాగా చేయడేమోనన్న సందేహం ఎక్కువ మందిలో ఉంటుంది. అందుకే ప్రత్యేక శ్రద్ధ పెట్టి చేశాను. యాక్షన్ కొరియోగ్రఫీ చేసి చాలా ఏళ్లయింది. క్లైమాక్స్ పార్ట్ నా మనస్సుకు చాలా దగ్గరగా ఉంటుంది. మా సినిమా మొత్తం ఎంటర్‌టైనర్. పార్ట్-2లో 20 శాతం షూటింగ్ పూర్తి చేశాం. ఇకపై సినిమాలు చేయాలా వద్దా అన్నది.. వచ్చే డబ్బులు, దొరికే సమయాన్ని బట్టి భగవంతుడు నిర్ణయిస్తాడు.

పెద్ద మనసుతో వదిలేద్దాం..

థియేటర్ల విషయంలో కొన్ని అనుకోని పరిస్థితులు వస్తాయి. పెద్ద మనస్సుతో వదిలేయడమే.

రాణాల క్షేత్రస్థాయి పరిశీలనకు అడ్వొకేట్ కమిషనర్

- ఏసీగా లాయర్ ఎంఆర్‌కే చక్రవర్తి నియామకం
- తనిఖీ కోసం పిటిషనర్ 6 పోలీస్ స్టేషన్లను సూచిస్తారు
- సీసీ కెమెరాలు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా తేల్చాలి
- పిల్‌పై ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు ధర్మాసనం

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్టేషన్ మొత్తం కనిపించేలా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సర్టిఫై చేస్తూ ఎస్‌డీపీవోలు(డీఎస్పీలు) నివేదిక ఇచ్చిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను తేల్చేందుకు న్యాయవాది ఎంఆర్‌కే చక్రవర్తిని అడ్వొకేట్ కమిషనర్‌గా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ సూచించిన ఆరు స్టేషన్లలో పర్యటించి సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా? లేదా? పరిశీలించి నివేదిక ఇవ్వాలని అడ్వొకేట్ కమిషనర్‌ను ఆదేశించింది. స్టేషన్‌లో మొత్తం ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు? అవన్నీ పనిచేస్తున్నాయా? ఫుటేజ్ స్టోర్ అవుతోందా? స్టేషన్ మొత్తం కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా? వంటి విషయాలను నివేదికలో పొందుపర్చాలని పేర్కొంది. తనిఖీల నిమిత్తం స్టేషన్‌కు వచ్చిన అడ్వొకేట్ కమిషనర్‌కు సహకరించాలని ఆయా జిల్లాల ఎస్పీలు, కమిషనర్‌లు, ఏసీలు, డీఎస్పీలు, ఎస్‌హెచ్‌వోలకు తేల్చిచెప్పింది. విచారణను ఆగస్టు 12కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు ధర్మాసనం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జూలై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాకపోవడంతో యోగేశ్ 2022లో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడు జిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారంటూ కటారు నాగరాజు గత ఏడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ఇటీవల విచారణకు రాగా స్టేషన్ మొత్తం కనిపించేలా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సర్టిఫై చేస్తూ ఎస్‌డీపీవోలు(డీఎస్పీలు) సమర్పించిన నివేదికలపై ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తేల్చేందుకు అడ్వొకేట్ కమిషనర్‌ను నియమిస్తామని, కొన్ని స్టేషన్ల పేర్లు సూచించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు రాగా న్యాయవాది తాండవ యోగేశ్ స్పందిస్తూ... వివిధ ఎస్‌డీపీవోల పరిధిలోకి వచ్చే 12 రాణాల పేర్లను కోర్టు ముందు ఉంచామన్నారు.



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

వారి వల్లే ఇది సాధ్యమైంది





'హరిహర వీరమల్లు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా దర్శకుడు క్రిష్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఇప్పుడు వీరమల్లు ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు. నిశ్శబ్దంగా కాదు, ఓ గొప్ప చరిత్రను మీకు పరిచయం చేయాలన్న ఆశయంతో. ఈ సినిమా ఇద్దరు లెజెండ్స్ వల్లే సాధ్యమైంది. వారు సినిమా విషయంలోనే కాదు నిజజీవితంలోనూ ఎందరికో స్ఫూర్తి. అందులో ఒకరు, పవన్‌కల్యాణ్. ఆయన ఓ అసాధారణమైన శక్తి. నిత్యం రగిలే అగ్నికణం. ఆయన లోని తపనని ఏ కెమెరా క్యాప్చర్ చేయలేదు. నిరంతరం స్ఫూర్తినిస్తుంటారు. ఈ చిత్రానికి వెన్నెముకలా నిలిచి ప్రాణం పోశారు. మరో వ్యక్తి ఏ.ఎమ్.రత్నం. ఎన్నో అద్భుతమైన భారతీయ చిత్రాల వెనకున్న శిల్పి ఆయన. ఈ సినిమా ఆయన దృఢ సంకల్పం వల్లే సాధ్యమైంది. ఈ చిత్రం నాకు చాలా ప్రత్యేకం. కేవలం దర్శకుడిగానే కాదు, మరిచిపోయిన చరిత్రను తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న వ్యక్తిగా. సంవత్సరాలుగా వేచి చూసిన సమయం ఆసన్నమైంది. ఇది అందరికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. పవన్‌కల్యాణ్, ఏ.ఎమ్.రత్నంలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రానికి మొదట క్రిష్ దర్శకత్వం వహించారు. కొన్ని కారణాల వల్ల ఆయన వైదొలగడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు.

పాతికేళ్ల ప్రయాణానికి గుర్తుగా




భారతీయ సినీ రంగంలో హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ ఇద్దరూ గొప్పస్టార్స్. వీరిద్దరినీ కలిపి ఒకే సినిమాలో నటింపచేసిన ఘనత యశ్‌రాజ్ సంస్థకే దక్కుతుంది. ఆ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న చిత్రం 'వార్ 2'. ఈ నెల 25న వార్ 2 ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు యశ్‌రాజ్ సంస్థ మంగళవారం తెలిపింది. '2025లో భారతీయ సినీ రంగానికి చెందిన ఇద్దరు గొప్ప స్టార్స్ తమ సినీ ప్రయాణంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నారు. ఇదొక లైఫ్ టైమ్ మూమెంట్. ఈ అరుదైన క్షణాలను మరింత గొప్పగా సెలబ్రేట్ చేసుకోవడానికి ఈ నెల 25న 'వార్ 2' ట్రైలర్‌ను విడుదల చేస్తున్నాం. ఇది ఇద్దరు గొప్ప స్టార్స్ మధ్య జరిగే అద్భుత పోరాటం' అని నిర్మాణసంస్థ పేర్కొంది. ఆగస్టు 14న ఈ చిత్రం విడుదలవుతోంది. కియారా అద్వాణీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.

థాంక్యూ.. మనోజ్!



ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖ నిరోషా ముఖ్య పాత్రల్లో తోట శ్రీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'థాంక్యూ డియర్'. మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బేనర్‌పై బాలాజీ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలె ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వి.వి.వినాయక్ లాంచ్ చేశారు. ఈ చిత్రంలోని 'చిక్కక చిక్కిన గుమ్మ' అంటూ సాగే తొలి గీతాన్ని హీరో మంచు మనోజ్ ఆవిష్కరించారు. ఈ పాటను చిత్ర నిర్మాత బాలాజీ రెడ్డి రాయగా, సుభాష్ ఆనంద్ సంగీత సారథ్యంలో శ్రీచరణ్ ఆలపించారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు ధనుష్ రఘుముద్రి, నిర్మాత బాలాజీ రెడ్డి, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

160 భాషల్లో 'అవతార్-3'



ప్రపంచవ్యాప్తంగా 'అవతార్' ఫ్రాంచైజీకు ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన 'అవతార్'... ప్రపంచ సినీ చరిత్రలో సంచలనం సృష్టించింది. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకూ రెండు భాగాలు విడుదలై ఘన విజయం సాధించాయి. తాజాగా మూడో భాగం 'అవతార్ - ఫైర్ అండ్ యాష్' నుంచి వరంగ్ పాత్ర ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈనెల 25న ట్రైలర్‌ని రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 2025 డిసెంబరు 19న ప్రపంచవ్యాప్తంగా 160 భాషల్లో 'అవతార్-3' విడుదల కానుంది. కాగా, 'అవతార్-4' 2029లో, 'అవతార్ -5' డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇదివరకే ప్రకటించింది.

తొలిసారిగా తెలుగులో



తమిళ డబ్బింగ్ చిత్రాలతో ఇన్నాళ్లుగా తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్నారు కమెడియన్ యోగిబాబు. ఇప్పుడు ఆయన తొలిసారి ఓ తెలుగు చిత్రంలో నటిస్తున్నారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తోన్న 'గుర్రం పాపిరెడ్డి' చిత్రంలో యోగిబాబు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఉడ్రాజు అనే పాత్రలో వినోదం పంచనున్నారు. మంగళవారం యోగిబాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. మురళీ మనోహర్ దర్శకత్వంలో వేణు సట్టి, అమర్ బురా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

యాక్షన్ థ్రిల్లర్



మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ హీరోగా జోషీ దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ థ్రిల్లర్ ప్రారంభం కాబోతోంది. మంగళవారం జోషి పుట్టినరోజు సందర్భంగా ఉన్ని ముకుందన్ ఫిల్మ్స్, ఐన్‌స్టీన్ మీడియా సంస్థలు ఈ కొత్త ప్రాజెక్టుని అనౌన్స్ చేశాయి. జాతీయ అవార్డు గెలుచుకున్న 'మెప్పడియాన్' తర్వాత వంద కోట్ల గ్రాస్ కలెక్షన్లతో దూసుకెళ్లిన 'మార్కో' వంటి సినిమా నిర్మించిన 'యూఎంఎఫ్' సంస్థ ఇప్పుడు జోషి లాంటి మాస్టర్ డైరెక్టర్‌తో చేతులు కలిపింది. దీంతో నిర్మాణానికి ముందే ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. హీరో ఉన్ని ముకుందన్ సరికొత్త లుక్‌లో, మాస్ యాక్షన్ అవతారంలో కనిపిస్తారని చిత్రబృందం పేర్కొంది.

పవన్‌పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణ.. ఆ రివిజన్ పిటిషన్‌కు నంబర్ కేటాయించండి

▸ రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వారాహి యాత్రలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యల విషయంలో ప్రాసిక్యూషన్ ఉపసంహరణను సవాల్ చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. వలంటీర్లు సేకరించిన సమాచారం అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్తోందని.. మహిళలు అపహరణకు గురవుతున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు తమ ప్రతిష్ఠకు భంగం కలిగించాయంటూ కొందరు వలంటీర్లు ఫిర్యాదు చేశారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో ఆయనపై ఐపీసీ సెక్షన్లు 499, 500 కింద గుంటూరు కోర్టులో క్రిమినల్ కేసు దాఖలు చేసింది. అయితే కేసు వేసేందుకు అఫిడవిట్లు ఇచ్చిన ఐదుగురు వలంటీర్లు.. వైసీపీ నేతలు తమ నుంచి సంతకాలు తీసుకుని పిటిషన్లు వేశారని వేరే అఫిడవిట్లు వేశారు. న్యాయాధికారి ముందు వాంగ్మూలం కూడా ఇచ్చారు. దీంతో పవన్‌పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంటూరు కోర్టులో పిటిషన్ వేశారు. గుంటూరు నాలుగో అదనపు జిల్లా జడ్జి.. అందుకు అనుమతిస్తూ గత ఏడాది నవంబరులో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సరళ, మరో ముగ్గురు వలంటీర్లు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌కు నంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ నిరాకరించడంతో తగిన ఉత్తర్వుల కోసం వ్యవహారం న్యాయమూర్తి వద్దకు వచ్చింది. రివిజన్ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు.. నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని మంగళవారం ఆదేశించారు.

ఓబీసీ నాన్ క్రీమీలేయర్ అర్హతపై కమిటీ

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఓబీసీల్లో నాన్ క్రీమీలేయర్ అర్హత కలిగిన వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. కమిటీకి జీఏడీ(సర్వీసులు) ప్రత్యేక ప్రధానకార్యదర్శి చైర్మన్‌గా, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సభ్యునిగా, బీసీ సంక్షేమశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శిని కన్వీనర్‌గా నియమించింది. ఓబీసీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పేస్కేల్‌ను, వారిలో నాన్ క్రీమీలేయర్ అర్హతను కమిటీ అధ్యయనం చేస్తుంది. జ్యుడీషియల్ అధికారుల పిల్లల నుంచి జిల్లా జడ్జీల పిల్లల వరకు క్రీమీలేయర్ విధానాన్ని ఎలా వర్తింపచేశారన్న విషయాన్ని పరిశీలిస్తుంది. బీసీ వర్గానికి చెందిన మంత్రులు సవిత, సత్యకుమార్, పార్థసారథి, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ తదితరుల విజ్ఞప్తి మేరకు ఈ కమిటీని నియమించారు.

రాష్ట్ర జల్‌జీవన్ కార్పొరేషన్ ఏర్పాటు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ పనులు కొనసాగించేందుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంపెనీల చట్టం-2013 కింద ఆంధ్రప్రదేశ్ జల్‌జీవన్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. కార్పొరేషన్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ వైస్ చైర్మన్‌గా, ఆర్థిక, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, పరిశ్రమల శాఖల ముఖ్యకార్యదర్శులు, జలవనరుల, అటవీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు డైరెక్టర్లుగా వ్యవహరించనున్నారు.

28న జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణం

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ఈ నెల 28న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. జస్టిస్ బట్టుదేవానంద్ 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2023 మార్చిలో మద్రాసు హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల సుప్రీం కోర్టు కొలీజియం జస్టిస్ దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టు నుంచి తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు.

ఎఫ్ఎస్‌వో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

▸ 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వంద ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో 70 కొత్త పోస్టులు, 30 క్యారీ ఫార్వార్డ్ పోస్టులు ఉన్నాయి. ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్ కింద ఈ ఉద్యోగాలు భర్తీ చేస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈనెల 28 నుంచి ఆగస్టు 17 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపింది. సెప్టెంబరు 7న రాత పరీక్ష జరుగుతుందని, మెయిన్స్ పరీక్ష తేదీలు త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

220 మంది గెస్ట్ ఫ్యాకల్టీ భర్తీకి అనుమతి

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యాశాఖలో కొత్తగా 220 మంది జూనియర్ లెక్చరర్లను గెస్ట్ ఫ్యాకల్టీగా తీసుకునేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 957 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్నారు. ఇంకా 220 మంది జేఎల్స్ అవసరమని ఇంటర్ విద్యామండలి కోరడంతో ప్రభుత్వం అందుకు అనుమతిచ్చింది.

2230 లీటర్ల స్పిరిట్ స్వాధీనం

▸ 36 మంది అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న 2230 లీటర్ల అక్రమ స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. జూన్ 23 నుంచి జూలై 22 వరకు నెల రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక చర్యలతో అనేక అక్రమాలకు అడ్డుకట్ట వేసినట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. పశ్చిమగోదావరి, అనకాపల్లి, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో పలు దాడులు జరిపి.. నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే ఖాళీ సీసాలు, సీలింగ్ యంత్రాలు, లేబుళ్లు, మిషన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించింది. తెలంగాణలోని మేడ్చల్ జిల్లాలో ఉన్న కృష్ణ ఫార్మా కంపెనీ కేంద్రంగా ఈ అక్రమాలు కొనసాగాయని పేర్కొంది. ఆ కంపెనీ యజమాని మల్లికార్జునరావు, రుత్తల శ్రీనివాస్, చరణ్జీత్ సింగ్ సహా మొత్తం 36 మందిని అరెస్టు చేశామని తెలిపింది.

ఉద్యోగాల్లో స్థానిక కోటా పెంచాలి

▸ సీఎంకు నిరుద్యోగ జేఏసీ వినతి



అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికత కోటాను 70 శాతం నుంచి 95శాతానికి పెంచాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో స్థానికులకు 95శాతం, స్థానికేతరులకు 5శాతం కోటాలు అమలుచేస్తున్నారని సీఎంకు వివరించారు. కానీ, రాష్ట్రంలో ఇంకా 70:30 నిష్పత్తి కొనసాగుతోందన్నారు. దీనివల్ల స్థానికులకు నష్టం జరుగుతోందని వివరించారు. అలాగే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మెగా డీఎస్సీ నిర్వహించినందుకు, 6100 కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు, రేపు భారీ వర్షాలు

▸ ఉత్తర బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఉత్తర కోస్తా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కేంద్రీకృతమైంది. దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో విస్తరించిన తూర్పు, పడమర ద్రోణి ఉత్తర దిశగా పయనించి కోస్తాంధ్ర మధ్య ప్రాంతాల్లో కొనసాగుతోంది. వీటి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. కాగా, బుధవారం ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనున్నది. దాని ప్రభావంతో 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే 48 గంటల్లో కోస్తా, సీమల్లో పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

భారీగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



స్పిల్‌వే నుంచి విడుదలవుతున్న వరద

పోలవరం నుంచి దిగువకు 1,33,288 క్యూసెక్కులు విడుదల

పోలవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం భారీగా పెరుగుతోంది. ఉప నదులు, కొండవాగుల నుంచి వరద భారీగా వచ్చి చేరుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి వచ్చిన 1,33,288 క్యూసెక్కుల గోదావరి వరదను స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. స్పిల్‌వే ఎగువన 27.430 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.500 మీటర్లు నీటిమట్టం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

కృష్ణమ్మ పరవళ్లు

▸ దిగువకు 27,478 క్యూసెక్కుల విడుదల

▸ విద్యుదుత్పాదనతో మరో 67,185 క్యూసెక్కులు

▸ జూరాల, సుంకేసుల నుంచి వరద

▸ డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వ 208 టీఎంసీలు

▸ నాగార్జునసాగర్‌లో 255 టీఎంసీలు

శ్రీశైలంలో ఓ గేటెత్తిన అధికారులు



శ్రీశైలం జలాశయంలో ఒక గేటు ఎత్తి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల/అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా.. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో.. ప్రధాన రిజర్వాయర్లలోకి వరద జలాలు భారీగా వచ్చి చేరుతున్నాయి. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ శ్రీశైలం జలాశయాన్ని దరిదాపుగా నింపేసింది. దీంతో ఎస్ఈ రామచంద్రమూర్తి.. ఆలయ ఈవో శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం ఒక రేడియల్ క్రస్ట్ గేట్‌ను పదడుగుల మేర ఎత్తి 27,478 క్యూసెక్కులు దిగువన నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. కుడి, ఎడమ భూగర్భ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పాదనతో 67,185 క్యూసెక్కులను వదిలారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి శ్రీశైలంలోకి 88,623 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం నీటి మట్టం మంగళవారం సాయంత్రం 6 గంటలకు 883.70 అడుగులుగా, నీటి లభ్యత 208.28 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంతో ఆ ప్రాంతం సందర్శకులతో నిండిపోయింది.

14 శాతం తక్కువ వర్షపాతం

మరోవైపు.. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భజలాలు పడిపోయాయి. వర్షపాతం 14 శాతం (సుమారు 168 టీఎంసీలు) తక్కువగా నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 0.18 శాతం, ఏలూరు- 1.61 శాతం, బాపట్ల-1.34 శాతం, పల్నాడు-4.07 శాతం, ప్రకాశం-4.74 శాతం, నెల్లూరు జిల్లాలో 0.35 శాతం తక్కువగా వానలు కురిశాయి. రాయలసీమ జిల్లాలన్నింటిలోనూ 2.29 శాతం తక్కువగా వర్షపాతం రికార్డయింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 110 చిన్న , మధ్య, భారీ జలాశయాల్లో 66.84 శాతం మేర 667.64 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. రాష్ట్రంలోని 38,456 చెరువుల్లో 206.62 టీఎంసీలకు గాను 69.7 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని భారీ జలాశయాల్లో 865.64 టీఎంసీల నీటి నిల్వకు గాను 56 శాతం మేర 610.78 టీఎంసీల నిల్వ ఉంది. ఇంకా 254.86 టీఎంసీల వరద రావలసి ఉంది. మధ్యతరహా ప్రాజెక్టుల్లో 137.08 టీఎంసీలకు గాను 41.28 శాతం (56.58 టీఎంసీలు) అందుబాటులో ఉంది.

ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వ.. (మంగళవారం సాయంత్రానికి..)

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	129.72	101.03	49,551	51,100
జూరాల	9.66	7.68	78,659	61,344
తుంగభద్ర	100.86	79.4	36,539	39,610
శ్రీశైలం	215.81	208.28	88,623	89,959
నాగార్జునసాగర్	312.05	255.31	65,211	7,243
పులిచింతల	45.77	19.37	23,340	400
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	11,760	11,760

సహజ ప్రసవాల పెంపునకు 'మిడ్‌వైవ్స్'

▸ 86 ప్రభుత్వాసుపత్రుల్లో 1,264 మందికి ప్రసూతి సహాయకుల నియామకం

▸ ఒక్కొక్కరికీ శిక్షణకు 2.50 లక్షల వ్యయం: మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ దిశగా సుశిక్షితులైన మిడ్‌వైవ్స్ ద్వారా సహజ ప్రసవాల్ని ప్రోత్సహించే పథకానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ప్రసవ సమయాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోని స్టాఫ్ నర్సులే ప్రసూతి సేవల్ని అందిస్తున్నారు. వీరికి వివిధ అంశాలపై తగిన పరిజ్ఞానం, శిక్షణ కొరవడటంతో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ లోటును తీర్చేందుకు ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు 18 నెలల పాటు ప్రసవానికి ముందు, ప్రసవ సమయం, ప్రసవానంతర సేవలకు సంబంధించిన అంశాలపై సమగ్ర శిక్షణ అందించి మహిళలు సహజ ప్రసవాల పట్ల మొగ్గు చూపేలా ఈ ప్రత్యేక పథకాన్ని రూపొందించారు. తొలి విడతలో సంవత్సరానికి 600 నుంచి 6 వేలకు పైగా ప్రసవాలు జరుగుతున్న 86 ప్రభుత్వాసుపత్రుల్లో సుశిక్షితులైన 1,264 మంది ప్రసూతి సహాయకుల్ని నియమిస్తారు. వారు వివిధ సమయాల్లో అందించాల్సిన సేవలు, విధులపై సమగ్ర జాబ్‌చార్టును రూపొందించి ప్రసూతి సేవల నాణ్యతను ఈ పథకం కింద పెంచుతారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో జాతీయ ఆరోగ్య మిషన్ కింద అమలయ్యే ఈ పథకానికి సంబంధించిన పలు అంశాల్ని లోతుగా చర్చించి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన ప్రతి స్టాఫ్ నర్సుకు 18 నెలల పాటు సమగ్రమైన శిక్షణ అందించడానికి స్టైఫండ్‌తో కలిపి రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం ప్రసవాల్లో 56.12 శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగినట్లు సమాచారం. ఇందులో ప్రభుత్వాసుపత్రుల్లో జరిగిన ప్రసవాల్లో 41.40 శాతం సిజేరియన్లు కాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 67.71 శాతం మేరకు సిజేరియన్ ప్రసవాలు జరిగాయి.

అమిత్ షాతో మాధవ్ భేటీ

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ భేటీ అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా మంగళవారం షాను పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ భేటీలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు వివరించిన ఆయన పార్టీ బలోపేతానికి గురించి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతోనూ మాధవ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఏపీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి శ్రీనివాసవర్మ, మాధవ్ చెప్పారు.

మోహన్‌బాబు కేసులో తీర్పు రిజర్వ్

కోడ్ అమల్లో ఉండగా ధర్నాపై సుప్రీంకోర్టులో ముగిసిన వాదనలు

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన కేసులో తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. తన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ 2019లో తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిపై విద్యార్థులతో ఆయన ధర్నా నిర్వహించారు. అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మోహన్‌బాబు, ఆయన కుమారులు విష్ణు, మనోజ్, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై కేసు కొట్టివేయాలని కోరుతూ ఈ ఏడాది మార్చి 30న మోహన్‌బాబు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట ఆ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ప్రభుత్వం నుంచి విద్యాసంస్థలకు అందాల్సిన బిల్లులు రావడం లేదని నిరసన తెలిపితే, కోడ్ ఉల్లంఘన కేసు పెట్టారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది ప్రేరణ సింగ్ బదులిస్తూ.. ఆ ధర్నా వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిందన్నారు. నిరసనలో ఎంతమంది పాల్గొన్నారని జస్టిస్ నాగరత్న ప్రశ్నించగా.. కొంతమందని ప్రేరణ సింగ్ చెప్పారు. దీంతో జస్టిస్ నాగరత్న అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుందని, ఏవేవో సెక్షన్ల కింద కేసులెలా నమోదు చేస్తారని అన్నారు. తీర్పును రిజర్వ్ చేశారు. ఇదే కేసులో తిరుపతిలోని ట్రయల్ కోర్టుకు మోహన్‌బాబు తప్పనిసరిగా విచారణకు హాజరవ్వాలని గత విచారణలో సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిందని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా, ఆ కేసు విచారణ ఎప్పుడుందని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. గురువారమే ఉందని న్యాయవాది బదులిచ్చారు. దీంతో ఇరుపక్షాలూ ఏమైనా ఉంటే ఈ నెల 25లోపు రాతపూర్వకంగా సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

క్వార్ట్జ్ కేసులో అనిల్ పేరు!


అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డి అరెస్టు..వాంగ్మూలం

మాజీ మంత్రిని నిందితునిగా చేర్చిన పోలీసులు!

కాకాణి సహా 12 మంది ఇప్పటికే అరెస్టు

నెల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత అనిల్‌కుమార్ యాదవ్‌ను పోలీసులు నిందితుడిగా చేర్చినట్లు తెలిసింది. ఈ కేసులో ఏ12గా ఉన్న ఆయన అనుచరుడు, వైసీపీ నేత బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఆయన్నుంచి కీలక ఆధారాలను సేకరించారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల వ్యవహారంలో అనిల్‌కుమార్‌కు ప్రమేయం ఉందని శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించినట్టు తెలిసింది. దీని ఆధారంగా.. అనిల్ పేరును కూడా కేసులో చేర్చినట్టు తెలిసింది. అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని గూడూరు కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌పై జైలుకు తరలించారు. కాగా, శ్రీకాంత్‌రెడ్డి అరెస్టు సందర్భంగా రికార్డు చేసిన మహాజరునామా(వాంగ్మూలం) సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. అందులో ఏముందంటే.. "మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లకు నేను ముఖ్య అనుచరుడిని. వారి వ్యాపార లావాదేవీల్లో పాల్గొన్నాను. క్వార్ట్జ్‌కు మంచి డిమాండ్ ఉండడంతో నెల్లూరు జిల్లా పొదలకూరు, సైదాపురం, తిరుపతి జిల్లా గూడూరు ప్రాంతాల్లో క్వార్ట్జ్‌ను అనధికారికంగా తవ్వాలని నేను, గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్ 2023 ఆగస్టులో మాట్లాడుకున్నాం. (వైసీపీ) ప్రభుత్వం మనదే కాబట్టి లైసెన్స్ లేకుండా మైనింగ్ చేస్తే ఇబ్బందులు ఉండవనుకున్నాం. తాటిపర్తి దగ్గర్లో ఉన్న రుస్తుం మైన్స్ లీజు అయిపోయిందని తెలుసుకున్నాం. 2023 అక్టోబరు, నవంబరు నెలల్లో రుస్తుం మైన్స్‌లో తవ్వకాలు జరిపి క్వార్ట్జ్‌ను బయటకు తీయమని పొదలకూరుకు చెందిన వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులు రెడ్డిలను కాకాణి పురమాయించారు. తవ్వి తీసిన క్వార్ట్జ్‌ను గ్రేడింగ్ చేసి కొందరు వ్యక్తుల సహకారంతో చెన్నై పోర్టు ద్వారా చైనాకు ఎక్స్‌పోర్ట్ చేశాం. రుస్తుం మైన్‌లో బ్లాస్టింగ్ చేయడానికి మార్టూరు ప్రాంతం నుంచి పేలుడు పదార్థాలు తెప్పించాం. ఈ వ్యవహారాలు చూసుకున్నందుకు నాకు టన్నుకు రూ.వెయ్యి ఇచ్చేవారు. అంతకుముందే 2022 నుంచి నేను, అనిల్ కుమార్ కలిసి గూడూరు, వెంకటగిరి, చిల్లకూరు, సైదాపురం మండలాల్లో ఇసుక, క్వార్ట్జ్ మైనింగ్ చేయిస్తూ, క్వార్ట్జ్‌ను ఎక్స్‌పోర్ట్ చేయించేవాళ్లం. ఒక్కో టన్నుకు రూ.7 వేల నుంచి రూ. 10 వేల వరకూ మామూళ్లు తీసుకున్నాం. ఇతర ఎక్స్‌పోర్టర్స్ ఎవరైనా చెల్లించకపోతే వారికి ఫోన్లు చేసి కేసులు పెట్టిస్తామని బెదిరిస్తూ వసూళ్లు చేశాం. 2024 మార్చి వరకూ వచ్చిన ఈ మామూళ్ల డబ్బుతో నేను, అనిల్‌కుమార్ గూడూరు వద్ద 100 ఎకరాల భూమి కొనుగోలు చేసి గ్రీన్‌మిడోస్ పేరుతో, నాయుడుపేట వద్ద 50 ఎకరాలు కొని స్వర్ణముఖి స్మార్ట్ సిటీ పేరుతో వెంచర్లు వేశాం. హైదరాబాద్‌లో మణికొండ వద్ద హెవెన్లీ హోమ్స్ పేరుతో, తర్కేంజల్ వద్ద గ్రీన్ మిడోస్ పేరుతో హౌసింగ్ కన్‌స్ట్రక్షన్స్ చేశాం. 2024లో ప్రభుత్వం మారాక క్వార్ట్జ్ తవ్వకాలపై కేసులు పెడతారన్న భయంతో నేను కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటున్నాను" అని తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో కాకాణి 2 నెలలుగా రిమాండ్‌లో ఉన్నారు. త్వరలోనే అనిల్‌నూ అరెస్టు చేస్తారని ప్రచారం జరుగుతోంది.





మహాజరునామా

2025 సంవత్సరం జూలై నెల 21 వ తేది రాత్రి 09.30 గంటలకు నెల్లూరు సిటీ మూలాపేట లోని నెల్లూరు రూరల్ DSP గారి ఆఫీసు వద్ద పొదలకూరు పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 24/2025 U/sec 120(b), 447, 427, 379, 290, 506, 109 r/w 34 IPC, Sec 3 of PDPP Act, Sec 3, 5 & 6 of ES Act-1908, Sec 21(1), 21(4) of MMDR Act & Sec 3(1)(r), 3(2)(va), 3(2)(iii) of SC/ST (POA) Act – 2015 కేసు లో A-12 ముద్దాయి అయిన బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి ని విచారించు సమయంలో ఈ దిగువ సంతకములు చేయు మధ్యవర్తులమైన మా సమక్షం లో జరిగిన సంగతులకు గాను వ్రాయబడిన మహాజరునామా.

మధ్యవర్తులు:-

1) వీలం శ్రీనివాసుల రెడ్డి S/o లేట్ చిన్న హనుమా రెడ్డి, వయస్సు: 39 సం, రెడ్డి కులం, తాటిపర్తి గ్రామం, పొదలకూరు మండలం. గ్రామ రెవిన్యూ అధికారి, తాటిపర్తి గ్రామం, పొదలకూరు మండలం. Ph: 9866658853.

2) సిద్దం పుల్లయ్య S/o. లేట్ వెంకటయ్య, వయస్సు 49, SC మాల కులం, పొదలకూరు మండలం. VRO, తాటిపర్తి – 1, పొదలకూరు గ్రామం, పొదలకూరు మండలం. Ph: 9908021932.

తేది 21.07.2025 న పైన తెలిపిన గంటలకు ముందు నెల్లూరు రూరల్ DSP శ్రీ జి. శ్రీనివాస రావు గారు పొదలకూరు పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ శ్రీ SK. MD. ... గారి ద్వారా పైన తెలిపిన మమ్ములను పై ప్రకారం ... పొదలకూరు పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 24/2025 U/sec 120(b), 447, 427, 379, 290, 506, 109 r/w 34 IPC, Sec 3 of PDPP Act, Sec 3, 5 & 6 of ES Act-1908, Sec 21(1), 21(4) of MMDR Act & Sec 3(1)(r), 3(2)(va), 3(2)(iii) of SC/ST (POA) Act – 2015 కేసు యొక్క వివరాలు మాకు తెలియపరిచి, సదరు కేసు లో ముద్దాయిని నెల్లూరు రూరల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మరియు వారి సిబ్బంది తెలంగాణా రాష్ట్రము, మణికొండ లో అతను నివాసం ఉంటున్న అపార్ట్మెంట్ నుంచి తీసుకొని వచ్చి తమకు అప్పగించినారు అని, సదరు ముద్దాయిని విచారించు సమయంలో మమ్ములను మధ్యవర్తులుగా వ్యవహరించమని కోరగా, అందుకు మేము అంగీకరించినాము. అంతట నెల్లూరు రూరల్ DSP గారు మమ్ములను వారి ఆఫీసర్ రూమ్ లోనికి తీసుకొని వెళ్ళినారు, అక్కడ వయస్సు సుమారు 54 – 56 సంవత్సరాలు వున్న ఒక మగ వ్యక్తి ఉండినాడు. అంతట నెల్లూరు రూరల్ DSP గారు మా సమక్షం లో సదరు వ్యక్తి ని అతని పేరు, వివరాలు అడుగగా, అందుకు అతను తన పేరు "బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి S/o రామి రెడ్డి, వయస్సు 55 సం, రెడ్డి కులం, పొవని టవర్స్, SRK స్కూల్ దగ్గర, మాగుంట లేఔట్, నెల్లూరు, నెల్లూరు జిల్లా, ప్రస్తుతం ఫ్లాట్ నెం. 214, C Block, Anuhr Nature Walk, Road No. 25, Alkapur Township, మణికొండ, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం" అని చెప్పినాడు. అంతట నెల్లూరు రూరల్ DSP గారు మా సమక్షం లో సదరు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి ని ఈ కేసు లో అతని పాత్ర గురించి ... ప్రశ్నించగా అందుకు సదరు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి ఈ క్రింది విధంగా చెప్పినాడు.

సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వైసీపీ నేత శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలం ఇదే...

ఎక్సైజ్ కేసులో కాకాణికి ముగిసిన పోలీసు కస్టడీ

నెల్లూరు (క్రైం), జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపు నుంచి అక్రమంగా లిక్కర్ తరలింపు కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండ్రోజుల క్సైజ్ పోలీసు కస్టడీ మంగళవారం ముగిసింది. కోర్టు ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు సోమవారం ఆయన్ను కస్టడీకి తీసుకుని మొత్తం 62 ప్రశ్నలు అడగ్గా ఒక్క ప్రశ్నకు కూడా ఆయన స్పష్టంగా చెప్పలేదని తెలిసింది. అన్నిటికీ నాకు తెలియదు, సంబంధం లేదనే ఆయన చెప్పినట్లు సమాచారం. కస్టడీ ముగిసిన తర్వాత గూడూరు కోర్టులో కాకాణిని ఎక్సైజ్ పోలీసులు హాజరు పరిచి అక్కడి నుంచి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

శవం డోర్ డెలివరీ కేసును మళ్లీ విచారించండి

▸ రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు



కారులో సుబ్రహ్మణ్యం మృతదేహం (ఫైల్)

రాజమహేంద్రవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడైన తన కారు డ్రైవర్‌ను హత్యచేసి, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కేసును మరోసారి, మరింత లోతుగా విచారించాలని రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు ఆదేశించింది. 90 రోజుల్లో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయాధికారి సింగవరపు ఉమా సునంద మంగళవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను నియమించింది. కోర్టు మరింత లోతైన విచారణ జరపాలని తీర్పు ఇవ్వడంతో సిట్ అధికారులు రంగంలోకి దిగనున్నారు. 2022, మే 5న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు.. దళిత యువకుడు, తన వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసిన వీధి సుబ్రహ్మణ్యాన్ని దారుణంగా హత్య చేసి, శవాన్ని డోర్ డెలివరీ చేశారు. అయితే, అప్పుడు వైసీపీ అధికారంలో ఉండడంతో ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో పోలీసులు కేవలం అనంతబాబు మీదే చార్జిషీట్ దాఖలు చేశారు. అయితే సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలన్నీ వెలుగు చూస్తాయని న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సుబ్రహ్మణ్యం తల్లి.. నాటి టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్.. అప్పటి డీజీపీకి, కాకినాడ ఎస్పీకి విన్నవించారు. ఈ ఏడాది ఏప్రిల్ 24న కేసు విచారణకు ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఎమ్మెల్సీ అనంతబాబు మధ్యంతర బెయిల్‌పై బయటఉండడంతో తదుపరి విచారణకు అనుమతి ఇవ్వవలసిందిగా ప్రాసిక్యూషన్(సిట్) కోర్టును కోరింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన న్యాయ సలహాదారు ముప్పాళ్ల సుబ్బారావు న్యాయసలహా ఇవ్వగా, పీపీలు కె. రాధాకృష్ణ. డి. శ్రీవాణి వాదనలు వినిపించారు.

ఎవరూ తప్పించుకోలేరు

▸ ముప్పాళ్ల సుబ్బారావు

దళిత డ్రైవర్‌ను హత్యచేసి, శవాన్ని డోర్ డెలివరీ చేసిన కేసులో ఎవరూ తప్పించుకోలేరని న్యాయ సలహాదారు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు ఆయనకు సహకరించిన వారికి శిక్ష పడుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అనంతబాబును కాపాడడానికి శక్తివంచన లేకుండా పనిచేసిందని.. కానీ ప్రజా న్యాయపోరాటాల వల్ల కేసు మళ్లీ విచారణకు వచ్చిందన్నారు. ఆనాటి కాకినాడ ఎస్పీ, ఇతర అధికారులు ప్రభుత్వానికి అనుకూలంగా అనేక తప్పిదాలు చేశారని ఆరోపించారు.

ప్రమాదం అంచుల్లో జీవన పోరాటం



వంద అడుగుల కంటే ఎత్తులో కరెంటు తీగలపై కూర్చున్న ఇద్దరిని చూశారా? చూస్తుంటూనే గుండెలు జల్లుమనడం లేదా? అయితే ఈ కార్మికులకు ఇది నిత్యకృత్యం. రాజధాని అమరావతిలో ప్రాంతంలో ఉన్న ఈ హైటెన్షన్ విద్యుత్ సరఫరా తీగలను అక్కడి నుంచి తరలించే పని ముమ్మరంగా సాగుతోంది. ఆకాశమంత ఎత్తులో విద్యుత్ తీగలను తరలించే పనిలో నిమగ్నమైన కార్మికులు.



నో అడ్మిషన్స్.. బోడపాడు ఎంపీపీ పాఠశాల ఫుల్

"ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున పిల్లల్ని చేర్చండి. పాఠశాలల వద్ద 'నో అడ్మిషన్స్' బోర్డులు కనిపించాలి"... ఇదీ విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆశయం... ఆలోచన. దీనినే ఆచరణలో చూపించింది ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని బోడపాడు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల. ఈ స్కూలులో ఈ ఏడాది పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరారు. ఎంతగా అంటే.. పాఠశాల ముందు 'నో అడ్మిషన్' బోర్డు ఏర్పాటు చేసేంతగా!. ఇక్కడ గతంలో 72 మంది విద్యార్థులు ఉండేవారు. ఈ ఏడాది కొత్తగా 64మంది చేరారు. దీంతో మొత్తం విద్యార్థుల సంఖ్య 136కు చేరింది. తమ గ్రామంలో 1-5 తరగతుల పిల్లలెవరూ ప్రైవేటు స్కూళ్లకు వెళ్లరని గ్రామస్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. నో అడ్మిషన్ బోర్డు పెట్టడంతో సుమారు 100 మంది వెనక్కి వెళ్లిపోయారని హెచ్ఎం జాక్, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. **- మార్కాపురం రూరల్, ఆంధ్రజ్యోతి**

అలా కాదు.. ఇలా చేయండి!

▸▸ ఎమ్మెల్యేలకు బాబు దిశానిర్దేశం.. వారితో కొనసాగుతున్న భేటీలు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మంచీచెడులు చర్చిస్తూ.. తన వద్ద ఉన్న నివేదికల ఆధారంగా టీడీపీ ఎమ్మెల్యేల పనితీరును విశ్లేషిస్తూ వారితో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహిస్తున్న భేటీలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 18 మంది ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించారు. ఉత్తమ పద్ధతులు ఆచరిస్తున్న ప్రజాప్రతినిధుల నుంచి ఆ వివరాలూ తీసుకుంటున్నారు. బాగా చేస్తున్నారంటూ అభినందిస్తున్నారు. సుమారు గంట పాటు జరుగుతున్న భేటీల్లో ప్రతి అంశాన్నీ వివరించి సరిచేసుకోవాల్సిన అంశాలను నిర్మొహమాటంగా వివరిస్తున్నారు. ఓ మంత్రితో భేటీలో.. 'తొలిసారి ఎమ్మెల్యేవైనప్పటికీ యువకులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మంత్రి పదవి ఇచ్చాను. కానీ మీ పనితీరు ఆశించిన స్థాయిలో లేదు. మీది కీలకమైన నియోజకవర్గం.. ప్రత్యర్థి కూడా బలమైనవాడే. అలాంటిచోట మరింత సమర్థంగా పనిచేయకపోతే చాలాకష్టం. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు మన వ్యక్తిగత వ్యవహార శైలిని కూడా మార్చుకోవాలి. లేకుంటే రాజకీయంగా చాలా ప్రభావం పడుతుంది' అని చంద్రబాబు వివరించారంటే ఆయన క్షేత్రస్థాయి నుంచి ఎంత పకడ్బందీగా వివరాలు తెప్పించుకుంటున్నారో అర్థమవుతోంది. సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలకూ మినహాయింపు లేదు. వారి ప్లస్సులు.. మైనస్సులనూ సీఎం వివరిస్తున్నారు. మంగళవారం నరసరావుపేట, పాతపట్నం ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, మామిడి గోవిందరావుతో సమావేశమయ్యారు.

తోతాపురికి కేంద్రం మద్దతు

▸▸ 260 కోట్లు విడుదల... ముందుగానే భరించిన రాష్ట్రం: పెమ్మసాని



న్యూఢిల్లీ, అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'తోతాపురి మామిడి రైతులను ఆదుకోవడానికి కిలోకు రూ.4 చొప్పున మొత్తం రూ.260 కోట్లు విడుదల చేయడమన్నది రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మక నిర్ణయం. ఇందులో రాష్ట్రం భరించిన రూ.130 కోట్లను కేంద్ర ప్రభుత్వం తిరిగి చెల్లించేలా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా చర్యలు తీసుకోగలిగాం' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. 'తోతాపురి మామిడి పంటకు తొలిసారి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్(ఎంఐఎస్) అమలు చేయడం ద్వారా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి మద్దతు ఇచ్చాయి. ఈ స్కీమ్ ప్రకారం ఖర్చులో 50% కేంద్రం, 50% రాష్ట్రం భరించాలి. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఇచ్చిన రూ.130 కోట్లను కేంద్రం తిరిగి చెల్లించేందుకు ఆదేశాలు వెలువడ్డాయి' అని పెమ్మసాని అన్నారు.

క్వింటా 1,490: మంత్రి అచ్చెన్న

తోతాపురి మామిడి క్వింటా రూ.1,490గా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మామిడి రైతులకు ఇచ్చే సబ్సిడీలో 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళా భద్రత, చట్టాలపై సమగ్ర అవగాహన అవశ్యం: శైలజ



నంద్యాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలు రూపొందించింది. వాటిపై ప్రతి ఒక్కరూ సమగ్ర అవగాహన కలిగి ఉండాలి' అని రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మంగళవారం ఆమె నంద్యాల జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ... 'మహిళలపై సంఘటనలు జరిగినప్పుడే కాకుండా అనునిత్యం అప్రమత్తంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సీమ జిల్లాలో విద్యార్థులకు మహిళా భద్రతా, సాధికారితపై అవగాహన కల్పిస్తున్నాం. వెలిగొండలో బాలికపై జరిగిన ఘటనను సుమోటోగా తీసుకున్నాం. రాష్ట్రంలో ఎక్కడో ఏదో జరిగితే వెంటనే ప్రభుత్వానికి అంటగట్టడం సరికాదు' అని శైలజా అన్నారు.

ప్రజల్లో చంద్రబాబు... ప్యాలెస్‌లో జగన్: అనగాని



తిరుపతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'సీఎం హోదాలో చంద్రబాబు 13 నెలల్లో 56 సార్లు ప్రజాహితం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గతంలో జగన్ ప్యాలెస్‌కే పరిమితమయ్యారు. ప్రజల్లోకి రావాల్సిన సందర్భం తప్పనిసరైతే పరదాలు కట్టుకునే పరిస్థితి' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతిలో మంగళవారం జరిగిన స్వచ్ఛత విజయోత్సవ సభలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. వైసీపీ నేతల్లా రాష్ట్రాన్ని దోచుకోలేదు. 2019లో టీడీపీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే నలుగురు పార్టీ మారారు. మిగిలిన వాళ్లం అసెంబ్లీకి వచ్చేవాళ్లం. ఇప్పుడు 11 మంది ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాలేకపోతున్నారు. పులివెందుల ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే, ప్రజాహితం కోసం మాట్లాడాలి అనుకుంటే అసెంబ్లీకి రావాలి' అన్నారు.

తనదాకా వస్తే!?

సీనియర్లతో జగన్ వరుస భేటీలు.. మిథున్ అరెస్టుతో ఉలికిపాటు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మద్యం కుంభకుణంపై 'సిట్' దర్యాప్తును తొలుత లైట్‌గా తీసుకున్న జగన్ శిబిరంలో ఇప్పుడు కలవరం మొదలైంది. రాజ్ కసిరెడ్డి మొదలుకుని... మిథున్ రెడ్డి వరకు అనేకమంది జగన్ సన్నిహితులు అరెస్టయ్యారు! ప్రాథమిక చార్జిషీట్‌ను చూస్తే 'తనదాకా రావడమూ' ఖాయమని జగన్ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో... భవిష్యత్ కార్యాచరణ, పార్టీ కేడర్‌లో స్థైర్యం నింపడంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ పార్టీసీనియర్లతో వరుసభేటీలు జరుపుతున్నారు.

పక్కాగా లాగుతున్న సిట్

'మద్యంలో స్కామే లేదు' అంటూ జగన్ ఇన్నాళ్లూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే 'సిట్' అత్యంత పకడ్బందీగా దర్యాప్తు జరుపుతూ, అనేక సాంకేతిక ఆధారాలతో నిందితుల చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. తొలి చార్జిషీట్‌లో మాజీ సీఎం జగన్ పేరును ప్రస్తావించారు. దీంతో ఏ క్షణానైనా ఆయనను అరెస్టు చేస్తారన్న అభిప్రాయానికి తాడేపల్లి ప్యాలెస్ వచ్చేసిందని సమాచారం. కేవలం స్టేట్‌మెంట్లతో కేసు నిలబడదంటూ పార్టీ ముఖ్యనేతల నుంచి కార్యకర్తలదాకా జగన్ భరోసా ఇస్తూ వచ్చారు. కానీ, పక్కా సాంకేతిక ఆధారాలతో రాజ్ కసిరెడ్డి నుంచి మిథున్‌రెడ్డి వరకు.. అందరినీ సిట్ అదుపులోకి తీసుకుని జైలుకు పంపించింది. దీంతో జగన్‌లో ధీమా పూర్తిగా సడలిపోయిందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరీ ముఖ్యంగా మిథున్ రెడ్డి అరెస్టు తర్వాత కలవరం మరింత పెరిగింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసీపీలో సీనియర్ నాయకుడు. జగన్ వైసీపీ స్థాపించిన నాటి నుంచీ ఆయన కుటుంబం జగన్ వెంట నిలిచింది. అందులోనూ... జగన్‌కు మిథున్ రెడ్డి వ్యక్తిగతంగానూ సన్నిహితుడు. మిథున్ అరెస్టుపై పార్టీ నుంచి తగిన స్థాయి స్పందన కనిపించలేదని పెద్దిరెడ్డి కుటుంబం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మిథున్‌కు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినా పెద్దగా ఫలితం కనిపించలేదు. చివరికి... పెద్దిరెడ్డికి చెందిన ఉమ్మడి చిత్తూరులోనూ అదే పరిస్థితి. ఈ పరిణామం పరిస్థితి ఇలాగే కొనసాగితే కేడర్‌లో స్థైర్యం దెబ్బతింటుందనే అంచనా ఒకవైపు...'సిట్' తనదాకా వచ్చినా ఇంతేనా అనే ఆందోళన మరోవైపు! దీంతో భవిష్యత్ కార్యాచరణపై సీనియర్లతో జగన్ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

'వర్కవుట్ కాదు సర్'

మిథున్ అరెస్టుతో ఆగకుండా 'సిట్' మరింత ముందుకు వెళ్లే అవకాశముండటంతో... 11 మంది ఎమ్మెల్యేలతో మూకుమ్మడి రాజీనామాలు చేయించాలని జగన్ ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ ఆలోచనను ఆయన కొందరు ముఖ్యనేతల వద్ద ఉంచారు. అయితే.. ఈప్రతిపాదనను సగం మంది ఎమ్మెల్యేలు తిరస్కరించారని తెలుస్తోంది. "రాజీనామాలను వెంటనే ఆమోదిస్తారో, లేదో తెలియదు. ఒకవేళ ఆమోదిస్తే ఆరునెలల్లో ఉప ఎన్నికలు వస్తాయి. గెలిస్తే... మన స్థానాలు మనకు దక్కుతాయి. ఒకటిరెండుచోట్ల ఓడితే...ఉన్న పరువూ పోతుంది. ఈ వ్యూహం సరికాదు" అని జగన్‌కు స్పష్టంచేసినట్లు తెలిసింది. ఇక... ఎప్పుడు పిలుపు ఇచ్చినా రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు సిద్ధం కావాలని మండలస్థాయి నేతలకు ఇప్పటి నుంచే ఆదేశాలువెళ్తున్నట్లు సమాచారం. ఒకవేళ... జగన్‌ను అరెస్టు చేస్తారనేఅంచనాతో ఇప్పటి నుంచే 'ఆందోళనలకు సిద్ధం' చేస్తున్నట్లు చెబుతున్నారు.

పనిచేయని 'పిలుపులు'

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో వైసీపీ చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఒక్కొక్కటిగా విఫలమవుతున్నాయి. ఫీజు పోరు, రైతుపోరు, నిరుద్యోగ పోరు, ఆరోగ్యశ్రీ బిల్లుల సమస్య వంటి వాటిపై జగన్ పిలుపు ఇచ్చిన నిరసన కార్యక్రమాలన్నీ విఫలమయ్యాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ఇంటింటికీ వెళ్లాలని పార్టీ శ్రేణులను జగన్ ఆదేశించారు. అయితే.. ఇప్పటిదాకా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారంచేసే కార్యక్రమాన్ని వైసీపీ చేపట్టలేకపోతోంది. జిల్లా కేంద్రాల్లో ఫంక్షన్‌హాల్‌లో మీటింగ్ పెట్టుకుని నాయకులు చేసే ఉపన్యాసాలకే ఈ కార్యక్రమం పరిమితమైంది.

ఢిల్లీలో టీడీపీ కార్యాలయానికి స్థలం ఇవ్వండి

▸▸ కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు టీడీపీ ఎంపీల బృందం వినతి

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటయించాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు టీడీపీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పార్లమెంటులో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ఆయన కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో టీడీపీ ఎంపీలు భేటీ అయ్యారు. దీన్ దయాళ్ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం పక్కనే టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఖట్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 6 కీలక పట్టణ మౌలిక సదుపాయాల (యూడీపీ) ప్రతిపాదనలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.39,362 కోట్ల పెట్టుబడితో నిర్మించే విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులను కేంద్రం ఆమోదించాలని టీడీపీ ఎంపీల బృందం కోరింది. మెట్రో రైల్ పాలసీ 2017 కింద మెట్రో రైలు ప్రాజెక్టులకు 100% కేంద్రం సహకారం అందించాలని విన్నవించింది. ఈ మెట్రో రైలు ప్రాజెక్టులు పట్టణ రవాణా, ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి సహకరిస్తాయని టీడీపీ ఎంపీలు చెప్పారు. ఎన్‌హెచ్-16పై విశాఖపట్నంలో (20 కి.మీ.), విజయవాడలో (4.7 కి.మీ.) ఇంటిగ్రేటెడ్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్, మెట్రో కారిడార్ల నిర్మాణానికి ఆమోదం ఇవ్వాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఎన్‌హెచ్ఏఐతో ఉమ్మడిగా డీపీఆర్ తయారీ, వ్యయ భరింపులపై చర్చలు జరిపేందుకు మంత్రిత్వ శాఖ సహకరించాలన్నారు. పీఎంఏవై అర్బన్ 2.0ని రాష్ట్రప్రభుత్వం చురుకుగా అమలు చేస్తోందని, ఇప్పటికే డీపీఆర్‌లు సమర్పించగా, 40 వేలకు పైగా గృహాలు మంజూరు అయినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఖట్టర్‌తో భేటీలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో పాటు టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దగ్గుమళ్ల ప్రసాదరావు నాయకత్వంలో ఆ పార్టీ ఎంపీలు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి జిల్లాల పునర్విభజన!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం 2022లో లోక్‌సభ స్థానాల ప్రాతిపదికన జిల్లాల పునర్విభజన చేపట్టిన సంగతి తెలిసిందే. 13 జిల్లాలను 26గా చేసింది. జిల్లాల ఏర్పాటు, అందుకు జరిగిన కసరత్తుపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరకు నాటి ప్రభుత్వంలోని మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో జగన్ సర్కారు అధికార యంత్రాంగాన్ని జిల్లాలకు పంపింది. దాదాపు 80 వేల అభ్యంతరాలు వచ్చాయి. వీటన్నిటినీ జగన్ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక.. జిల్లాల అంశంపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాల పేర్లు, వాటి సరిహద్దులు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దులు మార్చాలని కోరారు. వీటిపై తక్షణమే స్పందించకూడదని ప్రభుత్వ వర్గాలు తొలుత భావించాయి. జిల్లాల పునర్విభజన తమ పరిశీలనలో లేదని రెవెన్యూ మంత్రి అనగాని ఈ ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ వేదికగా స్పష్టత ఇచ్చారు. అయితే జిల్లాలు, డివిజన్, మండలాల సరిహద్దుల విషయంలో పాలనాపరంగా అనేక సమస్యలు వస్తున్నాయని అధికార వర్గాలు నివేదికలు పంపించాయి. కలెక్టర్లు, సీనియర్ అధికారులనుంచి కూడా పలు సూచనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచన చేసింది. మంత్రి వర్గ ఉపసంఘంతో అధ్యయనం చేయించాలని నిర్ణయించింది. అన్ని అంశాలనూ క్షుణ్ణంగా పరిశీలించి, అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నది ప్రభుత్వం ఉద్దేశమని అధికార వర్గాలు అంటున్నాయి. ఇందుకు అధిక సమయం పడుతుంది. అందుకే ఎప్పటిలోగా నివేదిక ఇవ్వాలో కాలపరిమితి నిర్దేశించలేదని సమాచారం.

ఉపసంఘం చేయాల్సింది ఇవీ..

- పరిపాలనా సౌలభ్యం కోసం వాస్తవిక పరిస్థితులనుదృష్టిలో పెట్టుకుని జిల్లాల పేర్లు ప్రతిపాదించాలి.
- జిల్లాలు, డివిజన్, మండలాల సరిహద్దుల వివాదాలను పరిశీలించి వాటికి పరిష్కారాలు చూపాలి. అలాగే జిల్లా కేంద్రానికి, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాలకు ప్రజలు సులువుగా చేరుకునేలా దూరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు ఇవ్వాలి.
- ఆయా ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని కాపాడుతూ జిల్లా, డివిజన్ యూనిట్ల సరిహద్దులను ప్రతిపాదించాలి.
- ఆయా ప్రాంతాల మధ్య ఆర్థిక-సామాజిక సమతుల్యతను పెంపొందించేలా ప్రతిపాదనలు ఇవ్వాలి.
- భౌగోళిక పరిమితితోపాటు సౌలభ్యంతో కూడిన పరిపాలన ఉండేలా ప్రతిపాదనలు రూపొందించి నివేదించాలి.
- ఇంకా ప్రజల నుంచి వచ్చే విన్నపాలు, ఫిర్యాదులను అధ్యయనం చేసి.. సరిహద్దులు ఎలా ఉండాలి.. జిల్లా ప్రధాన కేంద్రం ఎక్కడుండాలి.. జిల్లాల సాంప్రదాయిక పేర్లు ఎలా ఉండాలి.. పరిపాలనా సౌలభ్యం, వనరులన్నీ సర్దుబాటయ్యేలా ప్రతిపాదనలు ఇవాలి.

పంటలపై శాటిలైట్ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

చేయాలన్నారు. రైతు సేవా కేంద్రం నుంచి సూచనలు, సహకారం అన్నదాతలకు నిరంతర అందించాలని తెలిపారు. రీసర్వే అనంతరం రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి, వ్యవసాయ రికార్డులు కూడా నవీకరించాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపై సీఎం చంద్రబాబు నాలుగు గంటలకు పైగా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రైతులకు మేలు చేసేలా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు. పంటల ప్రణాళిక, ఉత్పత్తులకు విలువ జోడింపు, రైతులకు సహకారం అందించేందుకు కృత్రిమ మేథ(ఏఐ చాట్‌బాట్) వినియోగంపై చర్చించారు. ఏపీ ద్వారా అవసరమైన సమాచారం రైతులకు అందేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

వారికి ఈ-కేవైసీ పూర్తి

'అన్నదాత-సుఖీభవ' పథకం కింద ఇప్పటి వరకు 47,41,792 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయిందని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. 'ఈ-పంట' ద్వారా అర్హులను గుర్తించాలని, రాష్ట్రంలో ప్రతి రైతుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందాలని సీఎం సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని, త్వరలో సాగునీటి సంఘాలతో వర్చువల్‌గా సమావేశాలు నిర్వహించి, నేరుగా వారితో మాట్లాడతానని సీఎం చెప్పారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో దక్షిణ కోస్తాలో కొన్ని జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్‌లలో ప్రధాన ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయని, సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని తెలిపారు. ఇప్పటికే 9.9 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగులోకి వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్షాధార పంటలు పండించేలా పంటల కాలాన్ని సవరించాలని సూచించారు. దీనిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు రైతులతో సంప్రదింపులు జరపాలన్నారు.

పంటకాలం.. ముందుకు!

సీజన్‌ని ముందుకు తీసుకురాగలిగితే తుఫాన్లు, భారీ వర్షాల నుంచి రైతులు పంట నష్టపోకుండా జాగ్రత్త పడొచ్చని, ఇదే సమయంలో మరో పంటకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. "కరువు అనే మాట ఉండకూడదు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని, ప్రాజెక్టుల నుంచి తక్కువగా నీటిని వాడుకునేలా ప్రణాళికలు ఉండాలి. నీటి సంరక్షణ చర్యల ద్వారా భూగర్భ జలాలు పెరిగేలా చూడాలి. వెయ్యి టీఎంసీల మేర భూగర్భ జలాలు ఉండాలనేదే మన లక్ష్యం." అని సీఎం నిర్దేశించారు. అలాగే, కాలువలో పూడిక తీయించి, అంతరాయం లేకుండా నీరు పారేలా చూడాలని, వ్యవసాయ, జల వనరుల శాఖ సమన్వయంతో పని చేస్తే, రైతులకు ఫలితాలు అందుతాయని చెప్పారు. నీటి పంపిణీపై సాగునీటి సంఘాలతో కలిసి కసరత్తు చేయాలని సూచించారు. అలాగే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు కాలువల ద్వారా నీటిని విడుదల చేసి, చివరి ఆయకట్టు వరకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా గుంటూరు ప్రాంతానికి సాగునీరు అందించాలని సూచించారు.

సూక్ష్మ సేద్యం గేమ్ చేంజర్

ఉద్యాన పంటలకు సూక్ష్మ సేద్యమే 'గేమ్ చేంజర్' అవుతుందని సీఎం తెలిపారు. ప్రస్తుతం 16.17 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం కింద సాగువుతోందని, దీన్ని మరింత విస్తరించాలన్నారు. నీళ్ల లేని చోట మైక్రో ఇరిగేషన్, నీటి వనరుల లభ్యత ఉన్న చోట్ల ఫ్లడ్ ఇరిగేషన్ అమలుకు అధ్యయనం చేయాలని తెలిపారు. రాయలసీమలో సూక్ష్మసేద్యంతో పాటు కాలువ ద్వారా నీరిస్తే.. రైతులకు లాభమవుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను నగరాల్లో ఇంటి ముంగిటకు తీసుకెళ్లి,నేరుగా రైతులే విక్రయించేలా చూడాలని మార్కెటింగ్ శాఖకు సీఎం నిర్దేశించారు. వ్యవసాయఉత్పత్తుల ధరలు పెరగకుండా, తగ్గకుండా ఈ విధానం ఉపకరిస్తుందన్నారు. అన్ని నియోజకవర్గకేంద్రాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో మొబైల్ రైతు బజార్లు ప్రవేశపెట్టాలని, దీనిపై నెల రోజుల్లో కార్యాచరణ సిద్ధంచేయాలని ఆదేశించారు.

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం: రాష్ట్రంలో 36.71 లక్షల టన్నుల ఎరువులు వాడుతుండగా, గతేడాదితో పోల్చితే 12% తగ్గిందని, నిరుడు 1,733 టన్నుల పురుగు మందులు వాడారని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. అయితే, ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వాడడం వల్ల భూసారం తగ్గుతోందని, వినియోగాన్ని నియంత్రించి, రైతుల్ని ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆర్గానిక్, బయో ఫెర్టిలైజర్ల వినియోగంపై రైతులకు అవగాహన పెంచాలన్నారు. పంటల్ని చీడపీడల నుంచి రక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ విధానం తేవాలని, సాంకేతికతను వినియోగించి.. పురుగు మందుల వాడకం తగ్గించ వచ్చన్నారు. విత్తనాలు, ఎరువుల విక్రయంపై ట్రాకింగ్ జరగాలన్నారు.

ఆ మందుతో కేన్సర్

వరిలో కలుపు నివారణకు వినియోగించే మందుల్లోని కెమికల్స్ కారణంగా కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని అధికారులు సీఎంకు చెప్పారు. దీంతో ఎక్కడెక్కడ కేసులు పెరుగుతున్నాయో సమాచారం సేకరించి, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు టాటా సంస్థతో ఒప్పందం చేసుకునేందుకు సీఎం అనుమతించారు.

వారికి ఇతర పనులు వద్దు!

ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయ అధికారులను ఇతర విధులకు వినియోగించవద్దని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బర్లీ పొగాకు, తోతాపురి మామిడి, కొనుగోళ్లు, రైతులకు చెల్లింపులపై ఆరా తీశారు. పొగాకు రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా రెండు విడతల్లో బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆగస్టు 20లోగా బర్లీ పొగాకు కొనుగోలు పూర్తి చేయాలన్నారు. తోతాపురి మామిడి రైతులకు కూడా ఆగస్టు 15లోగా చెల్లించాలని ఆదేశించారు.

నాణ్యత పాటిస్తేనే సబ్సిడీ!

మెరుగైన ఆదాయం వచ్చే వాణిజ్య పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత విషయంలో రాజీ లేదని, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్లు ఉండాలన్నారు. చికెన్ వ్యర్థాలను దాణాగా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించే ఆక్వా రైతులకే సబ్సిడీ విద్యుత్ అందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. సముద్రంలో మత్స్య సంపద ఏ ప్రాంతంలో ఎక్కువగా లభిస్తుందో మత్స్యకారులకు యాప్ ద్వారా తెలియజేయాలని, సముద్రంలో ఉత్పత్తయ్యే సీవీడ్ ఎక్కువ మంది సాగు చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. బయోఫ్యూయల్‌గా కూడా సీవీడ్‌ను వినియోగించేలా అధ్యయనం చేయాలన్నారు. ఉద్యాన రంగంతో సమానంగా పశుపోషణ, ఆక్వా ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పశుసంవర్ధకంలో 15% వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించి, వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఇక నుంచి ప్రత్యేకంగా సమీక్షిస్తానని సీఎం చెప్పారు. సమీక్షలో మంత్రి అచ్చెన్న, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాడు గ్రహీత.. నేడు దాత!

▸▸ 2016లో 'విదేశీ విద్య' లబ్ధిదారుడు సాత్విక్ స్ఫూర్తి

▸▸ నలుగురు పేద విద్యార్థుల విదేశీ చదువుకు సాయం

▸▸ సాత్విక్‌ను అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, జూలై 22(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అంది వారి అభ్యున్నతికి ఉపయోగపడితే ఫలితం ఎలా ఉంటుందో చెప్పేందుకు చక్కటి ఉదాహరణగా నిలిచారు సాత్విక్ మురారి. 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. వాటిలో విదేశీ విద్య పథకం కింద 2016లో ఐర్లాండ్ వెళ్లిన సాత్విక్ మురారి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్ పూర్తిచేశారు. తర్వాత కొంతకాలం అక్కడే ఉద్యోగం చేశారు. ప్రస్తుతం ఐర్లాండ్‌లోనే వ్యాపారం నిర్వహిస్తున్నారు. నాడు ప్రభుత్వ సాయంతో చదువుకున్న తాను కొందరు పేద విద్యార్థులకు సాయం చేయాలనే ఉద్దేశంతో సాత్విక్ మంగళవారం సచివాలయానికి వచ్చి సీఎం చంద్రబాబును కలిశారు. నలుగురు పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి స్కాలర్‌షిప్ అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను సీఎం అభినందించారు. తిరిగి సమాజానికి కొంత ఇవ్వాలన్న సాత్విక్ ఆలోచన మిగిలినవారికి స్ఫూర్తి కావాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

సీఎంతో యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ భేటీ

▸▸ పాల్గొన్నలులూ గ్రూప్ సీఎండీ యూసఫ్ అలీ



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లతో అబ్దుల్లా బిన్, యూసఫ్ అలీ తదితరులు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్(యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ సమావేశమయ్యారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ భేటీలో ఏపీలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. లులూ ఇంటర్నేషనల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యూసఫ్ అలీ, లులూ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ ఎండీ అదీబ్ అహ్మద్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. విజయవాడలో లులూ మాల్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

మద్యం స్కాంపై జగన్ నోరువిప్పరేం: యనమల



అమరావతి, జూలై22(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో 90 శాతం వాటా జగన్‌రెడ్డికి అందిందని సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న తర్వాత కూడా జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ప్రజలను పీడించి, వారి ఆరోగ్యాన్ని పణంగా పెట్టి.. భారీ అవినీతికి పాల్పడిన జగన్ ప్రజల దగ్గరకు వెళ్లి ఎలా ముఖం చూపించగలరని ప్రశ్నించారు.

అది విషమే!



(మొదటి పేజీ తరువాయి)

రసాయనాలున్నాయని ఈ పరీక్షల్లో తేలింది. ఆ మద్యం తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలను సవివరంగా నివేదికలో పొందుపరిచారు. అయితే... నాటి ప్రభుత్వం ఆ రిపోర్టు తప్పు అని దానిని మార్చేలా ఎస్‌జీఎస్ ల్యాబ్స్‌పై ఒత్తిడి చేసింది. విషయం పెద్దది కాకుండా ఆ నివేదిక మార్చాలని ఎస్‌జీఎస్ ల్యాబ్స్‌పై ఒత్తిడి చేసింది. అధికారం చేతిలో ఉండటంతో బలవంతంగా నివేదికలో మార్పులు చేయించింది!

ఆరోపణలను తొక్కిపెట్టారు

జగన్ హయాంలో మద్యం తేడాగా ఉందని, మరీ నాసిరకం సరుకు విక్రయిస్తున్నారని అప్పటికే జనం గ్రహించారు. మరీ అలవాటుగా రోజూ తాగే వాళ్లను మినహాయిస్తే... ఎప్పుడో ఒకసారి మద్యం సేవించే 'సోషల్ డ్రింకర్స్' ఏపీ మద్యాన్ని దూరం పెట్టేశారు. అదే సమయంలో ఎస్‌జీఎస్ ల్యాబ్స్ నివేదిక వెల్లడైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' అప్పుడే ప్రత్యేక కథనం ప్రచురించింది. అన్ని ఆరోపణలు వచ్చినా నాటి జగన్ సర్కారు పట్టించుకోలేదు. అడ్డగోలుగా అదే మద్యం అమ్మకాలు కొనసాగించింది. దీంతో 'జే' బ్రాండ్లు తాగిన అనేక మంది అనారోగ్యం పాలయ్యారు. కొంతమంది ప్రాణాలూ కోల్పోయారు.

'జులాయి' చిత్రం

'అరేయ్.. బిట్టూ! రుషికొండ నుంచి భీమిలి వెళ్లే మలుపులో ఓ బిట్టుంది. అక్కడ కూర్చుంటే విశాఖపట్నం మొత్తం మన కాళ్లకింద ఉన్నట్లు ఉంటుంది. అక్కడ కూర్చోవాలంటే పవర్ ఉండాలి. అది కావాలంటే కనీసం వెయ్యి కోట్లు ఉండాలి. వెళ్లి తెచ్చేయ్' అని కోటా శ్రీనివాసరావు చెబుతాడు. బిట్టూ బ్యాంకు దోపిడీకి బయలు దేరగానే.. ఆ బృందంలోని యువతి సైగలతో.. 'ఎనిమిది మందిని ఎంపిక చేసుకో.. ఒకరితో ఒకరికి సంబంధం ఉండ కూడదు.. నువ్వు ప్లాన్ చేస్తున్నావని తెలియ కూడదు..' అని సూచించడంతో విలన్ ఎనిమిది మంది యువకులను పోగేసి, బ్యాంకు దోపిడీ చేస్తాడు! ఇది... 'జులాయి' సినిమా! జగన్ హయాంలో జరిగిన 'మద్యం దోపిడీ'ని కూడా ఇదే కథతో పోల్చుతూ సోషల్ మీడియాలో వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. అదెలాగంటే...

"రుషికొండపై ప్యాలెస్ కట్టుకుని కూర్చుంటే విశాఖపట్నం మొత్తం మన కాళ్ల కింద ఉన్నట్లు ఉంటుంది.. అక్కడ కూర్చోవాలంటే మనకు మళ్లీ మళ్లీ పవర్ దక్కాలి. దాని కోసం వేల కోట్లు కావాలి. ప్రతి నెలా లిక్కర్ నుంచి 60కోట్లు కమీషన్లు వచ్చేలా ప్లాన్ చెయ్!" అని జగన్ ఏ1 రాజ్ కసిరెడ్డిని ఆదేశిస్తారు. ఇక... సినిమాలో విలన్ 8 మందిని పోగేసుకున్నట్లుగా రాజ్ కసిరెడ్డి టెక్కలి, విశాఖపట్నం, అమలాపురం, కాకినాడ, తిరుపతి, శ్రీకాళహస్తి, హైదరాబాద్‌కు చెందిన 8 మందిని యువకుల్ని పోగేసి 'టీమ్' తయారు చేసి లిక్కర్ స్కామ్ అమలు చేస్తాడు. ఇదీ సంగతి. సినిమాలో బిట్టూ ఆటను హీరో కట్టించేస్తాడు. ఇక్కడ... లిక్కర్ ముఠా గుట్టును 'సిట్' లాగేస్తోంది.

అసలు నివేదిక ఏం చెప్పింది?

మద్యం అంటేనే ఆరోగ్యానికి హానికరం! కొన్ని ప్రతికూల అంశాలు కచ్చితంగా మద్యంలో ఉంటాయి. అయితే... జగన్ హయాంలో ప్రవేశపెట్టిన బ్రాండ్లలో, సాధారణ ప్రతికూలతను దాటి ఆందోళన కలిగించే అనేక అంశాలు బయటపడ్డాయి. ఆ మద్యం తాగితే తలెత్తే ప్రమాదాలపై ఎస్‌జీఎస్ తన నివేదికలో స్పష్టంగా వివరించింది. "జే-బ్రాండ్ మద్యం వల్ల చర్మం పైపొరల్లోని సన్నని నరాలు క్రమంగా బలహీనపడతాయి. దీర్ఘకాలంలో రక్త ప్రసరణపై ప్రభావం చూపుతుంది. మందు తాగిన 10 నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఆయాసం వస్తుంది. మూత్ర సంబంధిత వ్యాధులు తలెత్తుతాయి" అని తెలిపింది.

బ్రాండ్ 1: ఇది దీర్ఘకాలిక విషపూరితం(స్లో పాయిజన్) లాంటిది. ఒక్కసారిగా శ్వాసక్రియ పెరుగుతుంది. బీపీ పడిపోతుంది. నాడీ వ్యవస్థ పనితీరు ఒక్కసారిగా వేగవంతమవుతుంది. తల తిరగడం, తలనొప్పి, కడుపు నొప్పి, వాంతులు, అతిసారం, మానసిక ఆందోళన, కళ్ల మంటలు, చర్మం దురద, లివర్ సంబంధిత వ్యాధులు వస్తాయి.

బ్రాండ్ 2: ఇది కూడా స్లో పాయిజన్. దగ్గు, గొంతు నొప్పి, చర్మం కందిపోవడం, కళ్లు ఎరుపెక్కడం, వాంతులు, అతిసారం, శ్వాసక్రియ పెరగడం, బీపీ పడిపోవడం, నాడీ వ్యవస్థ పనితీరు వేగవంతం కావడం లాంటి ప్రతికూల పరిణామాలు ఏర్పడతాయి. బ్రాండ్ 3, 4ల్లో కూడా ఇలాంటి అంశాలే ఉన్నాయి.

బ్రాండ్ 5: ఇది తీవ్రమైన విషపూరితం. చర్మానికి తాకితేనే చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి. దాని ఆవిరి పీల్చినా విషపూరిత ప్రమాదం అవుతుంది. దగ్గు, గొంతునొప్పి, వాంతులు, అతిసారం లాంటి సమస్యలూ తలెత్తుతాయి.

ఆ బ్రాండ్లపై అనేక అనుమానాలు

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక కొత్త బ్రాండ్లు వచ్చాయి. అంతకు ముందు ఎప్పుడూ వినని లోకల్ బ్రాండ్లను తెరపైకి తెచ్చారు. వాటిలో ఎక్కువ బ్రాండ్లు ప్రమాణాలు పాటించలేదు. తక్కువ కాలంలో ఎక్కువ మద్యం సరఫరా చేసే క్రమంలో నాణ్యత, ప్రమాణాలను గాలికొదిలేశారు. దీర్ఘకాలం మద్యం వ్యాపారం చేయాలి, మార్కెట్‌లో విశ్వసనీయతను కాపాడుకోవాలి, వినియోగదారుల ఆదరణ పొందాలి... ఇలాంటి ఉద్దేశాలేవీ లేకపోవడం, తక్కువకాలంలోనే ఎక్కువ సంపాదించాలనే అత్యాశతో ప్రమాణాలను అస్సలు పట్టించుకోలేదు. అనుమతి వచ్చీరాగానే లక్షల కేసుల మద్యాన్ని ఆ కంపెనీలు సరఫరా చేశాయి. అంత తక్కువ కాలంలో ఆ స్థాయిలో మద్యం ఎలా తయారుచేశారు? తక్కువ సమయంలో పరీక్షలు నిర్వహించారా? అనే అనేక అనుమానాలూ ఉన్నాయి.

అదే ధరకు నాణ్యమైన మద్యం

వాస్తవానికి జే బ్రాండ్లకు ప్రభుత్వం అడ్డగోలుగా ధరలు పెంచింది. కేసు ధర రూ.700 నుంచి రూ.వెయ్యి దాటింది. సొంత బ్రాండ్లు కావడంతో ధరలు పెంచుకుని ఇష్టారాజ్యంగా అమ్ముకున్నారు. అయితే, అదే ధరకు ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసిన పాపులర్ బ్రాండ్ల కంపెనీలు నాణ్యమైన మద్యాన్నే సరఫరా చేశాయి. ఒక కేసులో 48 క్వార్టర్ సీసాలుంటాయి. కేసుకు రూ.700.. అంటే ఒక్కో సీసా ఉత్పత్తికి రూ.15 అవుతోంది. అందులోనే ఆ కంపెనీ లాభాలు, ఖర్చులు అన్నీ ఉంటాయి. అదే సీసాను పన్నులు కలిపి ప్రభుత్వం రూ.150 నుంచి రూ.200 వరకు అమ్ముతుంది. అయితే, జే బ్రాండ్లకు ఒక్కో సీసాకు రూ.20 వరకు చెల్లించారు. అంటే ఒక్క సీసాపైనే రూ.5 అదనం! అంటే కోట్ల సీసాలపై ఎంత మేర దోచిపెట్టారో అర్థంచేసుకోవచ్చు. క్వార్టర్ సీసాపై రూ.10 కూడా ఖర్చు చేయకుండా ప్రభుత్వం నుంచి రూ.20 తీసుకున్నారు. అదే ధర మాకు కూడా ఇవ్వాలని పాపులర్ బ్రాండ్లు కోరితే నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఇలా తయారు చేయాలి..

మద్యం ఉత్పత్తిలో ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్(ఈఎన్ఏ) కీలకం. ఇందుకోసం తొలుత రెక్టిఫైడ్ స్పిరిట్(ఆర్ఎస్) తయారుచేస్తారు. చీప్, మీడియం రకాల బ్రాండ్లకు బియ్యం నూకతోనే ఈఎన్ఏ తయారవుతుంది. మొదట ఆర్ఎస్ తయారుచేస్తారు. ఆర్ఎస్‌లో 50శాతం దాటి ఆల్కహాల్ ఉండాలి. దానిని మరింత శుద్ధిచేసి 68శాతానికిపైగా ప్యూరిటీ వస్తే దానిని ఈఎన్ఏ అంటారు. అప్పుడే మద్యం తయారుచేయాలి. ఈఎన్ఏకు ఆ బ్రాండ్ ఫ్లేవర్, రంగు, నీరు కలిపి బాటిలింగ్ చేస్తారు. ఒక్కో మద్యం బాటిల్‌లో 42.2శాతం ఆల్కహాల్ ఉంటే, మిగిలింది నీరు ఉంటుంది. అయితే... ఆర్ఎస్‌ను 68శాతం వరకు శుద్ధి చేయకపోతే ఆ మద్యం ప్రమాదకరంగా మారుతుంది. పూర్తిగా శుద్ధి చేయకుండానే ఈఎన్ఏగా భావిస్తే అందులో మలినాలు, ఇతరత్రా రసాయనాలు మిగిలిపోతాయి. అవి మానవ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.

ఈఎన్ఏ అంత వాడలేదా?

ఒక కేసు మద్యం తయారీకి నాలుగు లీటర్ల ఈఎన్ఏ వినియోగించాలి. జే బ్రాండ్లలో అంత ఈఎన్ఏ వాడలేదనేది ప్రధాన ఆరోపణ. అందుకే ఆ బ్రాండ్లు తాగినా సరిగా మత్తు ఎక్కలేదని, కిక్కు కోసం మరింత ఎక్కువ మద్యం తాగేవారని మద్యం తయారీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఆర్ఎస్‌ను పూర్తిగా శుద్ధి చేయకుండా ఈఎన్ఏ తయారు చేయడం వల్ల త్వరగా మత్తు ఎక్కి, త్వరగా దిగిపోయే అవకాశమూ ఉందని అంటున్నారు.

ఇలా చేశారా?

డిస్టిలరీల్లో మద్యం తయారీకి ముందు ప్రతి బ్యాచ్‌లో మూడు సీసాలను ల్యాబ్స్‌కు పరీక్షలకు పంపాలి. అంతకు ముందు మద్యం తయారీకి సిద్ధం చేసిన ద్రావణాన్ని 24గంటలు నిల్వ ఉంచాలి. కానీ, ఎక్కువ మద్యం సరఫరా చేసే ఆత్రుతలో ఈ నిబంధనలను పెద్దగా పట్టించుకోలేదని, కొన్నిసార్లు ల్యాబ్స్ నుంచి రిపోర్టులు రాకముందే బాటిలింగ్ చేయించారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ఆ మద్యం తాగిన తర్వాత పిచ్చిపిచ్చిగా అనిపించడం వంటి అనారోగ్య సమస్యలు పెరిగాయి.

చాణక్య, వరుణ్.. దుబాయ్‌లో మా ఫ్లాట్‌లోనే ఉన్నారు!

- రెండు నెలల పాటు ఆరుగురి మకాం
- సిట్‌కు లిక్కర్ స్కాం నిందితుల ఫుటేజీ, ఫొటోలు ఇచ్చిన 'ఆకర్ష్' కృష్ణ

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణం కేసు నిందితులు దుబాయ్‌లోని తన ఫ్లాట్‌లో రెండు నెలలు ఉన్నారని సదరు ఫ్లాట్ సహయజమాని, హైదరాబాద్‌కు చెందిన ఆకర్ష్ కృష్ణ తెలిపారు. సీసీ ఫుటేజీతో పాటు వారి ఫొటోలను కూడా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులకు ఇచ్చారు.. కేసు దర్యాప్తులో భాగంగా సిట్ తనకు నోటీసు ఇవ్వడంతో కృష్ణ మంగళవారం విజయవాడలోని పోలీసు కమిషనరేట్‌కు విచారణకు వచ్చారు. 'దుబాయ్‌లోని పారమౌంట్ టవర్స్‌లోని రెసిడెన్స్‌లో శ్రవణ్‌రావుతో కలిసి 5801 నంబర్ ఫ్లాట్ కొనుగోలు చేశాను. అద్దె వ్యవహారాలన్నీ ఆయనే చూసుకుంటున్నారు.. నాకు ఏమీ చెప్పకపోవడంతో నేరుగా అక్కడి వారిని సంప్రదించా.. ఓనర్‌షిప్ డాక్యుమెంట్లు అడగడంతో చూపించా.. అప్పటి నుంచి ఆ ఫ్లాట్‌లో జరిగే కార్యకలాపాల వివరాలు చెబుతున్నారు.. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకూ శ్రవణ్‌రావు, బూనేటి చాణక్య, వరుణ్ పురుషోత్తం, మరో ముగ్గురు అదే ఫ్లాట్‌లో ఉన్నారు.. నేనెవరికీ అద్దెకు ఇవ్వలేదు.. లిక్కర్ స్కాం నిందితులతో నాకెలాంటి సంబంధం లేదు' అని సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.

రెండు కేజీల పులస రూ.26వేలు

- యానాం మార్కెట్లో రికార్డు ధరకు కొనుగోలు



యానాం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో మంగళవారం ఓ పులస చేపకు రికార్డు ధర పలికింది. గత వారం వ్యవధిలో రెండు పులసలు వరుసగా రూ.18వేలకు, రూ.22వేలు అమ్ముడుపోగా, మంగళవారం ఓ మత్స్యకారుడికి 2కేజీల బరువు ఉన్న పులస వలకు చిక్కింది. దీనిని ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన బెజవాడ సతీశ్ రూ.26వేలకు కొనుగోలు చేశారు.

'ఏపీ డీజీపీ గారి తాలూకా'!

- జగన్ ఇంటి వద్ద కనిపించిన కానిస్టేబుల్ బైక్



తాడేపల్లి టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ద్విచక్రవాహనాలు, కార్లపై 'పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా', 'మంగళగిరి ఎమ్మెల్యే తాలూకా' అని రాసి ఉండడాన్ని చూసి ఉంటాం. కానీ ఇందుకు భిన్నంగా ఓ పోలీసు కానిస్టేబుల్ తన బైక్ నంబరు ప్లేట్‌పై 'ఏపీ డీజీపీ గారి తాలూకా' అని ఉండటం పలువురిని ఆశ్చర్యపరిచింది. మంగళవారం ఈ వాహనం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ఇంటి వద్ద కనిపించింది. ఈ బైక్ జగన్ ఇంటి వద్ద బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్‌దిగా తెలిసింది!. నంబరు ప్లేట్లు సక్రమంగా లేని వాహనాదారులకు ఫైన్లు విధించే పోలీసులే.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమిటన్న విమర్శలు వినిపించాయి!

సుప్రీంకోర్టులో కల్తీ నెయ్యి పిటిషన్‌ను ఉపసంహరించుకున్న వైవీ సుబ్బారెడ్డి

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి కేసు దర్యాప్తుపై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఉపసంహరించుకున్నారు. ఈకేసులో సిట్ దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగడం లేదని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విశ్రాంత న్యాయమూర్తి లేదా నిపుణులతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ గతనెల 11న వైవీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ కే వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషన్ ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇవ్వాలని, ఇతర న్యాయమార్గాలు పరిశీస్తున్నామని వైవీ తరఫున సీనియర్ న్యాయవాది చెప్పారు. పిటిషన్ ఉపసంహరణకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

'మద్యం' ఓ కల్పిత కేసు

- నా వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు
- న్యాయాధికారి ముందు ధనుంజయరెడ్డి వాదన



విజయవాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): "మద్యం కుంభకోణం.. అనేది ఓ కల్పిత కేసు. ఈ విషయాన్ని నేను ఖచ్చితంగా చెబుతున్నా. ఈ కేసులో పత్రికలకు లీకులు ఇచ్చి సిట్ అధికారులు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. నా కుటుంబం బయటతిరగడానికి భయపడుతోంది." అని మాజీ ఐఏఎస్ అధికారి కె. ధనుంజయరెడ్డి ఏసీబీ కోర్టులో వాదన వినిపించారు. ధనుంజయరెడ్డి రిమాండ్ పొడిగింపు నిమిత్తం పోలీసులు మంగళవారం ఆయనను కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టుహాల్లో న్యాయాధికారికి తన ఆవేదనను చెప్పుకొన్నారు. "మేం ఎకరం విస్తీర్ణం ఉన్న జైల్లో ఉన్నాం. కొంతమంది భవనాలు, టెర్రస్‌లు ఎక్కి ఫొటోలు తీస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే పైనుంచి ఆదేశాలున్నాయని, మేం ఏం చేయగలం? అని సమాధానం చెబుతున్నారు. మేం ఇప్పటికే జైల్లో ఉన్నాం. ఇంకేం చేస్తాం?. మా వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు. మా కుటుంబాలను టార్గెట్ చేస్తున్నారు. నేను విలాసవంతమైన కార్లు వాడుతున్నానని పత్రికల్లో రాయించారు. నాకు శాంత్రో కారు, నా భార్యకు మరో కారు ఉన్నాయి. ఈ రెండు ఖరీదైన కార్లా?. లిక్కర్ పాలసీ విషయంలో నేను ఐదుగురితో మాట్లాడినట్లు పత్రికల్లో రాశారు. వారిలో ముగ్గురిని నేను కలిశాను. మిగిలిన ఇద్దరు ఎవరో తెలియదు. వాళ్లను నేనెప్పుడూ చూడలేదు. దీనిపై ఏ దర్యాప్తు సంస్థతో విచారణ చేయించినా సిద్ధంగా ఉన్నా. ఈ కేసుకు సంబంధించిన విషయాలను సిట్ ఉద్దేశపూర్వకంగా లీక్ చేసి వార్తలు రాయిస్తోంది. గత 20 రోజుల పత్రికలను చదివితే చార్జిషీటును చదవాల్సిన అవసరం లేదు. కోర్టుకు మాకు మీడియాతో మాట్లాడే అవకాశం లేదు. మరొకరికి చెప్పుకొనే అవకాశం అంతకన్నా లేదు. అందుకే మీకు మా బాధను చెప్పుకొంటున్నాం. ఈ విషయాలన్నీ చెప్పాను కాబట్టి 'సిట్ నన్ను ఇంకా టార్గెట్ చేస్తుంది. దానికి నేను సిద్ధమే' అని అన్నారు. దీనిపై న్యాయాధికారి పి.భాస్కరరావు సిట్ దర్యాప్తు అధికారి శ్రీహరిబాబును వివరణ కోరారు. తాము ఎలాంటి సమాచారాన్నీ లీక్ చేయడం లేదని స్పష్టం చేశారు. సిట్‌కు సంబంధించిన ప్రతి సమాచారం గోప్యంగానే కోర్టుకు అందజేస్తున్నామని వివరించారు.

ఆ నగదుపై వివరణ ఇవ్వండి

- చెవిరెడ్డి, బాలాజీకి సిట్ నోటీసులు జారీ

విజయవాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): రిమాండ్ పొడిగింపు నిమిత్తం కోర్టుకు వచ్చిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన పీఏ బాలాజీ కుమార్ యాదవ్‌కు సిట్ పోలీసులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో జగ్గయ్యపేటలోని గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న రూ. 8 కోట్లు, ఇండోర్‌లో బాలాజీ కుమార్ యాదవ్‌ను అరెస్టు చేసినప్పుడు సీజ్ చేసిన రూ. 3.50 లక్షలను లిక్కర్‌కు సంబంధించిన డబ్బుగా భావించి సీజ్ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని అడిగారు. కోర్టులోనూ నోటీసులు దాఖలు చేశారు.

మిథున్‌కు ఇంటి భోజనం

2 పూటలూ ఒకేసారి తీసుకెళ్లడానికి కోర్టు అనుమతి

- ప్రత్యేక సెల్, సహాయకుడు, టేబుల్, పెన్ను, పేపర్లు, పత్రికలు, టీవీ, మినరల్ వాటర్, కూలర్, కమోడ్, మందులు ఏర్పాటు చేయాలి
- ఫ్యామిలీతో, న్యాయవాదులతో వారానికి మూడేసి చొప్పున ములాఖత్‌లు
- తీర్పును వెలువరించిన ఏసీబీ కోర్టు



విజయవాడ/రాజమహేంద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న వైసీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి ఇంటి నుంచి అల్పాహారం, రెండుపూటలా భోజనాన్ని తీసుకెళ్లడానికి విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతిచ్చింది. ములాఖత్‌ల సమయంలో న్యాయవాదులు, కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు ప్రత్యేక గదిని కేటాయించాలన్న అభ్యర్థనను కొట్టేసింది. మిథున్‌రెడ్డి జైల్లో తనకు కల్పించాల్సిన సదుపాయాలపై పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంచం, కుర్చీ, టేబుల్, టీవీ, సహాయకుడు (అటెండర్), ప్యూరిఫైడ్ మంచినీళ్ల సీసాలు, ముక్కులో వేసుకునే చుక్కల మందు, యోగా మ్యాట్, మల్టీవిటమిన్ మందులు, చేపనూనె మందులు, ప్రొటీన్ పౌడర్, దిండు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కేంద్ర కారాగారం నుంచి డీఎస్పీ వెంకటేశ్వరరావు కోర్టుకు హాజరై వాదనలు వినిపించారు. జైలు మాన్యువల్ ప్రకారమే తాము మిథున్‌రెడ్డికి సదుపాయాలు కల్పించామన్నారు. మిథున్‌రెడ్డి తరఫున న్యాయవాదులు, జైలు అధికారి వాదనలు విన్న అనంతరం మంగళవారం రాత్రి న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పు వెలువరించారు. మిథున్‌రెడ్డికి ప్రత్యేక సెల్, టేబుల్, కుర్చీ, టేబుల్ మ్యాట్, పెన్, పేపర్లు, పత్రికలు, సహాయకుడిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంటి నుంచి ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజనం తీసుకెళ్లడానికి అనుమతిచ్చారు. ఈ మూడింటినీ ఒకేసారి తీసుకెళ్లాలని, తీసుకెళ్లిన వ్యక్తి జైలు అధికారులకు పూచీకత్తు రాసి ఇవ్వాలని స్పష్టం చేశారు. వారంలో న్యాయవాదులతో మాట్లాడుకోవడానికి మూడు ములాఖత్‌లు, కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవడానికి మూడు ములాఖత్‌లు ఇచ్చారు. సెల్‌లో టీవీ లేకపోతే పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు దానిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినరల్ వాటర్ బాటిళ్లు, సెల్ కూలర్ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన మందులు అందజేయాలని, అందుబాటులో లేనిపక్షంలో బయటి నుంచి కొని తెప్పించాలని ఆదేశించారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెస్ట్రన్ కమోడ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు.

మిథున్‌రెడ్డితో వైసీపీ నేతల ములాఖత్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో మిథున్‌రెడ్డిని మంగళవారం ములాఖత్ ద్వారా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దాట్ల పృథ్వీరాజ్ కలిశారు. అనంతరం జైలు బయట వేణు మాట్లాడుతూ.. మిథున్‌రెడ్డిని జైలులో ప్రజాప్రతినిధిగా పరిగణించడం లేదని, సాధారణ ఖైదీగానే చూస్తున్నారని అన్నారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ.. ప్రభుత్వమే అమ్మకాలు చేసినప్పుడు మద్యం కుంభకోణం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి కోర్టును కోరిన ప్రత్యేక సదుపాయాలకు సంబంధించి మంగళవారం తమకు ఎలాంటి ఉత్తర్వులూ అందలేదని జైలు సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. కాగా మిథున్‌రెడ్డి కుటుంబం రాజమహేంద్రవరంలో ఉండటానికి అపార్టుమెంట్ల వంటివికాకుండా విలాసవంతమైన ఇల్లు అద్దెకు తీసుకోవాలని నిర్ణయించారు. మాజీ ఎంపీ భరత్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటిని వెదికే పనిలో ఉన్నారు.

కోర్టు హాల్లో చెవిరెడ్డి కంటతడి

- న్యాయాధికారికి వాదనను వినిపిస్తూ భావోద్వేగం
- తన తండ్రి మద్యం వ్యాపారం చేశారని, బాగా డబ్బులు వస్తాయన్నా తాను ఆ వ్యాపారం చేయలేదని వెల్లడి



విజయవాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మద్యం స్కాం నిందితుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఎదుట కంటతడి పెట్టుకున్నారు. నిందితులందరినీ కోర్టు హాల్లో ప్రవేశపెట్టినప్పుడు ఒక్కొక్కరూ తమ వాదనను వినిపించారు. చెవిరెడ్డి తన వాదన వినిపిస్తూ.. తన తండ్రి మద్యం వ్యాపారం చేశారని, ఆ వ్యాపారం చేయాలని, బాగా డబ్బులు వస్తాయని తనకూ చెప్పారని అన్నారు. తండ్రి, తమ్ముడు మద్యం కారణంగానే చనిపోయారన్నారు. నాటినుంచి తాను మద్యం జోలికి వెళ్లలేదన్నారు. తనకు మద్యం కేసుతో సంబంధం లేదన్నారు. చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్నానంటూ కంటతడి పెట్టుకున్నారు. రిమాండ్‌ను పొడిగించాక కుటుంబ సభ్యులతో భేటీ అయ్యేందుకు ఆయనకు సమయం ఇచ్చారు. చెవిరెడ్డితో ఆయన సతీమణి, చిన్న కుమారుడు మాట్లాడారు.

'లిక్కర్' నిందితుల రిమాండ్ పొడిగింపు

మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్‌ను ఆగస్టు 1వరకూ పొడిగిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూనేటి చాణక్య, పైలా దిలీప్, కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్‌నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణను పోలీసులు మంగళవారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేదని, బెయిల్ ఇప్పించాలని దిలీప్ విన్నవించాడు. బెయిల్ పిటిషన్‌పై త్వరలో తీర్పు వెలువరిస్తానని న్యాయాధికారి అన్నారు.

చెవిరెడ్డి బెయిల్‌పై తీర్పు 28కి వాయిదా

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. ఇరువైపుల వాదనలు విన్న న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పును ఈనెల 28కి వాయిదా వేశారు. చెవిరెడ్డి తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. చెవిరెడ్డిపై నమోదైన అన్ని కేసులను కోర్టులు కొట్టేశాయని తెలిపారు. దీనికి ప్రాసిక్యూషన్ తరఫున రాజేంద్రప్రసాద్ అభ్యంతరం చెప్పారు. చెవిరెడ్డిపై నమోదైన 40 శాతం కేసుల్లో ఇంకా తీర్పులు రాలేదన్నారు. కాగా, జైల్లో వంట చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ చెవిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ అనంతరం న్యాయాధికారి తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

విజయసాయిరెడ్డి అల్లుడిపై కేసు

- భీమిలి బీచ్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారంలో నమోదు

విశాఖపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం భీమిలి బీచ్‌లో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడు పి. రోహిత్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ నెల 10న భీమిలి పోలీసులు కేసు నమోదు చేయగా విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ఉన్న సర్వే నం.1516, 1517, 1518, 1519, 1522లలో సాయిరెడ్డి విశాఖపట్నం వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు నిర్మాణాలు చేపట్టిన సంగతి తెలిసిందే. అనుమతులు తీసుకోకుండా పనులు చేశారంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమ నిర్మాణాలు వాస్తవమేనని నిపుణుల కమిటీ నివేదిక సమర్పించడంతో బాధ్యులపై పర్యావరణ నిబంధనల ఉల్లంఘన కింద కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ శరవణన్, జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఎన్ఐవో శాస్త్రవేత్త శర్మ సంయుక్తంగా భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మాణ సంస్థ అవ్యాన్ రియల్టర్స్, సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె భర్త రోహిత్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలాఉండగా బీచ్‌లో చేపట్టిన నిర్మాణాలన్నీ పూర్తిగా తొలగించారో, లేదో నిర్ధారించుకోవడానికి రెండు రోజుల్లో కేంద్ర కమిటీ విశాఖకు రానున్నట్టు తెలిసింది.

పేర్ని, అనిల్‌పై రేపటి వరకు చర్యలొద్దు: హైకోర్టు



అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు పేర్ని నాని, కైలే అనిల్ కుమార్(పామర్రు మాజీ ఎమ్మెల్యే)లపై గురువారం వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వైసీపీ కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వ్యవహారంపై పామర్రు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ ఇరువురూ వేసిన క్వాష్ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ వై.లక్ష్మణరావు విచారణ జరిపారు. ఈ కేసులలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తారని, అనారోగ్య కారణాల వల్ల ఆయన విచారణకు హాజరుకాలేకపోయారని ఏపీపీ నీలోత్పల్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ.. తదుపరి విచారణ వరకు పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని కోరారు. దీంతో న్యాయమూర్తి విచారణను గురువారానికి వాయిదా వేశారు. అప్పటివరకు పిటిషనర్లపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. వైసీపీ కార్యకర్తల సమావేశంలో టీడీపీ, జనసేన కార్యకర్తలను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని, చెప్పకుండా నరికేయాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని మచిలీపట్నం టీడీపీ పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.

'వాన్‌పిక్' కేసు విచారణ.. 4 వారాలకు వాయిదా

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో భాగమైన వాన్‌పిక్ (వాడరేవు, నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్స్) భూముల కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చడంపై వైసీపీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దానిని కోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే 30న ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ కేసులో వాదనలను నాలుగు వారాల తర్వాత వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసుల జాబితా ప్రకారం ఆగస్టు 26న ఈ కేసు విచారణకు వచ్చే అవకాశముంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.